
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 179

గురువారం 14-3-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అగ్రస్థానానికి అశ్విన్

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆరోసారి నంబర్‌వన్ - 12లో



చిన్న షేర్ల పెద్ద క్రాష్

కుప్పకూలిన ఈక్విటీ మార్కెట్.. 73 వేల దిగువకు సెన్సెక్స్ - 13లో



22,217 ఎలక్టోరల్ బాండ్లు

ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు జారీ చేయగా.. వీటిని పార్టీలకు విరాళంగా ఇచ్చారని సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ తెలిపింది.

వివరాలు 6లో ▶



పేలుడు కేసులో ఒకరి విచారణ

బెంగళూరు బాంబు పేలుడు నిందితుడితో సంబంధముందన్న అనుమానంతో షబ్బీర్ అహ్మద్ అనే వ్యక్తిని ఎన్‌ఐఏ విచారించింది.

వివరాలు 6లో ▶



మళ్లీ వీళ్లిద్దరే..

అమెరికా అధ్యక్ష రేసులో మళ్లీ బైడెన్, ట్రంప్‌లే నిలిచారు. తమ పార్టీల తరఫున అభ్యర్థిత్వాలను వారు గెలుచుకున్నారు.

వివరాలు 6లో ▶



రష్యా వైపు చూస్తే అణు యుద్ధమే

తమ దేశానికి ముప్పు తలెత్తితే అణ్వాయుధాలు ప్రయోగించడానికి వెనుకాడబోమని రష్యా అధినేత పుతిన్ హెచ్చరించారు.

వివరాలు 6లో ▶

ఫ్యాక్ట్‌చెక్

'కాపు' కాసిందే జగన్..

- జగన్ సర్కారుపై విషం కక్కిన 'ఈనాడు'
- కాపు కార్పొరేషన్‌కు బాబు ప్రకటించిందే రూ.1,874.67 కోట్లు.. అందులో విడుదల చేసింది రూ.1,334 కోట్లే
- సీఎం జగన్ కాపు కార్పొరేషన్ ద్వారా కలిగించిన లబ్ధి రూ.15,044.64 కోట్లు
- ఈ ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా కాపులకు రూ.39,317.80 కోట్లు

- వివరాలు 3లో

రామోజీ బధిర రాతలు

- ఐదేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు
- బెస్ట్ ప్రాక్టీస్‌లను కీర్తించిన నీతిఆయోగ్.. ప్రతి జిల్లాకు రెండు చొప్పున క్లస్టర్లు
- వివాదాల పరిష్కారానికి 4 ప్రాంతీయ ఫెసిలిటేషన్ సెంటర్లు
- కొప్పర్తిలో రూ.250 కోట్లతో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ పార్కు
- కోవిడ్ సమయంలో రీస్టార్ట్ పేరుతో చేయూత
- రూ.118 కోట్లతో ర్యాంప్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం

- వివరాలు 14లో



నేటి నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు

- క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.2,090 చెల్లించేందుకు నిర్ణయం.. 85 వేల టన్నుల సేకరణకు అనుమతి
- మే 15వ తేదీ వరకు కొనసాగనున్న కొనుగోళ్లు
- నేటినుంచి ఆర్‌బీకేల్లో రైతుల వివరాల నమోదు
- మార్గదర్శకాలను జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

14లో

డామిట్..

అడ్డం తిరిగిందే!

తమ వాళ్లకే సీట్లు ఇప్పించాలనుకున్న చంద్రబాబు ప్లాన్‌కు గండి

- బాబు చెప్పిన వాళ్లకి సీట్లిస్తూ... సంఖ్యను తగ్గించుకున్న పవన్
- 24కు ఓకే... 21కీ ఓకే... ఎంపీ సీట్లు రెండే ఇచ్చినా పీకే ఓకేఓకే
- ఇప్పటికే ప్రకటించిన ఆరు సీట్లలో ఒకటి ఇటీవలే చేరిన నేతకు
- తాజాగా భీమవరం టీడీపీ మాజీ నేతతోపాటు గంటా నరహరి చేరిక
- జనసేనలో అంతా బాబు చెప్పినట్టే జరుగుతోందంటున్న టీడీపీ వర్గాలు
- బీజేపీ విషయంలోనూ అదే వ్యూహం.. జీవీఎల్‌కు టికెట్ లేకుండా చేసే యోచన
- నరసాపురం బీజేపీ ఖాతాలో వేసి రఘురామకు ఇప్పించే ఎత్తుగడ విఫలం
- సుజనా, సీఎం రమేశ్, పురందేశ్వరి ఎంపీలుగానే పోటీ చేయాలని బాబు ప్లాన్.. తాజాగా విజయనగరం అడిగిన బీజేపీ... జీవీఎల్‌కు ఇచ్చే అవకాశం
- పురందేశ్వరిని ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటున్న అధిష్టానం
- చర్చల్లో బాబు స్పాన్సర్డ్ నాయకులు లేకుండా కమలనాథుల జాగ్రత్తలు
- ఇవన్నీ చూసి కథ అడ్డం తిరిగిందని తలపట్టుకుంటున్న బాబు



సాక్షి, అమరావతి: పొత్తుల పేరుతో చంద్రబాబు పన్నిన వ్యూహాలు బెడిసికొట్టాయి. జనసేనకు 24 అసెంబ్లీ సీట్లు ఇచ్చినా ఓకే.. 21 ఇచ్చినా ఓకే అన్న పవన్‌కళ్యాణ్‌ను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఆడించిన మాదిరిగానే పొత్తుల పేరుతోఏపీ బీజేపీలోని తన మనుషులకే టికెట్లు ఇచ్చి కథ నడిపించాలనుకున్న చంద్రబాబు ఎత్తుగడలకు కమలనాథులు చెక్ పెట్టారు. బీజేపీ సీట్ల సంఖ్య మొదలు కేటాయింపు దాకా అంతా తాను అనుకున్నట్టే చక్రం తిప్పాలనుకున్న చంద్రబాబు యత్నాలను వమ్ము చేసిన ఢిల్లీ బీజేపీ పెద్దలు ప్రతి వ్యూహాలను రూపొందించి అమలు చేస్తున్నారు. సీట్ల సర్దుబాటు చర్చల సందర్భంగా రాష్ట్ర నేతల ప్రమేయం లేకుండా నేరుగా కేంద్ర మంత్రిని రంగంలోకి దించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎక్కడా బాబు స్పాన్సర్డ్ నేతల పాత్ర లేకుండా కమలనాథులు జాగ్రత్త పడ్డారు. జనసేన విషయంలో అంతా తాము ఊహించినట్లే జరగగా కాషాయదళం మాత్రం ముందుచూపుతో వ్యవహరించిందని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

విజయనగరంపై ఢిల్లీ పెద్దల ఆరా..

గతంలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరించి ప్రస్తుతం యూపీ నుంచి ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న జీవీఎల్ నరసింహారావుకు పొత్తులో ఎక్కడా సీటు దక్కకుండా చేసేందుకు చంద్రబాబు

మిగతా 2వ పేజీలో ▶



'ఆసరా'తో అగ్రపథం..

మన మహిళ ఆదాయంలో టాప్

ఏపీ పొదుపు సంఘాల సభ్యుల సగటు వార్షిక ఆదాయం రూ.2.80 లక్షలు

- 2019 తరువాత సభ్యుల రోజువారీ ఆదాయంలో భారీ పెరుగుదల.. రూ.100 నుంచి రూ.373కి పెరిగిన రోజువారీ ప్రాథమిక ఆదాయం
- దేశంలో అత్యధిక ఆదాయం కలిగిన 20 పొదుపు జిల్లాల్లో 9 ఏపీలోనే..
- డిజిటల్ లావాదేవీల్లో ముందు వరుసలో నిలిచిన మన మహిళలు
- 2027 నాటికి లక్షాధికారులుగా అన్ని రాష్ట్రాల పొదుపు మహిళలు
- పొదుపు సంఘాల క్రెడిట్ ఆదాయాలపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి
- అక్క చెల్లెమ్మలను ఆదుకున్న ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలు
- సంఘాలు పునరుజ్జీవం.. సకాలంలో చెల్లింపులతో పెరిగిన రుణ పరపతి
- ఇప్పుడు 0.17 శాతానికి తగ్గిపోయిన ఎన్‌పీఏలు

13లో

ముఖ్యమంత్రి ప్రసంగంలో

తప్పేముంది?

సీఎం ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించడమేమిటి?

- జన్మభూమి కమిటీలను, వలంటీర్లతో పోల్చి మాట్లాడటం తప్పెలా అవుతుంది?
- వలంటీర్లు పథకాలను ప్రజలకు చేరువ చేయడం మంచి పనే కదా
- మంచి చేస్తున్న వారిని సన్మానించకూడదా?
- ఓటర్లు తెలివి గల వాళ్లు.. వారి గురించి చింతించాల్సిన పని లేదు
- వలంటీర్ల ఎన్నికల విధులపై తేల్చాల్సింది ఎన్నికల సంఘమేనన్న హైకోర్టు
- వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశాలిచ్చామన్న ఈసీ
- అలా అయితే విచారించేందుకు ఏమీ లేదన్న ధర్మాసనం.. పిల్ కొట్టివేత

5లో



చిన్నారి 'సుషాంత్'కు సీఎం జగన్ ఆపన్న హస్తం

కాలేయ వ్యాధితో పోరాడుతున్న పిల్లాడికి రూ.7 లక్షల సాయం

చిత్తూరు అర్బన్: కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని సీఎం జగన్ ఆదుకున్నారు. చిత్తూరు 8వ డివిజన్ రీడ్స్‌పేటకు చెందిన మనోజ్‌కుమార్, ప్రియదర్శిని దంపతుల కుమారుడు సుషాంత్ (7) కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కాలేయానికి వెళ్లే రక్తనాళాలు పూడుకుపోవడంతో సుషాంత్ ఇటీవల రక్తపువాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. తల్లిదండ్రులు వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళితే సర్జరీ చేయాలని, అందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని చెప్పారు. దీంతో వీరు చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో అర్జీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. చిన్నారి పరిస్థితిపై ముఖ్యమంత్రి కార్యాలయానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. అలాగే మనోజ్‌కుమార్ దంపతులు చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డికి కూడా సుషాంత్ పరిస్థితిని వివరించారు. ఆయన సైతం సుషాంత్ పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన సీఎం జగన్..సుషాంత్ వైద్య ఖర్చుల కోసం రూ.7 లక్షలను మనోజ్‌కుమార్ బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. మనోజ్‌కుమార్ మాట్లాడుతూ తన కొడుకు ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులో కోమాతో వెంటిలేటర్‌పై ఉన్నాడని చెప్పారు. తమకు సీఎం జగన్ సాయం చేశారని, అందుకుగాను తమ కుటుంబం మొత్తం ఆయనకు రుణపడి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం వైద్య ఖర్చులకు రూ.లక్షల్లో ఖర్చవుతోందని, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోన్న తనకు అంత ఖర్చు పెట్టే స్థోమత లేదని, దాతలు సాయం చేయాలని (ఫోన్–8555005681) కోరాడు.



ఆసుపత్రిలో సుషాంత్

16న వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన!

ఒకేసారి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు ప్రకటించనున్న సీఎం జగన్

- ఇడుపులపాయలో దివంగత వైఎస్సార్ ఘాట్ వద్ద జాబితా ప్రకటన
- ఆ తర్వాత ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ శ్రీకారం.. రోజుకు రెండు లేదా మూడు సభలు, రోడ్ షోలు
- ఒకే చోట కాకుండా వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించేలా షెడ్యూల్
- తుదిదశకు చేరుకున్న మేనిఫెస్టో రూపకల్పన

13లో

సీఈసీ, ఈసీల నియామక చట్టంపై రేపు విచారణ



ముఖ్య ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 15న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. సీఈసీ, ఈసీల నియామకం కోసం ఉద్దేశించిన ప్యానల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ.. కేంద్రం తీసుకువచ్చిన కొత్త చట్టంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

6లో

సీటు కోసం అగచాట్లు

- అనకాపల్లి జిల్లా టీడీపీ నేతలకు అధిష్టానం షాక్
- పొత్తు వల్ల సీటు త్యాగం చేయాలంటూ లీకులు
- చోడవరం, యలమంచిలి, మాడుగులలో ఇదే తీరు

సాక్షి, అనకాపల్లి/చోడవరం: పొత్తులు తమ కొంప ముంచాయని.. ఏ నిమిషంలో ఏ పార్టీ నేత పేరు తెరపైకి వస్తుందో తెలియడం లేదని అనకాపల్లి జిల్లా టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. తాము ఆశ పెట్టుకున్న స్థానాల్ని జనసేన, బీజేపీలు తన్నుకుపోతాయోమోనన్న టెన్షన్‌లో పడిపోయారు. టీడీపీ అధిష్టానం కూడా రోజుకో పేరుతో లీకులిస్తూ టీడీపీ శ్రేణుల్ని అయోమయంలో పడేస్తుంది. బీజేపీతో పొత్తు ఖరారైనప్పటి నుంచి అనకాపల్లి జిల్లాలో చోడవరం, యలమంచిలి, మాడుగుల టీడీపీ నేతల్లో కొత్త భయం పట్టుకుంది. ఇప్పటికే లోకేశ్ ఎన్నికల శంఖారావానికి రూ.40 కోట్ల వరకూ ఖర్చు చేసిన బైరా దిలీప్ చక్రవర్తికి అనకాపల్లి ఎంపీ సీటు గల్లంతయ్యింది. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ నుంచి సీఎం రమేష్ పేరు తాజాగా తెరపైకి ఇచ్చింది. ఇప్పటికే ఈ విషయంపై టీడీపీ అధిష్టానం నుంచి లీకులు ఇస్తున్నారు. టీడీపీ, జనసేన తొలి జాబితాలో అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి పీలాను కాదని జనసేన నుంచి కొణతాలకు ఇచ్చారు. ఇదే తరహాలో ఎవరు ఎప్పుడు వస్తారో.. పొత్తులో భాగంగా ఏ సీటు తన్నుకుపోతారోనని టీడీపీ అభ్యర్థుల్లో భయం పట్టుకుంది.

చోడవరంపై జనసేన, బీజేపీ కన్ను

టికెట్ ఖరారు చేస్తే ప్రచారం చేసుకుందామనే ఆలోచనలో ఉన్న చోడవరం నియోజకవర్గం నేతలకు అసలు టికెట్ ఉంటుందో లేదోనని భయం పట్టుకుంది. ఈ నియోజకవర్గంలో టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వీరితోపాటు బైరా దిలీప్ చక్రవర్తి ఇక్కడ నుంచే పోటీకి దిగే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతుంది. అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి జనసేన బరిలో దిగితే చక్రవర్తిని చోడవరం ఎమ్మెల్యేగా బరిలోకి దింపేందుకు యోచిస్తున్నట్టు సమాచారం. తాజాగా అతని పేరుపై సర్వే చేయించగా.. రాజు, తాతయ్యబాబు వర్గీయులు దిలీప్‌చక్రవర్తిని వ్యతిరేకించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరు కూడా ఇక్కడ ప్రచారంలో ఉండగా.. జనసేన, బీజేపీ కూడా చోడవరం స్థానమే కావాలని గట్టిగా పట్టుపడుతున్నాయి.

యలమంచిలిలో రెబెల్‌గా రంగంలోకి ప్రగడ

యలమంచిలి నియోజవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు టికెట్ లేదని లీక్‌లు ఇస్తున్నారు. జనసేనకు యలమంచిలి టికెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్ పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే ప్రగడ నాగేశ్వరావు వర్గీయులు టీడీపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులంతా ఆదివారం అచ్యుతాపురంలో సమావేశమయ్యారు. జనసేనకు టికెట్ ఇస్తే భవిష్యత్తు కార్యాచరణపై తీర్మానం చేశారు. టికెట్ జనసేనకు ఇస్తే ప్రగడ పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీచేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. మాడుగుల నియోజకవర్గంలో టీడీపీలో ముగ్గురు ఆశావహులుండగా.. జనసేనకే టికెట్ అని అధిష్టానం లీకులు ఇస్తుంది. మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌తో పాటు పైలా ప్రసాదరావులు టికెట్ ఆశిస్తున్నారు. వీరి ముగ్గురినీ కాదని జనసేనకు ఇస్తారేమో అని భయం పట్టుకుంది.

భరత్ ప్రచారానికి జనసేన దూరం

తగరపువలస(భీమిలి): విశాఖ ఎంపీ స్థానం ఆశిస్తున్న ఎం.భరత్ బుధవారం భీమిలి మండలం తాళ్లవలస నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించగా.. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన నుంచి భీమిలి అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న కోరాడ రాజబాబు, గంటా శ్రీనివాసరావు, పంచకర్ల సందీప్ హాజరుకాలేదు. ఇప్పటికే భీమిలి టికెట్ జనసేనకు కేటాయించేదిలేదని టీడీపీ చెప్పడంతో జనసైనికులతో పాటు ఆ పార్టీ ఇన్‌చార్జ్ సందీప్ కూడా నియోజవర్గంలో కనిపించడం మానేశారు. ఈ కారణంగానే భరత్ ప్రచార కార్యక్రమంలో జనసైనికుల జాడ కనిపించలేదు. భీమిలి టికెట్‌పై చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకుంటానని కోరాడ రాజబాబు 4 రోజులుగా విజయవాడలో మకాం వేశారు. గంటా శ్రీనివాసరావు కూడా వియ్యంకుడు నారాయణ రికమండేషన్‌తో భీమిలి టికెట్ సాధించుకోవడానికి చంద్రబాబు వద్దకు వెళ్లినట్టు తెలిసింది. భీమిలిలో పోటీ చేయాలంటే రూ.70 కోట్లు అవసరమని అంత మొత్తం రాజబాబు వద్ద లేదని ప్రచారం చేస్తున్నట్టు తెలిసింది.

నేరుగా వచ్చి ఆత్మహత్యాయత్నం

- ఫోన్ మాట్లాడుతూ ట్రాక్‌పైకి వచ్చింది
- ఆమె పక్కన ఎవరూ లేరు
- బ్రేక్ వేశాను.. కానీ ఆలోపే ప్రమాదం
- గీతాంజలి మృతిపై జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ వాంగ్మూలం
- కానీ పచ్చమీడియాలో ఫేక్ వీడియోలు
- చనిపోయినా వదలని టీడీపీ సైకోలు
- ఎవరో తోసేశారంటూ గోబెల్స్ ప్రచారం
- దీన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు
- తెనాలి డీఎస్పీ నేతృత్వంలో విచారణ
- నాడు రిషితేశ్వరి.. నేడు గీతాంజలిపై అదే దుష్ప్రచారం

10లో



ఎగిసిపడుతున్న నిరసన జ్వాలలు

10లో

సోషల్ మీడియా చీడ పురుగులు

- టీడీపీ, జనసేన సోషల్ మీడియా విభాగాల పైశాచికత్వం
- అందుకోసం ప్రత్యేకంగా విభాగాలు.. వేలాది ఫేక్ ఖాతాలు
- మహిళలు, విద్యార్థులు, సామాన్యులే లక్ష్యం..
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గొంతు నొక్కే కుట్ర

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ప్రభుత్వం వల్లే మా కుటుంబం బాగుంది



మాది వ్యవసాయ కుటుంబం. మేడి పడితే గానీ మా కడుపు నిండదు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం, కోటపోలూరు గ్రామంలో మాకున్న పొలంలోనే కొడుకు, కోడలు వ్యవసాయం చేస్తుండేవారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయంపై ఎటువంటి సహాయం అందలేదు. అప్పు చేసి వ్యవసాయం చేశాం. వాటిని తీర్చలేక నానా కష్టాలు పడ్డాం. ఇక నష్టాన్ని భరించలేక ఉన్న వ్యవసాయ భూమిని అమ్ముకుని వెళ్లాలనుకున్నాం. కొంత కాలం సాగు నిలిపివేశాం. మా అదృష్టం కొద్దీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. వారి దయవల్ల మళ్లీ వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయి. రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ. 13,500 వంతున వచ్చింది. దాంతో 1.7 ఎకరాల్లో మళ్లీ వ్యవసాయం చేస్తున్నాం. పరిస్థితులు అనుకూలించడంతో గతంలో చేసిన అప్పులన్నీ తీర్చేశాం. ఇంతలో నాకు శ్వాస కోస సంబంధిత వ్యాధి రావడంతో.. ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. చికిత్స చేసే స్తోమత లేక సతమతమయ్యాం. ఇంతలో వలంటీర్ ఇంటికి వచ్చి ఆరోగ్యశ్రీ పథకం గురించి చెప్పింది. వెంటనే నెల్లూరులో ఆపరేషన్ చేసుకున్నాను. రూ. 50వేలు ప్రభుత్వ సహాయం అందింది. నాకు ప్రతి నెలా పింఛన్ అందుతోంది. నా మనవరాలు చెంచు ప్రియకు అమ్మఒడి కింద ఏడాదికి రూ. 15వేలు వస్తోంది. పాఠశాలలో ఆనందంగా చదువుతోంది. పొదుపు ద్వారా నా కోడలు హైమావతి రూ.60 వేల రుణం తీసుకుని 2 బర్రెలను కొనుక్కుని నెలకు రూ.10వేల వరకు సంపాదిస్తోంది. స్త్రీనిధి ద్వారా మరో రూ.50 వేలు పొదుపు రుణం అందింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.14వేలు వరకు వచ్చింది. నాకే కాకుండా మా కుటుంబానికి కూడా ప్రభుత్వం అండగా నిలిచింది.

– గుమ్మడి కస్తూరమ్మ, కోటపోలూరు
(మహమ్మద్ నాజీం, విలేకరి, సూళ్లూరుపేట రూరల్)

సంక్షేమానికి జై'కొట్టు'



నేను, మా ఆయన గతంలో చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగించేవాళ్లం. ఆ వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. ఎంతో కష్టమ్మీద పిల్లలిద్దరికీ పెళ్లిళ్ల చేశాం. వారిద్దరూ వేరేగా కాపురం ఉంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడిలో ఉంటున్న నేను మహిళా సంఘ సభ్యురాలిగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఎలాంటి మేలు జరగలేదు. పైగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన నకిలీ హామీల కారణంగా చేసిన అప్పులు తీర్చకపోవడంతో ఆ వడ్డీకాస్తా ఎక్కువై మరింత ఆర్థికంగా కుదేలయ్యాం. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకూ రూ.60 వేలు వచ్చాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు వంతున వచ్చింది. ఆ మొత్తంతో మా గ్రామంలో బడ్డీ కొట్టు పెట్టుకుని వ్యాపారం ప్రారంభించాం. ఇప్పుడు మాకు ఆర్థిక సమస్యలన్నీ తీరిపోయాయి. హాయిగా కుటుంబం గడుస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– నెరుసు కుసుమ, తడికెలపూడి
(యు.లక్ష్మీనారాయణ, విలేకరి, కామవరపుకోట)

కూలిపని మాని వ్యాపారం చేసుకుంటున్నా..

నేను, నా భర్త గతంలో కూలిపనులు చేసేవాళ్లం. రోజువారీ వచ్చే డబ్బులతోనే జీవనం గడిచేది. పనులు లేనప్పుడు అప్పులు చేయక తప్పేది కాదు. ఏదైనా సొంతంగా వ్యాపారం చేసుకుందామని అనుకున్నా అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగనన్న పాలనలో మహిళలకు అన్ని విధాల బాగుంది. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, ఆసరా, స్త్రీనిధి పథకాలు మహిళలకు వరంగా మారాయి. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల పంచాయతీ పుట్లూరువారి పల్లె గ్రామ సంఘంలో సభ్యురాలుగా ఉన్న నాకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ. 18,750లు వంతున, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటివరకూ రూ.70 వేలు వచ్చింది. ఆ మొత్తానికి బ్యాంక్ ద్వారా తీసుకున్న లోన్ రూ.2 లక్షలు కలిపి కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో భర్త వెంకటేశ్వర్లుతో కలిపి కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. ఇప్పుడు



కూలి పనులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గౌరవంగా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. అమ్మ ఒడి పథకం అందడంతో పిల్లల చదువుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయింది. మేము ఈ పరిస్థితికి రావడానికి కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– శిగినం ఆదెమ్మ, పుట్లూరివారిపల్లి
(నాగం వెంకటేశ్వర్లు, విలేకరి, కొనకనమిట్ల మండలం)

న్యాయ రాజధానికి మరో మణిహారం


కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పనులకు నేడు శ్రీకారం

న్యాయ రాజధాని కర్నూలు కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరుతోంది. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం పర్యటన సందర్భంగా కర్నూలును న్యాయ రాజధాని అని పునరుద్ఘాటించిన క్రమంలో మరో ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో రెండో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఏర్పాటు దిశగా గురువారం శ్రీకారం చుడుతున్నారు. వర్సిటీ భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. - కర్నూలు (సెంట్రల్)

దేశంలో మొత్తం 28 జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో రాష్ట్రంలోని విశాఖపట్నంలో ఉన్న దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం ఒకటి. న్యాయ రాజధాని కాబోతున్న కర్నూలులో రెండోది, దేశంలో 29వ న్యాయ విశ్వ విద్యాలయం నిర్మాణానికి అంతా సిద్ధమైంది. కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై ఈ విశ్వ విద్యాలయానికి 150 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అందులో భవన నిర్మాణాలను ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ 2025–26 విద్యా సంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించే అవకాశం ఉంది.

అందుబాటులో న్యాయ విద్య

ఆంధ్రప్రదేశ్‌లో అన్నీ కలిపి 45 లా కాలేజీలు ఉన్నాయి. నాణ్యమైన న్యాయ విద్యను అందించేందుకు కర్నూలులో రెండో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇందులో యూజీ, పీజీ కోర్సులతో పాటు డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. అంతేకాక న్యాయ విద్యలో పీహెచ్‌డీలు, ఫెలోషిప్‌లకు అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో దేశం గర్వించదగ్గ న్యాయవాదులను అందించడంలో ఈ విశ్వవిద్యాలయం గొప్ప పాత్ర పోషిస్తున్నదనడంలో సందేహం లేదని ప్రఖ్యాత న్యాయ కోవిదులు చెబుతున్నారు. కాగా, న్యాయ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం నిర్వహించే క్లాట్ పరీక్షల్లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తారు. అందులో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి న్యాయ విద్యార్థులు కర్నూలుకు రానున్నారు.



భవన నిర్మాణాలకు భూమి పూజ చేయనున్న సీఎం వైఎస్ జగన్

150 ఎకరాల భూమి కేటాయింపు, ఆరు నెలల్లో నిర్మాణాలు పూర్తి

ఇప్పటికే కర్నూలుకు తరలివచ్చిన హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త




కర్నూలు శివారు జగన్నాథగట్టులో ఏర్పాటు అవుతున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం

సీమవాసుల ఆశలకు అనుగుణంగా..



సీమ వాసుల కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ మరో ముందడుగు వేస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖలో పరిపాలన, అమరావతిలో శాసన, కర్నూలులో న్యాయ రాజధానులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే కోర్టు కేసుల నేపథ్యంలో 3 రాజధానుల చట్టాలు అమల్లోకి రాలేకపోయాయి. అయితే ప్రతిష్టాత్మక మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ), లోకాయుక్త వంటి న్యాయ సంస్థలను ఇప్పటికే కర్నూలులో ఏర్పాటు చేశారు. అలాగే కర్నూలుకు వక్ఫ్ ట్రిబ్యునల్ కోర్టు తరలింపునకు పచ్చజెండా ఊపారు. సీబీఐ కోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేశారు. ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఏపీ ఈఆర్‌సీ) కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలో రూ. 10 కోట్లతో ఏపీ ఈఆర్‌సీ భవనాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధించాక హైకోర్టుతో పాటు అన్ని న్యాయ సంస్థలు, ట్రిబ్యునళ్లు కర్నూలుకు తరలివచ్చే అవకాశం ఉందని, పూర్తి స్థాయిలో న్యాయ రాజధాని అవుతుందని స్థానికులు భావిస్తున్నారు.


న్యాయ విశ్వ విద్యాలయం ఓ వరం



కర్నూలులో రెండో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండటం గొప్ప విషయం. ఇది రాయలసీమ విద్యార్థుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుంది. నాణ్యతా ప్రమాణాలతో కూడిన న్యాయ విద్య అందుబాటులోకి వస్తుంది. దేశంలోనే ప్రతిష్టాత్మక న్యాయ విశ్వ విద్యాలయాల జాబితాలోకి కర్నూలు చేరడం సంతోషకరం.

– మన్సూర్ రెహమాన్, రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్, కర్నూలు

హైకోర్టు కూడా కర్నూలుకు వస్తుంది



సీఎం జగన్ కర్నూలు అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఆయన రెండోసారి అధికారంలోకి వస్తే కచ్చితంగా కర్నూలుకు హైకోర్టు వచ్చి తీరుతుంది. ఇప్పటికే కర్నూలులో ప్రతిష్టాత్మక లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌తో పాటు పలు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక న్యాయ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండటం అభినందనీయం.

– జయపాల్‌రెడ్డి, రిటైర్డ్ జెడ్పీసీఈఓ, కర్నూలు

కర్నూలుకు జాతీయ స్థాయిలో పేరు



జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం కర్నూలు సిగలో న్యాయ మణిహారం. ప్రతిష్టాత్మక ఈ విశ్వవిద్యాలయం వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులు న్యాయ విద్య కోసం కర్నూలుకు వస్తారు. జాతీయ స్థాయిలో కర్నూలుకు మంచి పేరు వస్తుంది.

– మద్దెల శ్రీనివాసరెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కర్నూలు

పీఎం సూరజ్ పోర్టల్ ప్రారంభం

- ప్రధాని వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- హాజరైన మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): సమాజంలో వెనుకబడిన వర్గాలైన సఫాయి కర్మచారి లబ్ధిదారులకు ఎస్ఎఫ్‌డీసీ, స్త్రీనిధి, ఎన్ఎస్‌కెఎఫ్‌డీసీ కింద రూ.5.20 కోట్ల చెక్కును, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను గవర్నర్ అబ్దుల్ నజీర్ పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ప్రధానమంత్రి సూరజ్ జాతీయ పోర్టల్ ప్రారంభ కార్యక్రమంలో నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో గవర్నర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం లబ్ధిదారులతో ప్రధానమంత్రి మోదీ ఇంటరాక్షన్‌ను వీక్షించారు. ప్రధానమంత్రి... జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాల్లోని లబ్ధిదారులతో మాట్లాడి వారికి అందుతున్న పథకాలు, వారి జీవితాల్లో కలిగిన మార్పును తెలుసుకున్నారు. మన రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నుంచి ఒక సఫాయి కార్మికురాలు మోదీతో మాట్లాడారు. రోడ్లపక్కన ఉండే తమకు ప్రభుత్వం గ్యాస్, హెల్త్‌కార్డులతో పాటు అనేక పథకాలు అందచేసిందని, వృత్తి చేసుకోవడం కోసం రూ.17 లక్షల విలువ చేసే యంత్రం అందచేసిందని, ఇప్పుడు దానికి నేను యజమానురాలినయ్యానని ఆమె ప్రధానికి వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నామని, ప్రభుత్వం సెప్టిక్‌ట్యాంక్ క్లీన్ మిషన్ ఇవ్వడంతో తన కుటుంబ పోషణకు భరోసా లభించిందని చెప్పారు. అందుకు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ పేద, అణగారిన వర్గాల ఉద్ధరణ, సాధికారత కోసం చేపట్టిన ప్రధామంత్రి పీఎం సూరజ్ పథకం ఆయా వర్గాలకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. ఈ పథకం కింద జిల్లాలో 766 మందికి లబ్ధికలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరి స్రవంతి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ఎస్ఎస్ఎఫ్‌డీసీ చెక్కు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో మంత్రి కాకాణి

డామిట్.. అడ్డం తిరిగిందే!

▶ మొదటి పేజీ తరువాయి

పావులు కదుపుతున్న విషయం ఢిల్లీ పెద్దల దృష్టికి వచ్చినట్లు సమాచారం. దీనిపై వారు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. బీజేపీకి కేటాయించే ఆరు లోక్‌సభ స్థానాల్లో కొత్తగా విశాఖ లేదా విజయనగరం చేర్చేందుకు చర్చలు సాగుతున్నట్లు కమలం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. విజయనగరం సీటును జీవీఎల్‌కు కేటాయించే అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి గెలిచి తాను చెప్పినట్లు నడుచుకుంటున్న రఘురామకృష్ణరాజుకు టీడీపీ టికెట్ ఇవ్వకుండా బీజేపీ తరుపున పోటీ చేయించేందుకు బాబు ప్రయత్నిస్తుండగా కమలనాథులు సుముఖంగా లేరని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పురందేశ్వరి సీటుపై సందిగ్ధం.. అసెంబ్లీకే!

ఏలూరు నుంచి బీజేపీ తరపున లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రెండున్నరేళ్లుగా కార్యక్రమాలను నిర్వహించిన గారపాటి సీతారామాంజనేయ చౌదరి పార్టీపై అసంతృప్తితో ఈ నెల 15న తన అభిమానులతో సమావేశం నిర్వహిస్తున్నారు. నరసాపురంలో బీజేపీ నాయకుడుగా కొనసాగిన శ్రీనివాసవర్మ కూడా అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశాలపై బీజేపీ జాతీయ నాయకత్వం పురందేశ్వరి పట్ల తీవ్ర అసహనంతో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి పురందేశ్వరి పోటీ చేస్తారని ప్రచారం జరిగినా ఆమెకు అక్కడ పార్టీ అధిష్టానం సీటు కేటాయించే అవకాశం లేదని అంటున్నారు. పురందేశ్వరి ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది ఇప్పటిదాక స్పష్టత లేకపోగా ఆమెకు ఏదో ఒక ఎమ్మెల్యే సీటును కేటాయించే అవకాశం ఉందనే చర్చ బీజేపీ వర్గాల్లో జరుగుతోంది.

జనసేనలో బాబు మాటే..

పొత్తుల పేరుతో జనసేనలో మాత్రం అంతా చంద్రబాబే చక్రం తిప్పుతున్నారు. జనసేనకు ఇచ్చే సీట్లకు కోతలపై కోతలు విధించి చివరకు 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు కుదించిన చంద్రబాబు ఆ సీట్లలో సైతం తన విధేయులే పోటీ చేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు ఇప్పటికే టీడీపీని వీడి జనసేన తీర్థం తీసుకున్నారు. గతంలో పవన్‌కళ్యాణ్‌పై పోటీ చేసిన ఆయనకు జనసేన టిక్కెట్ ఇవ్వడం దాదాపుగా ఖరారైందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీడీపీకే చెందిన మరో నాయకుడు గంటా నరహరి బుధవారం పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఆయన్ను తిరుపతి లేదా అన్నమయ్య జిల్లాల్లో జనసేనకు కేటాయించే ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మరోవైపు జనసేన ఇప్పటివరకు ఆరుగురు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించగా వీరిలో అనకాపల్లిలో కొణతాల రామకృష్ణ ఇటీవలే పార్టీలో చేరడం గమనార్హం.

పారని చంద్రబాబు పాచిక..

ఇటీవల బాబు – పవన్ ఢిల్లీలో అమిత్‌షాను కలసిన అనంతరం బీజేపీకి కేటాయించే సీట్లపై ఒప్పందం కుదరక ముందే తాము ఆ పార్టీకి 6 లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఇవ్వనున్నట్లు అనుకూల మీడియాలో చంద్రబాబు ప్రచారం నిర్వహించారు. అది కూడా రాష్ట్ర బీజేపీలో తనకు అనుకూలంగా వ్యవహరించే వారికి కేటాయించి తాను చెప్పిన సంఖ్యకు ఒప్పించేలా పథకం వేశారు. అనూహ్యంగా సీట్ల సర్దుబాటు చర్చలకు బీజేపీ పెద్దలు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో పాటు ఒడిశాకు చెందిన బి.పాండాను పంపిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సీట్ల సర్దుబాటు చర్చల్లో రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి పాత్రను నామమాత్రం చేశారు. ఢిల్లీ ఆదేశాల మేరకు వచ్చిన ఆ ఇద్దరూ బాబుతో చర్చల్లో పాల్గొన్నారు. దీంతో చంద్రబాబు బీజేపీ అడిగినన్ని సీట్లకు తలాడించక తప్పలేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీలో కొనసాగుతూ ఇప్పటికీ చంద్రబాబు ప్రయోజనాల కోసమే పని చేసే సుజనా చౌదరి, సీఎం రమేష్‌కు సీట్లు కట్టబెట్టేందుకు ఎన్నో ఏళ్ల నుంచి పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం చేసేలా పురందేశ్వరి వ్యవహరిస్తున్నారనే విమర్శలు కాషాయదళంలో వినిపిస్తున్నాయి.

గతం కంటే ఎక్కువ మెజార్టీ రావాలి

నియోజకవర్గాల సమన్వయకర్తలు, నేతలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గత ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ నేతలకు ఆ పార్టీ అధ్యక్షులు, సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పలు నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ నేతలతో సీఎం సమావేశమయ్యారు. నగరి, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు మంత్రులు రోజా, అంబటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆ నియోజకవర్గాల నేతలతో చర్చించారు. పార్టీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. గతం కంటే అత్యధిక మెజార్టీతో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తామని నేతలు సీఎం జగన్‌కు చెప్పారు.



గండి రవికుమార్, ప్రసాదరావులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత గండి రవికుమార్

సాక్షి,అమరావతి: అనకాపల్లి జిల్లా పెందుర్తి టీడీపీ నేత గండి రవికుమార్ వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో రవికుమార్‌తో పాటు స్థానిక టీడీపీ నేత డెడ్లెం ప్రసాదరావు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ భగవాన్ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లకు సీఎం జగన్ ఘన నివాళులు

కవయిత్రి మొల్ల చిత్రపటానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి,అమరావతి: 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల)కు సీఎం జగన్ ఘన నివాళులర్పించారు. మొల్ల జయంతి సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి సీఎం జగన్ పూలమాలలు వేశారు. మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ విప్‌లు వరుదు కళ్యాణి,చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

15 మంది క్రీడాకారులకు రూ.1.5 కోట్లు

ఆడుదాం ఆంధ్రాలో ప్రతిభ చూపిన వారికి పంపిణీ చేసిన మంత్రి రోజా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రీడాకారుల ఉజ్వల భవితకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులశాఖ మంత్రి ఆర్.కె.రోజా చెప్పారు. ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నీలో సచివాలయం నుంచి ప్రారంభించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన 15 మంది క్రీడాకారులకు ఆమె బుధవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.10 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీగా నిలిచిపోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికితీయడంతో పాటు ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ సీఎం జగన్ తలపెట్టిన క్రీడాయజ్ఞాన్ని భవిష్యత్తులోను దిగ్విజయంగా కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని క్రీడా టాలెంట్‌కు కేరాఫ్‌గా మారుస్తామన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన 15 మంది క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి శిక్షణ అందించడంతో పాటు ఆర్థిక ప్రోత్సాహంగా మొత్తం రూ.1.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాప్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రోత్సాహం అందుకున్న వారి వివరాలు

■ క్రికెట్: శివ (అనపర్తి–4వ సచివాలయం, తూ.గో జిల్లా), వి.జస్విన్ (అశోక్ పిల్లర్ రోడ్డు,ఏలూరు), కె.ఆనందపాల్ (అలమండ, విజయనగరం), విష్ణువర్ధిని(సిద్ధార్థనగర్, ఎన్టీఆర్), గాయత్రి(నగరిగుట్ట,వైఎస్సార్) ■ ఖోఖో: రామ్మోహన్ (పంగులూరు–1, బాపట్ల), హేమవతి (పోలిరెడ్డి బజార్, ప్రకాశం) ■ బ్యాడ్మింటన్: వంశీకృష్ణరాజు (శేఖర్‌స్ట్రీట్, ఏలూరు), ఆకాంక్ష (స్వర్ణ సచివాలయం, శ్రీకాకుళం) ■ వాలీబాల్: మౌనిక, (నిజాంపట్నం–1, బాపట్ల), సత్యం (కొవ్వాడ సలేసం, శ్రీకాకుళం) ■ కబడ్డీ: బాలకృష్ణరెడ్డి, (చల్లారెడ్డిపాలెం, బాపట్ల), సతీష్, సుమన్ (నాగలాపురం–1, తిరుపతి), సంధ్య (లాసన్ బే కాలనీ, విశాఖ).

ఇదంజగత్



ఆ పార్టీతో పొత్తు ఉంటుందని తెలియక గతంలో అడ్డగోలు తిట్లు తిట్టా..మనసులో పెట్టుకుని ఇప్పుడు నన్ను ఓడించరు కదా!

క్లుప్తంగా...

'గ్రూప్-1' తీర్పుపై న్యాయ పోరాటం చేస్తాం

అధైర్య పడవద్దని అభ్యర్థులకు ప్రభుత్వం అభయం

సాక్షి, అమరావతి: 2018 గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అభ్యర్థులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. సదరు నోటిఫికేషన్ కింద ఎంపికై ఉద్యోగాల్లో చేరిన వారి ప్రయోజనాలను కాపాడతామని స్పష్టం చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లనున్నట్టు ఏపీపీఎస్సీ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు దరఖాస్తులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల అభ్యర్థుల నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవిప్రకాష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సంక్షేమ శాఖ కార్యాలయంలో పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) పద్ధతిలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 20వ తేదీలోగా విజయవాడ, యనమలకుదురు రోడ్డు (74-12-2,) రాజనరేంద్ర బిల్డింగ్, మొదటి అంతస్తు)లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వైద్యశాఖలో 397 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- మూడు విడతల్లో మొత్తం 2,374 మంది క్రమబద్ధీకరణ



సాక్షి, అమరావతి: కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా బుధవారం మూడోవిడతలో వైద్య శాఖలోని 397 ఎంపీహెచ్ఏ, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గత వారం రెండు విడతల్లో 1,977 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. తాజా ఉత్తర్వులతో మొత్తం మూడు విడతల్లో 2,374 మందిని క్రమబద్ధీకరించినట్టైంది. రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేపడతామని 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్న సీఎం వైఎస్ జగన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఏపీ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్-2023 చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం కింద 2014 జూన్ రెండోతేదీకి ముందు నియమితులై, ప్రస్తుతం కొనసాగుతున్న వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే వైద్యశాఖలోని డీఎంఈ, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమం (డీపీహెచ్), ఆరోగ్య కుటుంబ సంక్షేమం (సీఎఫ్‌డబ్ల్యూ), ఆయుష్ విభాగాల్లోని అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తున్నారు.

ఉన్నతి ఫౌండేషన్‌తో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణను అందించే విధంగా బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్‌తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఎండీ సీఈవో వి వినోద్‌కుమార్, ఉన్నతి ఫౌండేషన్ డైరెక్టర్ ఎ.పద్మనాభం పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. దీని ప్రకారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు నైపుణ్యం అంతరాన్ని గుర్తించి ప్రత్యేక కోర్సుల ద్వారా పరిశ్రమకు అనుసంధానం చేయనున్నట్లు వినోద్ కుమార్ తెలిపారు. ఏపీ విద్యార్థులు/యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు పద్మనాభం తెలిపారు.

'కాపు' కాసిందే జగన్

కాపులకు దగా అంటూ జగన్ సర్కారుపై విషం కక్కిన ఈనాడు

- కాపు ఓట్లతో గద్దెనెక్కి వారిని దగా చేసిందే చంద్రబాబు
- హామీలిచ్చి అమలు చేయని చంద్రబాబు
- నవరత్నాలతోపాటు అన్ని విధాలుగా అండగా నిలిచిన జగన్
- కాపు కార్పొరేషన్‌కు బాబు ప్రకటించిందే రూ.1,874.67 కోట్లు
- అందులోనూ రూ.540 కోట్లు కోత.. విడుదల చేసింది రూ.1,334 కోట్లే
- బాబు పెట్టిన ఈ బకాయిలను కూడా చెల్లించింది వైఎస్ జగన్ ప్రభుత్వమే
- సీఎం జగన్ కాపు కార్పొరేషన్ ద్వారా కలిగించిన లబ్ధి రూ.15,044.64 కోట్లు
- నవరత్న పథకాలతో కాపులకు అన్ని విధాలుగా చేయూత
- ఈ ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా కాపులకు ఇచ్చింది రూ.39,317.80కోట్లు


కాపులకు జగన్ దగా
కార్పొరేషన్‌ను నిర్లక్ష్యం చేసిన వైకాపా సర్కారు
ఎక్కడికక్కడ ఆగిన కాపు భవనాల నిర్మాణం
వారి విదేశీ విద్యా పథకంపైనా కుతంత్రాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాపుల మదిలో విష బీజాలు నాటి చంద్రబాబుకు మేలు చేయాలనే కుతంత్రంతో రామోజీరావు అడ్డగోలుగా మరో తప్పుడు కథనాన్ని వండి వార్చారు. 'కాపులకు జగన్ దగా' అంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఈనాడులో విషం కక్కారు. అసలు కాపులను ఓటు బ్యాంకుగా వాడుకొని వారి ఓట్లతో గద్దెనెక్కి వారిని వంచించి వదిలేసిందే చంద్రబాబు. ఇది జగమెరిగిన సత్యం. రిజర్వేషన్లు, ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు వంటి ఎన్నో హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. వాటిని అమలు చేయకుండా కాపులను దారుణంగా దగా చేశారు. ఒక్క కాపులే కాదు.. చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలనూ మోసం చేశారు. మోసాలకు కేరాఫ్ చంద్రబాబు అన్న ముద్ర వేసుకున్నారు.

సీఎం వైఎస్ జగన్ మాత్రం మాయ మాటలతో తాను మభ్య పెట్టలేనని, చేసేదే చెబుతానని నిఖార్సైన నాయకుడిగా నిలబడ్డారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నవరత్న పథకాలతో కాపులను అన్ని విధాలుగా ఆదుకోవడంతోపాటు ప్రత్యేకంగా కాపు కార్పొరేషన్ పెట్టి వారికి నిజమైన మేలు చేశారు. కాపు నేస్తం, చేయూత, ఆసరా, అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా కాపుల్లోని పేద వర్గాలకు ఆర్థిక తోడ్పాటునందించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. సీఎం జగన్ 58 నెలల పాలనలో కాపులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.39,317.80 కోట్లు ఆర్థిక సాయమందించి సీఎం జగన్ రికార్డు సృష్టించారు. రాజకీయాల్లో విలువలు కలిగిన నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ కాపుల ఉన్నతిలో తనదైన ముద్ర వేసుకున్నారు. విశ్వసనీయత, నిబద్ధత, నిజాయతీకి సీఎం వైఎస్ జగన్ మారుపేరు. ఈ విషయాలన్నీ తెలిసీ రామోజీ అసత్య కథనంతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేశారు. రామోజీ ఇలాంటి కథనాలు ఎన్ని అచ్చేసినా చంద్రబాబుకున్న మోసాలకు కేరాఫ్ ముద్రా పోదు.. సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న విశ్వసనీయతకు మారు పేరన్న గౌరవమూ తగ్గదు. రామోజీ అచ్చేసిన కథనంలో వాస్తవాలేమిటో పరిశీలిస్తే..

ఆరోపణ: కార్పొరేషన్‌ను నిర్లక్ష్యం చేసిన వైకాపా సర్కారు?

వాస్తవం: కాపు కార్పొరేషన్‌ను గత చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఇది తెలిసినా ఎన్నికలు సమీపిస్తుండటంతో బాబుకు రాజకీయ మేలు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రామోజీ బురద రాతలకు దిగజారారు. కాపులకు ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు జరుపుతానని మాట ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు కాపు కార్పొరేషన్ ద్వారా 2014 నుండి 2017 వరకు ఒక్క రూపాయీ విదల్చలేదు. 2017 నుండి 2019 వరకు రూ.1,874.67 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. విడుదల చేసింది రూ.1,334 కోట్లే. అంతే ప్రకటించిన మొత్తంలో రూ.540 కోట్లు బకాయి పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌కు పెట్టిన బకాయిలను సైతం వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. వైఎస్ జగన్ ప్రభుత్వం కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన పేద కుటుంబాల అభ్యున్నతికి కాపు కార్పొరేషన్ ద్వారా చేయూతనిచ్చింది. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.15,044.64 కోట్లతో వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న అమ్మ ఒడి, వాహన మిత్ర, జగనన్న చేదోడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది.

ఆరోపణ: గత ప్రభుత్వ హయాంలో రూ1,441 కోట్ల మేర రాయితీ రుణాలు

వాస్తవం: గత ప్రభుత్వ హయాంలో రూ.1,441.75 కోట్లు మేరకు రాయితీ రుణాలు ఇచ్చినట్టు చంద్రబాబు గురించి గొప్పలు చెప్పిన ఈనాడు.. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అంతకు మించి నిధులు కేటాయించినప్పటికీ మసిపూసి మారేడు కాయ చేసేలా అబద్ధాలు రాసేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 (ఈ ఏడాది మార్చి) వరకు 19,81,458 మంది లబ్ధిదారులకు రూ.3,260.87 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూర్చింది. వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, జగనన్న చేదోడు, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి వాటికి నిధులు విడుదల చేసింది. వాహన మిత్ర పథకంలో 58 నెలల కాలంలో 25,046 మందికి ఏడాదికి రూ.10 వేలు చొప్పున రూ.132.57 కోట్లు ఆర్థిక సాయం అందించింది.

ఆరోపణ: నైపుణ్య శిక్షణ నిలిపేశారు

వాస్తవం: నైపుణ్య శిక్షణ పేరుతో గత ప్రభుత్వం 2015 నుంచి 2019 వరకు శిక్షణ సంస్థలకు బకాయిలు పెట్టిన రూ.8.83 కోట్లు వైఎస్ జగన్ ప్రభుత్వమే చెల్లించింది. గత ప్రభుత్వం విద్యోన్నతి అంటూ గొప్పలు చెప్పిన పథకంలో గత ప్రభుత్వం 2015 నుంచి 2019 వరకు శిక్షణ ఇచ్చిన సంస్థలకు బకాయి పెట్టిన రూ.6.15 కోట్లు కూడా వైఎస్ జగన్ ప్రభుత్వమే చెల్లించింది. వైఎస్ జగన్ ప్రభుత్వం 2023-2024 ఏడాదికి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం ద్వారా అర్హత కలిగిన కాపు విద్యార్థులకు లక్ష రూపాయలు చొప్పున 23 మందికి రూ.23 లక్షలు అందించింది.

ఆరోపణ: కాపు భవన నిర్మాణాలపైనా జగన్ కన్నుకుట్టింది

వాస్తవం: గత ప్రభుత్వం గొప్పలు చెప్పి మంజూరు చేసిన భవనాల్లో ఒక్క దానికీ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించలేదు. అదీ చంద్రబాబు సర్కారు ఘనత. వైఎస్ జగన్ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు 5 కాపు భవనాలకు రూ.వంద కోట్లు నిధులు విడుదల చేయడమే కాకుండా నెల్లూరు మున్సిపాలిటీలో, బాపట్ల జిల్లా ఏల్చూరు, అడవిపాలెం, చందలూరులో నాలుగు కాపు భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించింది. ఇదీ సీఎం వైఎస్ జగన్ నిబద్ధత.

గత ఐదేళ్లలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపులకు కలిగిన లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	6,01,775	878.09
2020-21	9,89,800	2,630.52
2021-22	11,34,104	2,692.94
2022-23	18,27,785	3,535.14
2023-24	18,37,771	5,307.95

వైఎస్ జగన్ ప్రభుత్వంలో కాపులకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.39,317.80 కోట్లు లబ్ధి

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అర్హత కలిగిన కాపులకు పార్టీ, ప్రాంతం వంటివి చూడకుండా మధ్యవర్తులు, లంచాలకు తావు లేకుండా నవరత్నాల పథకాల్లో లబ్ధిని చేకూర్చింది. 77 లక్షల మంది లబ్ధిదారులకు 39 వేల కోట్ల లబ్ధిని చేకూర్చింది. ఆ వివరాలివీ

	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
డీబీటీ	61,36,195	22,403.51
నాన్ డీబీటీ	15,64,433	16,914.29
మొత్తం	77,00,628	39,317.80

ఆరోపణ: విదేశీ విద్య దక్కకుండా కుతంత్రాలు

వాస్తవం: గత ప్రభుత్వం చేపట్టిన విదేశీ విద్యా పథకంలో అక్రమాలు, అవినీతి జరిగినట్టు విజిలెన్స్ విచారణలో వెలుగు చూసింది. దీంతో ఈ పథకాన్ని మరింత మెరుగులు దిద్ది పేద వర్గాలకు మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2015-16 నుండి 2018-19 వరకు 307 మంది విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.20.97 కోట్ల మేర బకాయిలను కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. 2022 నుంచి 2024 (మార్చి) వరకు విదేశీ విద్యా దీవెనకు సంబంధించి 60 మంది విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.15.62 కోట్లు అందించి విదేశాలకు వెళ్లి చదువుకునే అవకాశం కల్పించింది. వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మఒడి పథకాల్లో 2019 నుంచి 2024 వరకు 8,41,677 మంది కాపు విద్యార్థుల కోసం వారి తల్లులకు రూ.3,950.79 కోట్లు అందించింది.

చంద్రబాబు 30 ఏళ్లుగా కాపులను దగా చేస్తున్నారు

- కాపులను బీసీలుగా గుర్తిస్తూ 1994లో ఇచ్చిన జీవో 30ని అడ్డుకుంది బాబే
- ఆ జీవోను అమలు చేయకుండా 2004 వరకు సీఎంగా బాబు తొక్కిపెట్టారు
- పుట్టుస్వామి కమిషన్ నివేదికను బుట్టదాఖలు చేసిందీ ఆయనే
- 2014లో మరోసారి అధికారంలోకి వచ్చాకా కాపులను మోసం చేశారు
- ప్రజలకు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ
- బాబు నయవంచనపై బహిరంగ చర్చకు సిద్ధమని వెల్లడి


సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాపు సామాజికవర్గాన్ని చంద్రబాబు 30 ఏళ్లుగా దగా చేస్తూనే ఉన్నారని, ఆయన చేస్తున్న నయవంచనపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని కాపు ఐక్య వేదిక ఉద్ఘాటించింది. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ 1994 నుంచి ఇప్పటివరకు కాపులకు ఎన్ని విధాలుగా అన్యాయం చేసిందో వివరిస్తూ కాపు ఐక్య వేదిక బుధవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాసింది. వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, పంచాది రంగారావు, కో కన్వీనర్లు కాకిలేటి హరినాథ్, నల్లజర్ల ఎన్వీ రామారావు ఆ లేఖను మీడియాకు విడుదల చేశారు. లేఖలోని ప్రధానాంశాలు..

'1994లో కాంగ్రెస్ ప్రభుత్వం కాపులు, మరో 14 కులాలను బీసీలుగా గుర్తిస్తూ జీవో 30 ఇచ్చింది. హైకోర్టులో కేసు వేయించి ఆ జీవోను అడ్డుకుంది చంద్రబాబే. జీవోను హైకోర్టు సమర్థించినప్పటికీ 1994 నుంచి 2004 వరకు సీఎంగా చంద్రబాబు దాన్ని అమలు చేయకుండా తొక్కిపెట్టారు. 1994లో నియమించిన పుట్టుస్వామి కమిషన్ నివేదికను బహిర్గతం చేయకుండా బుట్టదాఖలు చేసిందీ చంద్రబాబే. జీవో 30 ప్రకారం కాపు విద్యార్థులకు అందాల్సిన ఫీజు మినహాయింపులు, స్కాలర్‌షిప్‌లు, మెస్ ఛార్జీలు అన్నింటినీ అడ్డుకున్నది బాబే. 2014 ఎన్నికల్లో బాబు రాజకీయం కోసం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కాపులను మోసం చేశారు. ఒకసారి బీసీ(ఎఫ్) ద్వారా కాపులకు 5 శాతం రిజర్వేషన్లు అని, మరోసారి ఈడబ్ల్యూఎస్ 10 శాతంలో కాపులకు 5 శాతం ప్రత్యేక కోటా అని నమ్మబలికి ఏదీ అమలు చేయలేదు. ఈడబ్ల్యూఎస్‌లో 5 శాతం కోటా కేవలం బాబు రాజకీయ ఎత్తుగడే. రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారు బీసీలా? ఓసీలా? అనే అయోమయ స్థితిలోకి నెట్టేసింది చంద్రబాబే. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వం కాపులకు ఏ విధమైన రిజర్వేషన్లు కల్పించలేదు. కానీ టీడీపీ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసేసినట్టు తప్పుడు వార్తా కథనాలు రాయిస్తున్నది చంద్రబాబే. రిజర్వేషన్ల సమస్య ఎప్పటికీ పరిష్కారం కాకుండా దాన్ని అడ్డుపెట్టుకుని కాపుల ఓట్లు దండుకోవాలన్నది చంద్రబాబు కుట్ర. ఇంతకాలం కాపు రిజర్వేషన్లకు బీసీలు ఒప్పుకోవడం లేదంటూ కాపులు, బీసీలకు మధ్య అగాధం సృష్టించి చంద్రబాబు రాజకీయంగా పబ్బం గడుపుకున్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్‌ను పూర్తిగా మోసగించి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల పంపిణీ ఏ విధంగా చేశారో ప్రతి ఒక్కరూ గమనించారు. తన రాజకీయానికి అడ్డు లేకుండా పవన్‌ను ఢిల్లీకి పంపేయాలన్నది చంద్రబాబు మరో కుతంత్రం. కాపు నేస్తం పథకంతో వైఎస్సార్‌సీపీ ధృతరాష్ట్ర కౌగిలి అని వార్తలు రాయిస్తున్న చంద్రబాబుదే నిజమైన ధృతరాష్ట్ర కౌగిలి. అదే బాబు ధృతరాష్ట్ర కౌగిలిలో పవన్ చిక్కుకున్నారు. కాపులు సంఘటితం కాకూడదనే ముద్రగడను పవన్ కలవనీయకుండా చంద్రబాబు అడ్డుపడ్డారు' అని కాపు ఐక్య వేదిక నేతలు ఆ లేఖలో స్పష్టం చేశారు.

జూన్ నెల శ్రీవారి దర్శనం, ఆర్జితసేవ టికెట్లు,

శ్రీవారి సేవ కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం జూన్ నెలకు సంబంధించి ఈ నెలలో ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్న దర్శనం, ఆర్జితసేవ టికెట్లు, శ్రీవారిసేవ కోటా వివరాలను టీటీడీ తెలిపింది. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరింది. విడుదల చేయనున్న టికెట్లు, శ్రీవారిసేవ కోటా వివరాలు..



- ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు శ్రీవారి ఆర్జితసేవ టికెట్ల లక్కీడిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాలి.
- 21వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి ఆర్జిత సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్ల కోటా విడుదల చేస్తారు.
- జూన్ 19 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న జ్యేష్టాభిషేకం ఉత్సవంలో పాల్గొనేందుకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు భక్తులకు అందుబాటులో ఉంచుతారు.
- ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి వర్చువల్ సేవలైన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లు, దర్శన టికెట్ల కోటా విడుదల చేస్తారు.
- 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు అందుబాటులో ఉంటాయి.
- 23న ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతల దర్శనం, గదుల కోటా విడుదల చేస్తారు.
- 23న మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్ల కోటా విడుదల చేస్తారు.
- 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచుతారు.
- 25న మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని గదుల కోటా విడుదల చేస్తారు.
- 27న ఉదయం 11 గంటలకు తిరుమల, తిరుపతిలోని శ్రీవారిసేవ కోటాను, అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు నవనీతసేవ కోటాను, మధ్యాహ్నం ఒంటిగంటకు పరకామణిసేవ కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు.

పేద అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- నేడు వైఎస్సార్ ఈబీసీ నేస్తం విడుదల
- సీఎం జగన్ బనగానపల్లెలో బటన్ నొక్కి డబ్బు జమ
- 4,19,583 మందికి రూ.629.37 కోట్ల సాయం

సాక్షి, అమరావతి: మహిళా సాధికారత అనేది కేవలం సామాజిక న్యాయానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఆర్థిక తోడ్పాటు కూడా అనివార్యమనే సూత్రాన్ని బలంగా నమ్మిన సీఎం జగన్.. ఈ విషయాన్ని ఆచరణలో చూపించేలా ఆర్థికంగా వెనుకబడిన ఓసీ వర్గాల (ఈబీసీ) అక్కచెల్లెమ్మల జీవితాల్లో కాంతులు నింపుతున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజికవర్గాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు. ఈ క్రమంలో అర్హులైన 4,19,583 మంది ఈబీసీ పేద అక్కచెల్లెమ్మలకు రూ.629.37 కోట్లను గురువారం విడుదల చేయనున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో సొమ్ము జమచేయనున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ వర్గాలకు చెందిన పేద అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారు. మూడేళ్లలో మొత్తం రూ.45 సాయం అందిస్తూ వారి కాళ్లమీద వారు నిలబడేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. వివిధ పథకాల ద్వారా కేవలం అక్కచెల్లెమ్మలకు మాత్రమే గత 58 నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన లబ్ధి.. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం రూ.2,79,786 కోట్లు. గురువారం ఇస్తున్న రూ.629.37 కోట్లతో కలిపి ఇప్పటివరకు కేవలం వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.1,876.97 కోట్లు. ఒక్కో అక్కచెల్లెమ్మకు ఈ ఒక్క పథకం ద్వారా మూడేళ్లలో అందించిన మొత్తం సాయం రూ.45 వేలు కావడం గమనార్హం.

లా వర్సిటీకి భూమిపూజ

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లక్ష్మీపురంలో జగన్నాథగట్టుపై 150 ఎకరాల్లో రూ.1,011 కోట్లతో నిర్మించనున్న నేషనల్ లా యూనివర్సిటీకి గురువారం సీఎం జగన్ భూమిపూజ చేయనున్నారు. అనంతరం బనగానపల్లెలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం ఆర్థికసాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తారు.

ఆర్టీసీ ఎండీ పేరిట ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేరుతో సైబర్ నేరస్తులు ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీన్ని గుర్తించి విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. తనకు ఫేస్‌బుక్‌తో సహా సోషల్ మీడియాలో ఎలాంటి ఖాతాలు లేవని స్పష్టం చేశారు. తన పేరిట ఉన్న ఫేస్‌బుక్ ఖాతాకు గానీ, ఇతరత్రా పోస్టులకు గానీ ఎవరూ స్పందించవద్దని విజ్ఞప్తి చేశారు.

'శరత్ కస్టడీ'పై పోలీసుల పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధుల మళ్లింపు తదితర ఆరోపణలపై అరెస్టయిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను తమ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది. శరత్‌ను పోలీసు కస్టడీకి అప్పగించేందుకు నిరాకరిస్తూ విజయవాడ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను న్యాయస్థానం సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం తీర్పు వెలువరించారు. శరత్‌ను తమ కస్టడీకి ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టులో ఇటీవల రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుపై పిల్‌ను గతంలోనే హైకోర్టు కొట్టేసింది

- ఇప్పుడు మళ్లీ అదే రీతిలో పిల్ దాఖలు చేశారు
- హైకోర్టు దృష్టికి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ పిల్, అందులో ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించండి
- పిటిషనర్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- విచారణ 20కి వాయిదా

సాక్షి, అమరావతి: వలంటీర్ల వ్యవస్థను సవాలు చేస్తూ 2019లో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైందని, దానిని ధర్మాసనం ఇప్పటికే కొట్టేసిందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. వలంటీర్లపై ఢిల్లీ హైకోర్టులో మరో వ్యాజ్యం పెండింగులో ఉందని తెలిపింది. ఇప్పుడు మళ్లీ అదే రీతిలో పిటిషన్ దాఖలు చేశారని వివరించింది. దీంతో ఇదే అంశంపై ఇప్పటికే దాఖలైన పిల్‌ను, అందులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించి రావాలని, ఆ తరువాతే విచారణ జరుపుతామని పిటిషనర్‌కు హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థను తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో జారీ చేసిన జీవో 104తో పాటు తదనుగుణంగా జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా, ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటకు చెందిన షేక్ అబూబాకర్ సిద్దిఖీ దాఖలు చేసిన పిల్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. విచారణ మొదలు కావడానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ గతంలో దాఖలైన పిల్‌ను, దానిని ధర్మాసనం కొట్టేసిన విషయం, ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాన్ని కోర్టుకు వివరించారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని సీజే ధర్మాసనాన్ని కోరారు. అనంతరం పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు అమలు కావడంలేదన్నారు. ఎన్నికల్లో ఏం చేయాలో వలంటీర్లకు సీఎం మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి, ప్రజల ఇళ్లకు వెళ్లడానికి తేడా ఉందని స్పష్టం చేసింది. వలంటీర్ల వ్యవస్థపై ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాన్ని, అందులో ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించి రావాలని మురళీధరరావుకు ధర్మాసనం సూచించింది. విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.

వారి వినతులపై నిర్ణయం తీసుకోండి

వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఈ విషయంలో తాము ఇచ్చిన వినతి పత్రాలను ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదంటూ సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. వాదనలు విన్న ధర్మాసనం, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఇచ్చిన వినతి పత్రాలపై తగిన నిర్ణయం వెలువరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

అక్రమ ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎక్కడ ఇసుక తవ్వకాలు జరుపుతున్నా, వాటి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇసుక అక్రమ తవ్వకాలను ఎంతమాత్రం ఉపేక్షించడంలేదని తెలిపింది. ఇసుక తవ్వకాలకు భారీ యంత్రాలను ఉపయోగించకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వివరించారు. ఇసుక తవ్వకాలు చేపడుతున్న జీసీకేసీ సంస్థ ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు, కేంద్రం నుంచీ అనుమతులు తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై కేంద్ర పర్యావరణ, అటవీశాఖ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత గడువు కావాలని కోరారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు.. ఇసుక ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఇసుక ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయని వ్యాఖ్యానించింది. ఇసుక ధరల నుంచి సామాన్యులను రక్షించాలంది. ఇసుక ధరల విషయంలో అధికారులకు నియంత్రణ ఉన్నట్లు కనిపించడం లేదంది. ఇసుక ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. అలాగే జనావాసాల నుంచి ఇసుక రవాణా చేయకుండా కూడా చర్యలు తీసుకోవాలంది. ఈ విషయంలో ఎంవోఈఎఫ్ మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలం ముత్తాయపాలెం సమీపంలో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ వరప్రసాద్, మరికొందరు హైకోర్టులో గతేడాది పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం మరోసారి విచారించింది.

సంతుష్టిగా ఉండటం సహజ సంపద,
విలాసం కృత్రిమ పేదరికం.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 14 మార్చి 2024

బెంగళూరు దాహార్తి!

దేశంలో నీటి ఎద్దడి నిత్యజీవిత వ్యథగా పరిణమించి చాలా కాలమైంది. అది స్థలకాలాదులను అధిగమించింది. దాని బారిన పడని నగరమంటూ లేదు. బెంగళూరు దాహార్తి అందులో భాగమే. అది జనాభారీత్యా దేశంలో మూడో అతి పెద్ద నగరం. సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో అది దేశానికే ఐటీ రాజధాని. కానీ తాగటానికి గుక్కెడు నీళ్లు కరువైతే ఆ భుజకీర్తులన్నీ దేనికి పనికొస్తాయి? 500 ఏళ్లనాటి ఆ నగరం గొంతెండి నీళ్ల కోసం అలమటిస్తోంది. టెకీలంతా నగరాన్నొదిలి స్వస్థలాల నుంచి పనిచేయటం మొదలుపెట్టారు. అపార్ట్‌మెంట్‌లన్నీ బేల చూపులు చూస్తున్నాయి. కోచింగ్ సెంటర్లు ఆన్‌లైన్ క్లాసులకు మళ్లాయి. రోడ్డుపై పోయే నీటి ట్యాంకర్ల వెనక జనం పరుగు లెడుతున్నారు. ఇది పరీక్షల కాలమైనా విద్యార్థులకు నీటి అన్వేషణ ముఖ్యమైపోయింది. కావేరి పరివాహ ప్రాంతాన్ని కరువు కాటేయటంతో నగరానికి వచ్చే నీరు తగ్గింది. భూగర్భ జలాలు అడుగంటాయి. మార్చి నెలాఖరుకు రావాల్సిన ఉష్ణోగ్రతలు బెంగళూరును ఫిబ్రవరి మూడోవారం లోనే పలకరించాయి. కోటిన్నర జనాభాగల ఆ నగరంలో వాల్‌మార్ట్ మొదలుకొని గూగుల్ వరకూ ఎన్నో అంతర్జాతీయ సంస్థలున్నాయి. ఇవిగాక బోలెడు స్టార్టప్‌లు కొలువుదీరాయి. బెంగళూరుకు సగటున రోజుకు కనీసం 185 కోట్ల లీటర్ల నీరు లభిస్తుండగా కనీసం మరో 168 కోట్ల లీటర్లు అవసరమని అంచనా. కానీ ఎక్కడుంది లభ్యత? ఇది దిక్కుతోచని స్థితి.

ఆరా తీస్తే బెంగళూరు నగరానిది కూడా దేశంలోని అన్ని నగరాల వ్యథే. మౌలిక సదుపాయాల కల్పనపై కనీస స్థాయి దృష్టిపెట్టకుండా దశాబ్దాలుగా అభివృద్ధిని కేంద్రీకరించిన పర్యవసానమే ప్రస్తుత కష్టాలకు మూలకారణం. అభివృద్ధి పేరు చెప్పి వెనకా ముందూ చూడకుండా హరిత ప్రాంతాలను హరించటంవల్ల వర్షాలు గణనీయంగా తగ్గాయి. పెరుగుతున్న జనాభా పేరు చెప్పి ఆవాసప్రాంతాలను విస్తరించటం, అందుకోసం చెరువులనూ, సరస్సులనూ మాయం చేయటం అలవాటైపోయింది. 1961 నాటికి బెంగళూరు నగర పరిసరాల్లో 262 సరస్సులుండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 81కి పడిపోయింది. వాస్తవానికి ఆ సరస్సుల్లో ఇప్పటికీ జీవంతో వున్నవి కేవలం 33 మాత్రమే. జనావాసాలకు అననుకూల ప్రాంతాల్లో వుండటంవల్లే ఇవి బతికిపోయాయి. మిగిలినవి పేరుకు సరస్సులుగా వున్నా వాటిలో చుక్క నీరు కూడా కనబడదు. ఇంకా దారుణం... ఇప్పుడున్న సరస్సుల్లో 90 శాతం కాలుష్యం కారణంగా పనికిరాకపోవచ్చని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధ్యయనంలో తేలింది. లీటర్ నీటిలో కనీసం 4 మిల్లీగ్రాముల ఆక్సిజన్ వుంటేనే ఆ నీరు మెరుగ్గా వున్నట్టు లెక్క. కానీ అంతకన్నా తక్కువ స్థాయిలో ఆక్సిజన్ వున్నదని నిపుణులు తేల్చారు. ఎన్నడో 1971లో ఇరాన్‌లోని రాంసర్‌లో నీటి వనరుల సంరక్షణపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో కుదిరిన ఒడంబడికపై సంతకం చేసిన దేశాల్లో భారత్ కూడావుంది. కానీ దానికి అనుగుణంగా శ్రద్ధాసక్తులు కనబరిచిన దాఖలా లేదు. 2030 నాటికి నీటి అవసరాలు రెట్టింపవుతాయని నీతి ఆయోగ్ నివేదిక 2018లో చెప్పింది. మన దేశంలో కేవలం రక్షిత మంచినీరు అందక ఏటా 2 లక్షలమంది మరణిస్తున్నారని వివరించింది. అంతకు రెండేళ్లముందు దక్షిణ కన్నడ జిల్లాలోని మూడ్‌బిద్రీలో సరస్సులపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. హరిత ఆచ్ఛాదనగా వున్న పట్టణ అడవులు, తడి నేలలు వగైరాలను పట్టణీకరణ కోసం మూడు దశాబ్దాలుగా డీ నోటిఫై చేస్తున్నారనీ, ఇది బెంగళూరుకు ముప్పు కలిగిస్తుందనీ సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. కానీ ఏళ్లు గడుస్తున్నకొద్దీ ఆ ధోరణి మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. అసలు పట్టణీకరణలో స్థానిక జీవావరణం, పర్యావరణం, నీటి లభ్యత వగైరాలకు చోటేలేదు. వాటిపై ఎలాంటి అధ్యయనమూ లేదు. కేంద్రీకృత అభివృద్ధి వల్ల జనాభా అనేక రెట్లు పెరగటం, దాంతోపాటే మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్థం కావటం తరచు కనబడుతున్న వాస్తవం. స్థానికంగా వుండే చెరువులు, సరస్సులు వగైరాల్లో మురుగు నీరు విడిచిపెట్టే దురలవాటుతో అటు నీటి వనరులూ నాశనమవుతున్నాయి, ఇటు భూగర్భ జలాలు సైతం కాలుష్యం బారిన పడుతున్నాయి.

నగరాలు నేల చూపులు విడిచిపెడుతున్న తీరు ఆందోళనకరం. నేల విడిచి ఆకాశంలోకి దూసుకుపోయే నగరాలకు చుక్కలు కనబడటం ఖాయమని కేప్‌టౌన్ అనుభవాలు ఆరేళ్ల క్రితమే చెప్పాయి. దక్షిణ అట్లాంటిక్ సముద్ర తీరాన దక్షిణాఫ్రికాలో వున్న ఆ నగరంలో కళ్లు చెదిరే స్థాయిలో భారీ భవంతులు దర్శనమిస్తాయి. ప్రపంచం నలుమూలల నుంచీ తరలివచ్చే వినియోగ వస్తువులతో అక్కడి మహా దుకాణాలు మెరిసిపోతుంటాయి. ఏటా కనీసం 20 లక్షలమంది ఆ నగర అందచందాల్ని చూడటానికి తరలివస్తారని అంచనా. 46 లక్షల జనాభాగల ఆ నగరం 2018లో నీటి సంక్షోభంలో చిక్కుకుని గుడ్లు తేలేసింది. ఇళ్లకూ, దుకాణ సముదాయాలకూ, కార్యాలయాలకూ నీటి సరఫరాను పూర్తిగా నిలిపేసింది. 200 నీటి కేంద్రాలవద్ద రోజుకు మనిషికి 25 లీటర్ల నీరిస్తామని అన్ని అవసరాలనూ దాంతోనే తీర్చుకోవాలని ప్రకటించింది. నీటి సంరక్షణను ఒక సంస్కృతిగా మార్చుకుని ఇప్పుడిప్పుడే కుదుటపడటం మొదలెట్టింది. కేప్‌టౌన్ కష్టాలూ, వాటిని ఆ నగరం అధిగమించిన తీరూ అధ్యయనం చేయటం ఒక్క బెంగళూరుకు మాత్రమే కాదు... అన్ని మెట్రొపాలిటన్ నగరాలకూ తక్షణావసరం. నీటి వృథాను, నష్టాలను అరికట్టడంలో... కాలానుగుణమైన ప్రణాళికల రూపకల్పనలో స్థానిక సంస్థల చొరవను పెంచితేనే ఈ సమస్యను అధిగమించగలమని పాలకులు గుర్తించటం మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చవితి ఉ.6.40 వరకు, తదుపరి పంచమి తె.4.52 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** భరణి రా.10.08 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.8.24 నుండి 9.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.10 నుండి 10.58 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.5.40 నుండి 7.10 వరకు.

సూర్యోదయం : 6.14
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ద్రవిడవాదంలో వేర్పాటు నినాదం

విశ్లేషణ



పి. వేణుగోపాల్ రెడ్డి

వెనుకబాటుతనం ఆ ప్రాంతంలో అసంతృప్తిని రేకెత్తించడం, అది ఆగ్రహమై, ఉద్యమంగానో, ఆఖరికి ఉగ్రవాదంగానో పరిణమించడం పరిపాటే. ఒకప్పుడు ఈశాన్య భారతదేశంలో ప్రత్యేక దేశం నినాదాలు వినిపించేవి. కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు కూడా ఇదే వినిపించేవారు. రెడ్ కారిడార్ నినాదంలో కూడా ఇందుకు సంబంధించిన ఛాయలు ఉన్నాయి. కానీ తమిళనాడులో ద్రవిడవాదం మోతాదు ఎక్కువగా ఉన్న డీఎంకే వినిపించే వేర్పాటువాదం, తామొక జాతి అని చెప్పుకోవడం వెనుక కుత్సిత రాజకీయం మాత్రమే ఉంది. ఆ పార్టీలో కొందరు ప్రత్యేక దేశం నినాదాన్ని అందుకోవడం చరిత్ర పట్ల మహా ద్రోహం. భారతదేశం ఐక్యంగా ఉండాలన్న భావన కేవలం బీజేపీది అనుకోవడం అజ్ఞానం. ఒక పార్టీ మీద ద్వేషం దేశ ఐక్యతకు విఘాతం కారాదు.

భారత ఈశాన్య ప్రాంతాన్నో, కశ్మీర్ లోయ పరిస్థితులతోనో పోలిస్తే తమిళనాడు ప్రాంతం వేర్పాటువాద నినాదాన్ని అందుకోవలసిన అగత్యం ఏమాత్రం లేదు. కొందరు నాయకుల అజెండా ప్రజలందరి ఆశయం కూడా కాదు. తమిళ సమాజంలో అందుకు సంబంధించిన రుజువులు కూడా లేవు. చెన్నై ఇవాళ నాలుగు మెట్రో నగరాలలో ఒకటి. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం (ఏ పార్టీది అయినా) అండ లేకుండా అది సాధ్యమయ్యేదేనా? ఢిల్లీ వివక్షే చూపి ఉంటే జరిగేదేనా?

ద్రవిడవాదం, అది చెప్పే ప్రాంతీయవాదం, వేర్పాటువాదం, నాస్తికత్వం తమిళనాట కొద్దిమందిలో ఉంటే ఉండవచ్చు. మెజారిటీ ప్రజలు కచ్చితంగా వాటికి దూరంగానే ఉన్నారు. అక్కడి జీవన సరళిని చూసినవారు ఎవరైనా దీనిని ఒప్పుకుంటారు. కాబట్టి తమిళనాడులో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే వాదనలు కుత్సిత రాజకీయానికి సంబంధించినవే. డీఎంకే ఎంపీ ఎ.రాజా తాజాగా భారత్ ఒక దేశం కాదని తీర్పు ఇచ్చాడు. ఇది కొన్ని రాష్ట్రాల కూటమి అంటాడు. ఒక దేశమైతే ఒకే భాష ఉంటుందని వింత భాష్యం చెప్పాడు. తమిళనాడుకు దేశం అనదగ్గ లక్షణాలు ఉన్నాయంటాడు. ఈ దేశంలో అనుసంధాన భాషగా సంస్కృతం చిరకాలం ఉంది. రాజా వాదన మీదే ఒక్క క్షణం నిలబడి ఇంకొక ప్రశ్న వేయాలి. తమిళనాడులోనే ఉన్న కొంగునాడు (కొంత భాగం కేరళ, కర్ణాటకలలో కూడా విస్తరించి ఉంది) ప్రజలు ఇది కూడా 'నాడు', కాబట్టి తమదీ ఒక జాతేననీ, తమకూ దేశం కావాలనీ అంటే డీఎంకే ప్రభుత్వం నుంచి ఏం సమాధానం వస్తుంది? 'నాడు' అనేది భౌగోళిక ఉనికికి పేరు. అది మరచిపోతే ఎలా?

తమిళులకో ప్రత్యేక దేశం కోరికతో ఈవీ రామస్వామి నాయకర్ క్రిప్స్ మిషన్‌కు వినతిపత్రం సమర్పించాడు. దానికి హేతుబద్ధమైన ప్రాతిపదిక ఏమిటో ఇప్పటికీ తెలియదు. ద్రవిడస్థాన్ నినాదంతో, కోరికతో ఏమాత్రం పొంతన లేనిది ముస్లింలకో ప్రత్యేక రాజ్యం. అది జిన్నా, కొందరు ముస్లింల కోరిక. అలాంటి జిన్నాను తనకు వత్తాసుగా తెచ్చుకోవాలని చూసి ఈవీ భంగపడిన సంగతి చరిత్ర ప్రసిద్ధమే. 'నేను ముస్లింలందరికీ నాయకుడినే; కానీ తమిళులంతా నీ (ఈవీ) వెనుక లేరు' అన్నది జిన్నా వివరణ. నేటికీ అదే వాస్తవం. తమిళులంతా ద్రవిడవాదం మత్తులో లేరు. ఏనాడూ లేరు. 1942లోనే కాలం చేసిన ఆ వాదాన్ని ఆవాహన చేస్తామని బెదిరిస్తూ డీఎంకే పబ్బం గడుపుకొంటున్నది. ఇదంతా గమనించాక ఈవీ రామస్వామి నాయకర్‌ను పిచ్చాసుపత్రిలో ఉంచవలసిన వ్యక్తిగా ప్రథమ ప్రధాని నెహ్రూ కూడా భావించారు. కానీ ఇప్పటికీ అలాంటివాడి వికృత వాదంతో పార్టీలు రాజకీయాలు సాగించడమే విషాదం. ఎ.రాజా తాజా ప్రకటన కావచ్చు, ఆ మధ్య ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన సనాతన ధర్మ వ్యతిరేక వ్యాఖ్యలు కావచ్చు, ఆ ఆవాహన బెదిరింపులో భాగమే. వీటికి తాజా నేపథ్యం ఉంది. దేశ రాజకీయాలలో బీజేపీ ప్రబల శక్తిగా ఎదగడం. ద్రవిడవాద అడ్డా తమిళనాడుకు రాదనుకున్న బీజేపీ... అన్నామలై (తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు) రూపంలో విశ్వరూపం దాల్చడం!



భారత్: భిన్నత్వంలో ఏకత్వం

భారత్ ఒక దేశం కాదు, ఉపఖండం అంటాడు రాజా. ఈ ఒక్క అంశమే కేంద్రబిందువుగా ఆయన వాదం సాగడం లేదు. దీనికి రాముడినీ, రామాయణాన్నీ జోడిస్తున్నాడు. ఆ రెండు అంశాల మీద ఆయనకి విశ్వాసం లేదట. లేకపోవచ్చు. కానీ రాజా ఈ రాముడినీ, రామాయణాన్నీ డీఎంకే వేర్పాటువాదానికి తోడు తెచ్చుకునే పిచ్చి ప్రయత్నం చేస్తున్నాడు. రాముడు భారతదేశ ఉత్తర భాగం వాడనీ, భారతభూమి దక్షిణ భాగంతో సంబంధమే లేదనీ డీఎంకే మొదటి నుంచి భాష్యం చెబుతోంది. ఈరోడ్ జిల్లా గోబిచెట్టిపాళయం వద్ద ఇటీవలే జరిగిన సభలో రాజా ఇవన్నీ మాట్లాడాడు. నిజానికి ఈ వాదం కూడా తప్పే. దీనికి అన్నామలై ఇటీవలనే చక్కని వివరణ ఇచ్చాడు. తమిళనాడులోనే ఆరణి క్షేత్రంలో శివాలయం ఉంది. దాని పేరు పుత్తరకామెట్టీశ్వరాలయం. దశరథుడు ఇక్కడికి వచ్చి తపస్సు చేసిన తరువాతే ఆయనకు సంతానం కలిగిందని ప్రతీతి. అలాగే రామేశ్వరానికీ, వారణాసికీ నేటికీ చెక్కుచెదరకుండా కొనసాగుతున్న బంధాన్ని మరచిపోరాదు. ఈ జనవరి 22న అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరిగిన బాలరాముడి ప్రతిమకు దక్షిణాది కన్నడిగుడే జన్మనివ్వడం యాదృచ్ఛికం కావచ్చు.

భారతదేశం ఐక్యంగా ఉండాలన్న భావన 1950లలో పుట్టిన భారతీయ జనసంఘ్‌దో లేదా 1980లలో ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీదో అనుకోవడం శుద్ధ అజ్ఞానం. మొత్తం భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుంచి విముక్తం చేసే ఉద్దేశంతోనే భారత స్వాతంత్య్రోద్యమం సాగింది. దీనికి వందలాది ఉదాహరణలు చూపించవచ్చు. తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి జీవితమే దీనికి రుజువు. గాంధీజీ పిలుపునకు, సైమన్ కమిషన్ వ్యతిరేకోద్యమానికి తమిళనాడు కూడా కదిలింది. జాతీయ భావనతో, సాంస్కృతికంగా ఏకత్వం ఉన్న దేశంలో సామాజిక రాజకీయ ఏకత్వం తేవడానికి భారత జాతీయ కాంగ్రెస్, కొన్ని ఇతర అతివాద జాతీయ భావాలను నమ్మిన సంస్థలు పనిచేశాయి. జాతీయ కాంగ్రెస్ తన సభలు తమిళనాడులోనూ (నాటి మద్రాస్ ప్రెసిడెన్సీ) పలుసార్లు నిర్వహించింది. అడయార్ కేంద్రంగా పనిచేసిన అనీబిసెంట్ భారతీయులందరి స్వేచ్ఛ కోసం పనిచేశారు. కానీ మరొక పక్క తమిళనాడులో బలపడిన జస్టిస్ పార్టీ బ్రిటిష్ వాళ్ల మోచేతి నీళ్లు తాగింది. భారత్ ఐక్యతకూ, భారతీయులు చైతన్యవంతం కావడానికీ ఇంగ్లండ్ బద్ధవ్యతిరేకి. ఎవరో ఒకరిని వివక్షతో అణచివేయడానికి కుటిలనీతిని అవలంబించడమే బ్రిటిష్ లక్షణం. దాని అవశేషమే ద్రవిడవాదం. దాని పేలికే డీఎంకే. భారతదేశ చరిత్రను బట్టి, సమీప గతాన్ని బట్టి, ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ పరిణామాల ఆధారంగా డీఎంకే నేతల వదరుబోతుతనం ఎంత నిర్హేతుకమో అర్థం చేసుకొనే ప్రయత్నం చేయాలి. నాలుగు ముక్కలైన పోలెండ్ కలసిపోయింది. రెండు ముక్కలయిన జర్మనీ ఐక్యమైంది. వేరుకావడం వల్ల కలిగే కష్టనష్టాలను ప్రపంచం గుర్తిస్తున్న క్షణాలివి. సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా, ఆక్రమిత కశ్మీర్‌లో, బలూచిస్తాన్‌లో ప్రజలు తాము భారత దేశంలో భాగం కావాలనుకుంటున్నామని చెప్పుకోవడం వాస్తవం. ఇన్ని ఉదాహరణలు ఉండగా ఇంత అభివృద్ధి చెందిన దేశంలో వేరే దేశం కోరుకోవడం, అది కూడా తమ పార్టీ బలహీనపడే లేదా ఓడిపోయే పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రత్యేక దేశం నినాదాన్ని అందుకోవడం చరిత్ర పట్ల మహా ద్రోహం. ఓట్ల రాజకీయంతో స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని భగ్నం చేయాలని అనుకుంటే ఆ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పడం అవసరమే.

ఇప్పుడు ఎ. రాజా ప్రకటననీ, అప్పుడు ఉదయనిధి స్టాలిన్ వాగుడునూ బీజేపీ ఖండించింది. అది సహజమే. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఖండించింది. 'రాజా వ్యాఖ్యలతో నేను నూరు శాతం విభేదిస్తున్నాను' అంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ నిర్ద్వంద్వంగా పేర్కొనడం స్వాగతించవలసినదే. ఆ పార్టీ కర్ణాటక ఎంపీ డీకే సురేశ్ రెండు భారతదేశాల గురించి మాట్లాడినందుకు ఇది పాప పరిహారం కావచ్చు. రేపు ఎన్నికలలో 'ఇండి' పేరుతో ఎన్‌డీఏని ఎదుర్కొనబోతున్న కూటమి భాగస్వాములు తోటి ద్రవిడ భాగస్వామి చేస్తున్న ఇలాంటి ప్రేలాపనలను నిర్ద్వంద్వంగా ఖండించడం అవసరం. భారతీయ జనతా పార్టీని వ్యతిరేకించడం, దానిని అధికారం నుంచి దించాలనుకోవడం తప్పు పట్టవలసిన విషయం కాదు. కానీ ఒక రాజకీయ పార్టీ మీద ద్వేషం భారతదేశ ఐక్యతకు విఘాతం కారాదు.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ । pvg@ekalavya.net

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

చేదు వాస్తవం

శరణార్థులకు ఆశ్రయం ఇస్తున్న దేశాన్నేమో జనాలు ద్వేషిస్తున్నారు. కానీ ఆ శరణార్థుల రాకకు కారణమవుతున్న దేశాన్నేమో వదిలేస్తున్నారు. అది ముందు గ్రహించండి.

– అహ్మద్ షరీఫ్, వ్యాఖ్యాత

మెరుగ్గా లేదా?

రవిచంద్రన్ అశ్విన్ 2011లో వెస్ట్ ఇండీస్‌తో ఆడిన తన తొలి టెస్టులో 128 పరుగులిచ్చి 9 వికెట్లు తీశాడు. అదే అశ్విన్ మొన్న ఇంగ్లండ్‌తో ఆడిన తన నూరో టెస్టులో కూడా 128 పరుగులిచ్చి 9 వికెట్లు తీశాడు. కార్పొరేట్ హెచ్‌ఆర్ దృష్టికోణం: రవిచంద్రన్ అశ్విన్ పనితీరు వంద టెస్టుల్లోనున్నా శాతమే మెరుగుపడింది!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చేయలేరా?

దాదాపు ప్రధానస్రవంతి ఆర్థికవేత్తలందరూ లెఫ్టిస్టులే. కానీ వాళ్లెవరూ కేరళ ఆర్థిక సంక్షోభాన్ని ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్థం కాదు.

– విజయ్ పటేల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కంట్రోల్

జూన్ 30 దాకా సమయం కోరింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎన్నికల బాండ్ల విషయంలో). కానీ సుప్రీంకోర్టు ఒత్తిడి చేసేసరికి ఒక్క రోజులోనే డేటా ఇచ్చేసింది. ఏజెన్సీలను బీజేపీ ఎలా నియంత్రిస్తున్నదో చెప్పడానికి ఇదే ఉదాహరణ.

– నరుందార్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అనుమానమే!

బెంగళూరు రామేశ్వరం కెఫే పేలుళ్లకు సంబంధించిన కీలక అనుమానితుడు షబ్బీర్‌ను బళ్లారిలో ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ విచారణను ఎన్ఐఏ చేపట్టక పోయివుంటే కూడా ఇదే విధంగా విచారణ జరిగేదా?

– నూపుర్ జె శర్మ, సంపాదకురాలు

దేశానికి దెబ్బ

ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోదీని మూడోసారి కూడా బీజేపీ ప్రతిపాదిస్తే దాన్ని దేశం బహిరంగంగా వ్యతిరేకించాలి. 'ఎవరూ రాలేదు' అని అబద్ధం చెప్పి, 4,065 చదరపు కిలోమీటర్ల వివాదరహిత భారత ప్రాంతాన్ని చైనా మింగడానికి ఉత్తిపుణ్యానికి ఆయన అనుమతించారు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

వృద్ధి జరిగినట్టా?

భారత వృద్ధి రేటు 7.6 శాతం ఉండటం మంచిదే. కానీ అందులో ఒక అంశం ఉంది. సూక్ష్మంగా గమనించి చూస్తే, చాలామంది సాధారణ జనాలకు దీనివల్ల ప్రయోజనం లేదని అర్థమవుతుంది. 2017లో సృష్టించిన 73 శాతం సంపద కేవలం 1 శాతం అత్యంత ధనవంతులకే చేరింది. 2020–22 వరకు కోటీశ్వరుల ఆదాయం 121 శాతం పెరిగింది. 2022 అక్టోబర్ నుంచి 2023 సెప్టెంబర్ మధ్యలో 96,917 మంది భారతీయులను యూఎస్‌ఏలోకి ప్రవేశిస్తుండగా అడ్డుకున్నారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

కల్తీతో కిడ్నీలు ఖరాబ్

ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం 'ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం' జరుపుకొంటారు. ప్రపంచంలో సుమారు 10 శాతం జనాభా అనగా 85 కోట్ల మంది 'క్రిటికల్ కిడ్నీ డిసీజ్' (సి.కె.డి.)తో బాధ పడుతుండగా, మనదేశంలో సుమారు 10 శాతం మంది కిడ్నీ (మూత్రపిండ) జబ్బులతో బాధపడుతున్నారు అని నివేదికలు చెబుతున్నాయి. 140 కోట్ల మంది ఉన్న భారత్‌లో కేవలం సుమారు 2,600 మంది మూత్రపిండాల వ్యాధి నిపుణులు (నెఫ్రాలజిస్టులు) మాత్రమే ఉండడం ఆందోళన కలిగించే అంశం. దీంతో కిడ్నీ డిసీజ్‌లతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందడం లేదు. ఇకనైనా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. క్యాన్సర్ వ్యాధిలాగే ఈ మూత్రపిండాల వ్యాధి కూడా బాగా ముదిరిన తరువాతే బయటపడుతుంది. అందుచేతనే ఈ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించాలి.

డయాబెటిస్, అధిక రక్తపోటు మూత్రపిండాల వ్యాధులకు ప్రధాన కారణం. వీటిని అదుపులో ఉంచుకోవాలి. కనీసం ప్రతి సంవత్సరం క్రియాటిన్, యూరిన్ అల్బుమిన్ పరీక్షలు చేయించుకోవాలి. వైద్యులను సంప్రదించాలి. సమయానికి నిద్ర పోవడం, తరచూ నీళ్ళు తాగడం, కల్తీలేని రసాయనాలు కలవని ఆహారాన్నీ, తేలికగా జీర్ణమయ్యే పదార్థాలనూ తినడం వంటి కార్యకలాపాల ద్వారా కిడ్నీ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 'జగనన్న సురక్ష' ద్వారా తరచూ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, 'ఆరోగ్య శ్రీ' పథకం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నీటి కాలుష్యం ద్వారా మూత్ర పిండాలు వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రహించాలి. మూత్ర పిండాల పనితీరు పైనే మానవుని ఆరోగ్యం ఆధారపడి ఉందన్న విషయాన్ని ఇటు ప్రభుత్వాలూ, అటు ఎన్జీఓలూ, వైద్య సిబ్బందీ ప్రజలకు అవగాహన కల్పించాలి. అవగాహన కల్పించటమే ఈ దినోత్సవం వెనుక ఉన్న పరమార్థం. మూత్రపిండాల వ్యాధి తక్కువగా ఉన్న స్విట్జర్లాండ్ దేశం వలే మనదేశం కూడా 2047 నాటికి 'జీరో సి.కె.డి.' దేశంగా గుర్తింపు పొందాలని ఆశిద్దాం.

– ఐ. ప్రసాదరావు, కాకినాడ
(నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం)

జనం కొరకు – జనం కన్న – జననేత జగన్!

లాభాలే లక్ష్యంగా గల వ్యాపారుల్లో టాటాల వంటి సామాజిక శ్రేయోభిలాషులు కొందరున్నట్లే; అధికారమే పరమావధిగా గల పాలక వర్గాల్లోనూ సేవా దృక్పథం గల మానవీయ నేతలు కొందరున్నారు. చనిపోయి గూడ బతికున్న 'రామన్న' – 'రాజన్న'ల వంటి నేతలే అందుకు నిదర్శనం!

'ఉన్నది అమ్ముకో! లేనిది కొనుక్కో' మంటున్న గ్లోబల్ వ్యాపార వ్యవస్థలో, అట్టి మానవీయ నేతల్ని పది కాలాలపాటు కాపాడుకోవాలి. ముఖ్యంగా రెక్కల కష్టం తప్ప, అమ్ముకోవటానికి ఏమీ లేని పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల వారికిది అవశ్య కర్తవ్యం. అడ్డగోలుగా పెరిగిపోతున్న ఈ ఆర్థిక అసమానతల సమాజంలో మానవీయ నేతను ఎన్నుకోవటమే, కులమతాతీతంగా పేదలందరికీ శ్రీరామరక్ష!

'డబ్బుతో అధికారం – అధికారంతో డబ్బు'గ మారిన నేటి రాజకీయ వ్యవస్థలో మానవీయ నేతల ప్రకాశాన్ని, కార్పొరేట్ల మీడియా, సోషల్ మీడియాలు అభాండాలు, ఆరోపణల కారుమబ్బులతో కప్పేస్తున్నాయి. అవెంతటి బలీయమైనవంటే... కేవలం నిరక్షరాస్యులనే కాదు, సగటు విద్యావంతుల్ని సైతం అపమార్గం పట్టిస్తున్నాయి. ఏపీలోని ప్రస్తుత రాజకీయ పార్టీల నేతలందరిలోనూ మానవతా దృక్పథం కలిగిన ఏకైక నేత జగన్ మోహన్ రెడ్డే. ఆయన హృదయం నుండి పొంగి పొరలిన 'అమ్మ ఒడి – గోరుముద్ద – ఫీజు రీయింబర్స్‌మెంట్ – పేద లందరికీ ఆంగ్ల మాధ్యమంలో విద్య – ఆరోగ్యశ్రీ – జల యజ్ఞం – రైతు భరోసా – పించన్ల పెంపు – పేదలకు ఇళ్ళు – వైఎస్సార్ ఆసరా – వైఎస్సార్ చేయూత వంటి సంక్షేమ పథకాలే అందుకు నిలువెత్తు నిదర్శనాలు.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయాన అన్ని మతాల పెద్దల చేత ప్రార్థనలు చేయించి తనలోని 'సర్వమత సామ రస్యత'ను చాటుకున్నారు జగన్. నాడు మత పెద్దలందరికీ వినమ్రంగా నమస్కరించి, అందరితో చేయి కలపటం ద్వారా 'హిందూ–ముస్లిం– క్రిస్టియన్ భాయీ భాయీ – మన రాష్ట్ర ప్రగతికై కలిపి నడుద్దాం చేయీ – చేయీ' అన్న ప్రబోధాన్నందించారు. భారతీయులకు, జాతీయ సమైక్యతా మార్గాన్ని చూపా రాయన.



ప్రమాణ స్వీకారానంతరం 'ఇది మా మేనిఫెస్టోకు లభించిన విజయం. అందుకే నాకూ, మా పార్టీ నేతలందరికీ పవిత్ర గ్రంథం' అని ప్రకటించటమే గాదు, దాన్ని ఆచరించే పరీక్షలో 99 శాతం మార్కులు సాధించి, దేశంలోనే అగ్రనేతగా నిలిచారు.

సామాజిక సమతుల్యత కోసం మంత్రి పదవుల్లో సగానికి పైగా ఎస్సీ–ఎస్టీ–బీసీ–మైనారిటీలకు కేటాయించారు. నామినేటెడ్ పదవుల్లోనే కాక పనుల్లోకూడా 50 శాతం వారికి కేటాయించారు. మహిళలకు కూడా ఇదే విధమైన కేటాయింపులు చేశారు. ఆలయాల ట్రస్టుల్లో బీసీ–ఎస్సీ–ఎస్టీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఇవన్నీ జగన్ మానవీయతకు దర్పణాలు. పేదలకు అందని చందమామగా ఉన్న ఇంగ్లీష్ మీడియం విద్యను అందించి పేద పిల్లలకు ఆత్మబంధువయ్యారు. అందుకే పేద విద్యార్థులు 'మా జగన్ మామ' అంటూ సగర్వంగా చెప్పుకుంటున్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థల ద్వారా ఇంటింటికీ పాలనను తెచ్చి; వృద్ధులు, పేదలందరి చేత 'మా పెద్ద బిడ్డ జగన్ బాబు' అంటూ ఆత్మీయునిగా చెప్పుకోబడుతున్న ఏకైక నేత జగన్! 'సత్య నిష్ఠ' మినహా పాలకులకు ప్రజా విశ్వాసాన్ని – మరేదీ సంపాదించలేద'న్నాడు మహాభారతంలో భీష్ముడు. మరి సత్యనిష్ఠ కలిగి ఉన్నందునే జగనన్నకంతటి జన బలం! 'సత్య నిష్ఠ'ను పాటించక పోవటమే 'బాబు టీడీపీ', 'పవన్ జనసేన'ల బలహీనత!

'పేదల, అన్నదాతల జీవితాలను ఇప్పుడున్న దానికన్నా ఇంకా మెరుగు పరచటమే నా లక్ష్యం!... మీ ఈ బిడ్డ వల్ల మీ కుటుంబాలకు మేలు జరిగితేనే తిరిగి నన్ను ఆశీర్వదించ' మంటున్నారు జగన్. అందుకే 'రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో జగన్‌ను గెలిపిస్తే అది జన విజయం. మీరు గెలిచేందుకు సిద్ధమా?' అంటూ జనాన్నే ప్రశ్నిస్తున్నారు జగన్. మేం సిద్ధమే అంటున్నారు జనం.

– ఆదివిష్ణు
రాజకీయ విశ్లేషకులు । 96662 65693

అదుపు–పొదుపు

జ్యోతిర్మయం

సంపాదించిన డబ్బును అదుపు తప్పి, ఖర్చు చేస్తూ, పొదుపు చేయలేనప్పుడూ; మాటలను మితంగా వాడుతూ పొదుపు చేయలేనప్పుడూ ఇబ్బంది పడతాము. సంపాదన అపరిమితంగా వస్తున్నప్పుడు సహజంగా మనిషిని అతిశయం, అహం వరిస్తాయి. రేపు ఎలా అనేది ఆలోచించరు. తమతో సమానంగా ఖర్చు పెట్టలేని వారిని తక్కువగా చూడటం, ఎదుటివారి ఆత్మగౌరవాన్ని న్యూనత పరచటం చేస్తుంటారు. అదుపులేని ఖర్చు, ఆడంబరాల కోసం చేసే వృథా ఖర్చు అనర్థాలకు కారణమౌతుంది. చేతిలో పైసా లేనపుడు ఎంత పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదు. అలవాటు లేని నిరాడంబర జీవితాన్ని గడపలేరు. పోయిన డబ్బు సంపాదించటానికి వయసు సహకరించక పోవచ్చు. బాగున్నప్పుడు ఉన్న స్నేహితులు, బంధువులు దూరమౌతారు. వెనక విమర్శిస్తూ ఉంటారు. దీనివల్ల తీవ్రమైన మానసిక వ్యథకు గురవుతారు. కొంచెం ముందు ఆలోచనతో తగినంత ఖర్చు చేస్తూ, రేపటికి పొదుపు చేస్తూ ఉంటే జీవితం సుఖవంతమౌతుంది.

పోయిన డబ్బునైనా తిరిగి సంపాదించవచ్చు కానీ, నోటి నుంచి ఒకసారి వెలువడిన మాటను వెనక్కి తీసుకోలేము. ఒక్క పరుషపు మాట బంధుత్వాలను, స్నేహాలను దూరం చేస్తుంది. మనసును ఆవేశం ఆక్రమిస్తున్న వేళ మౌనంగా ఉండటమే మేలు. 'వాక్ పారుష్యం చన్నే' అన్నాడు నన్నయ భారతం సభాపర్వంలో. పరుషపు మాట తగదని భావం. మాట కాఠిన్యం విషం కంటె, అగ్ని కంటె అతి భయంకరం అన్నాడు నన్నయ. ఒక ప్రేమ నిండిన మాట మనసు గాయాలను మాన్పుతుంది. ఒక స్ఫూర్తి నిచ్చే మాట లక్ష్యసిద్ధి వైపు నడిపిస్తుంది. అవసరానికి మించి ఎక్కువగా మాట్లాడితే ఏవో పొరపాటు మాటలు, ఎదుటివారిని గాయపరిచే మాటలు రావటానికి అవకాశం ఎక్కువ.

నాలుక అనేది జుట్లు జుట్లు ముడిపెడుతుంది. మనసులో విషం నింపుతుంది. అమృతాన్నీ చిందిస్తుంది. నాలుక ఒకటే గాని నానా రూపాలు ధరిస్తుంది. అందుకే మాటకూ, డబ్బుకూ అదుపూ, పొదుపూ అవసరం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

రేపు లేదా ఎల్లుండి సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి..

- సెక్యూరిటీ ఇబ్బందుల నేపథ్యంలో 14న చేరలేకపోతున్నా..
- కాపు ఉద్యమ నేత ముద్రగడ లేఖ



మీడియాతో మాట్లాడుతున్న ముద్రగడ

కిర్లంపూడి (కాకినాడ జిల్లా) : తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఈ నెల 14న పార్టీలోకి చేరేందుకు కాపు రిజర్వేషన్ పోరాట సమితి నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముహూర్తం ఖరారు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ముద్రగడ వెంట తాడేపల్లికి భారీ ర్యాలీగా వెళ్లేందుకు వేలాది మంది సిద్ధం అయ్యారు. దీనిపై కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని ముద్రగడ స్వగృహంలో బుధవారం ఆయన ప్రజలకు రాసిన లేఖను విడుదల చేశారు. లేఖ సారాంశం ప్రకారం.. ఈ నెల 14న తాడేపల్లి వెళ్లడానికి తీసుకున్న నిర్ణయంతో తనతో వచ్చేందుకు ప్రజల నుంచి భారీ స్పందన రావడంతో సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. ఎక్కువ మంది వస్తే కూర్చోడానికే కాదు.. కనీసం నిలబడడానికి కూడా స్థలం సరిపోదని, వచ్చిన ప్రతి ఒక్కరినీ చెక్ చేయడం చాలా ఇబ్బందని చెప్పడం వల్ల మనమందరం తాడేపల్లికి వెళ్లే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్టు తెలిపారు. 'మిమ్మల్ని నిరుత్సాహపర్చినందుకు మరోసారి క్షమాపణ చెప్తున్నా. ఈ నెల 15 లేక 16వ తేదీల్లో నేను ఒక్కడినే తాడేపల్లి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరతాను. మీరందరూ సీఎం జగన్‌కు, నాకు ఆశీస్సులు ఇవ్వాలని కోరుకుంటున్నా. నాతో కలిసి వచ్చే ప్రతి ఒక్కరినీ దఫదఫాలుగా సీఎం జగన్ సమక్షంలో పార్టీలోకి చేర్చే బాధ్యతను తీసుకుంటా' అంటూ ముద్రగడ మీడియాకు తెలిపారు. ఆయన కుమారుడు గిరిబాబు, గణేశుల రాంబాబు, గౌతుస్వామి, పెంటకోట నాగబాబు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంపు

ఆయుష్ హౌస్ సర్జన్స్, పీజీ విద్యార్థుల స్టైఫండ్ పెంచిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని హౌస్ సర్జన్స్, పీజీ వైద్య విద్యార్థుల తరహాలోనే ఆయుష్ సర్జన్స్, పీజీ విద్యార్థులకు స్టైఫండ్‌ను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హౌస్ సర్జన్ స్టైఫండ్‌ను రూ.15,817 నుంచి రూ.22,527కు పెంచారు. మొదటి ఏడాది పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.35,589 నుంచి రూ.50,686, రెండో ఏడాది వారికి రూ.37,566 నుంచి రూ.53,503, మూడో ఏడాది వారికి రూ.39,543 నుంచి రూ.56,319 వరకూ పెంచారు.

'ఆర్బీకేల్లో ఈ క్రాప్ తుది జాబితా'

సాక్షి, అమరావతి: రబీ 23–24 సీజన్‌లో సాగైన పంటలకు సంబంధించి ఈ క్రాప్ తుది జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్టు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ 23–24 సీజన్‌లో 42.93 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా.. 100 శాతం ఈ క్రాప్ నమోదైందన్నారు. రైతుల ఈకేవైసీ మాత్రం 97 శాతం పూర్తి అయ్యిందన్నారు. ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఆర్బీకేల్లో ప్రదర్శించామన్నారు. ఆర్బీకే స్థాయి గ్రామసభల్లో రైతుల నుంచి లిఖితపూర్వకంగా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం చేర్పులు, మార్పులు చేసి తుది జాబితాను తయారు చేశామన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన పంట వివరాలతో కూడిన భౌతిక రసీదులను ఆర్బీకే సిబ్బంది ద్వారా రైతులు పొందవచ్చునన్నారు. ఈ క్రాప్ తుది జాబితా వివరాలను రైతుల మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో కూడా పంపిస్తున్నామన్నారు.

రాష్ట్రానికి ఏం మేలు చేశారని బీజేపీతో పొత్తు


టీడీపీ, జనసేనను నిలదీసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసగించిన బీజేపీతో తెలుగుదేశం–జనసేన పార్టీలు పొత్తు పెట్టుకోవడం రాష్ట్రానికి మరింత ద్రోహం చేయడమేనని, ఈ పొత్తు ఎందుకో చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నిలదీశారు. బీజేపీ ప్రవేశపెట్టే ప్రజావ్యతిరేక బిల్లులకు శతశాతం ఏపీ ఎంపీలు ఆమోదం తెలుపుతూ బీజేపీకి సహకరిస్తున్నాయని విమర్శించారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సీపీఎం ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్నా, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, రాష్ట్రానికి రావల్సిన నిధులు విడుదల చేయకపోయినా బీజేపీతో తెలుగుదేశం, జనసేన పొత్తు పెట్టుకోవడాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నామని చెబుతున్న చంద్రబాబు.. ఆ ప్రయోజనాలు ఏమిటో వెల్లడించాలన్నారు. పొత్తు వల్ల కిందిస్థాయి కార్యకర్తలు కోపంతో రగిలిపోతున్నారని చెప్పారు. ప్రజల తరఫున పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రసంగంలో తప్పేముంది?

సీఎం ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించడమేమిటి?

సాక్షి, అమరావతి : పల్నాడు జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ప్రతిపక్ష నేతను విమర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించడం ఏమిటంటూ హైకోర్టు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీలను, ప్రస్తుతం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థను పోల్చారని, దీనిని తామెలా తప్పుపట్టగలమని ప్రశ్నించింది. అలా పోలిక తేవడానికి వీల్లేదంటారా అంటూ నిలదీసింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా ప్రజలకు వలంటీర్లు మంచి పని చేయడంలేదా? మంచి చేసిన వాళ్లను సన్మానించకూడదా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ కార్యక్రమానికి ఖర్చు చేసిన మొత్తాన్ని ముఖ్యమంత్రి నుంచి వసూలు చేయాలని ఎలా కోరతారు అంటూ ప్రశ్నించింది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయించాల్సింది కేంద్ర ఎన్నికల సంఘమే తప్ప, తాము కాదని హైకోర్టు తేల్చి చెప్పింది. అందులో జోక్యం చేసుకోలేమంది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిందని సీఈసీ తరపు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ హైకోర్టుకు వివరించారు. పోలింగ్ ఏజెంట్లుగా కూడా వ్యవహరించడానికి వీల్లేదని చెప్పామని, ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని తెలిపారు. వలంటీర్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నందున, ఈ వ్యాజ్యంలో విచారించేందుకు ఏమీ లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. పిల్‌ను కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.



వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉంచాలంటూ పిల్

ఎన్నికల్లో వలంటీర్లకు ఎలాంటి విధులు అప్పగించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా అన్నంభొట్లవారి పాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. పోలింగ్ కేంద్రాల్లోకి వలంటీర్లు వెళ్లకుండా ఆదేశాలివ్వాలని ఆయన కోర్టును కోరారు. పల్నాడు జిల్లాలో జరిగిన గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ప్రతిపక్ష నేతను విమర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కూడా సింగయ్య కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది అంబటి సుధాకర్‌రావు వాదనలు వినిపిస్తూ.. వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ప్రభుత్వ విజయం కోసం వలంటీర్లు కృషి చేయాలని, ప్రతిపక్షంపై యుద్ధం చేయాలని పిలుపునిచ్చారన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేలా వలంటీర్లను ప్రభావితం చేస్తున్నారని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ, ముఖ్యమంత్రి ప్రసంగంలో జన్మభూమి కమిటీల ప్రస్తావన వచ్చిందని, ఆ కమిటీలు ఏమిటని ప్రశ్నించింది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలని సుధాకర్‌రావు చెప్పారు. అలా అయితే ముఖ్యమంత్రి ప్రసంగంలో తప్పేముందని ధర్మాసనం ప్రశ్నించింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జన్మభూమి కమిటీలు, ప్రస్తుతం ఉన్న వలంటీర్ల వ్యవస్థను పోల్చుతూ మాట్లాడారని, దానిని చట్ట విరుద్ధంగా ప్రకటించమంటే ఎలా అంటూ నిలదీసింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా ప్రజలకు వలంటీర్లు మంచి పని చేయడంలేదా అని ప్రశ్నించింది. మంచి చేస్తున్నారని, అయితే ముఖ్యమంత్రి చెప్పిన విధంగా వలంటీర్లు పని చేస్తే ఎన్నికలు నిష్పాక్షికంగా జరగవని సుధాకర్‌రావు తెలిపారు. అందుకే వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కోరుతున్నామన్నారు. అది కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోనిదని ధర్మాసనం తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్పందిస్తూ.. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చినప్పుడు పిటిషనర్‌కు ఇంకా కావాల్సింది ఏముందని ధర్మాసనం ప్రశ్నించింది.

ఓటర్లు చాలా తెలివి గల వాళ్లు

ఈ సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం న్యాయవాది అవినాష్ దేశాయ్ జోక్యం చేసుకుంటూ.. వలంటీర్లను ఎన్నికలకు దూరంగా ఉండాలంటూ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు మాత్రమే ఎన్నికల విధుల్లో పాల్గొంటారని, వలంటీర్లకు, ఈ ఉద్యోగులకు ఏమాత్రం సంబంధం లేదని చెప్పారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ వ్యాజ్యంలో తదుపరి విచారించేందుకు ఏమీ లేదని స్పష్టం చేసింది. ఈ సమయంలో సుధాకర్‌రావు ఏదో చెప్పబోగా.. ధర్మాసనం ఆయన్ని వారించింది. ఓటర్లు చాలా తెలివి గలవారని, వారి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఓటర్లు ఎంత తెలివి గల వాళ్లో న్యాయవ్యవస్థలో ఉన్న మనందరికీ బాగా తెలుసునంటూ న్యాయవాద సంఘాల ఎన్నికల గురించి ధర్మాసనం ప్రస్తావించింది. న్యాయవాద సంఘాల ఎన్నికలప్పుడు ఓటర్లు ఓ వర్గం ఇచ్చే విందులో పాల్గొని, మరో వర్గానికి ఓటు వేస్తుంటారని నవ్వుతూ వ్యాఖ్యానించింది. ఓటర్ల గురంచి చింతించాల్సిన అవసరం లేదంది. పిల్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్ సీపీకే బీసీల మద్దతు

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాదం భాస్కర్ యాదవ్



మాట్లాడుతున్న సాధం భాస్కర్ యాదవ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): బీసీల సామాజిక న్యాయ సాధనకు ముందుకొచ్చిన వైఎస్సార్ సీపీకే బీసీలు తమ మద్దతు తెలియజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాదం భాస్కర్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో పెద్ద ఎత్తున ప్రాతినిధ్యం కల్పించారన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలను కాదని కొన్ని చోట్ల బీసీలకు సీట్లు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాయే తప్ప, వారికి చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని కులాలను సైతం గుర్తించి వారికి రాజకీయంగా సమున్నత స్థానం కల్పించారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న బీసీ అనుకూల వైఖరికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించడానికి సాధన సమితి సమాయత్తమవుతుందని తెలిపారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నెల్లూరు జిల్లాకు చెందిన ఆదిశంకరా గ్రూప్ ఆఫ్ కాలేజెస్ అధినేత పెంచలయ్యను నియమించారు. మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణ బీసీ నాయకులు పాల్గొన్నారు.

పవన్‌ను పిచ్చాస్పత్రిలో చేర్పించాలి

- నా మీద ద్వేషం లేదని ప్రకటించి నెల కాలేదు.. అంతలోనే రౌడీనయ్యానా?
- అభిమానులను సైతం అవమానిస్తూ 21 సీట్లకు దిగజారిపోయారు..
- ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



భీమవరం : నాపై ఎలాంటి ద్వేషం లేదంటూ ప్రకటించి నెల గడవక ముందే తనను రౌడీగా సంబోధించడం చూస్తుంటే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మతిస్థిమితం కోల్పోయినట్టు కనిపిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌ను తక్షణం ఎర్రగడ్డ పిచ్చాస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించకుంటే చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో భీమవరం అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓడిన పవన్.. ఐదేళ్లపాటు పత్తాలేకుండా పోయారని, తాను పక్కా లోకల్‌నని ఎవరో తరిమితే పారిపోయే వాడిని కాదన్నారు. భీమవరం ఎమ్మెల్యేగా గతంలోను, ఇప్పుడు తాను చేసిన అభివృద్ధి, ప్రజల పక్షాన నిలబడి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడంతో ప్రజలంతా సీఎం జగన్‌తో పాటు తననూ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో శ్రీనివాస్ రౌడీ అంటూ అవాకులు, చవాకులు పేలితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్ మాటలకు నిలకడ లేదని, పూనకం వచ్చినట్టు ప్రసంగాలు చేయడం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. పవన్‌కు ఏ మాత్రం పౌరుషం లేదని, జనసేన పార్టీని చంద్రబాబుకు తాకట్టు పెట్టేశారని ఎద్దేవా చేశారు. పార్టీ నేతలు, అభిమానుల ఆకాంక్షలను గౌరవించకుండా 21 అసెంబ్లీ సీట్లకు దిగజారిపోయి చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతున్నారని దుయ్యబట్టారు. తాను రౌడీ అయితే తనపై ఒక్క క్రిమినల్ కేసైనా నమోదయ్యిందా.. అంటూ నిలదీశారు. తాను ఎవరిపైనా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టలేదని, పవన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని.. దమ్ముంటే తాను కేసులు పెట్టించినట్టు నిరూపించాలని శ్రీనివాస్ సవాల్ విసిరారు. పవన్‌కు సొంత అభిప్రాయాలుండవని, ఎవరో రాసిచ్చింది చదువుతుంటారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఊసరవెల్లిలా పార్టీలు మార్చే వ్యక్తని, అలాంటి వారిని పవన్ పక్కన పెట్టుకున్నారని విమర్శించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేకనే అన్ని పార్టీలు కూటమిగా వస్తున్నాయని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

కాపులను బాబుకు అమ్మేస్తున్న పవన్

- పవన్ నీకు దమ్ముంటే కాపులపై కాదు.. ఇతర కులాలపై పోటీచెయ్యి
- కులాల మధ్య చిచ్చు పెట్టేవార్తలు రాస్తున్న 'ఈనాడు'పై చట్టపరమైన చర్యలు
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి, అమరావతి : చంద్రబాబు హయాంలో కాపుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. బుధవారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జీవోల్లో కేటాయింపులు తప్ప కాపుల అభ్యున్నతికి వాస్తవంగా ఖర్చు చేసింది శూన్యమన్నారు. అప్పటి ప్రభుత్వాన్ని నమ్ముకుని విదేశీ విద్యకు వెళ్లిన ఎందరో పేదింటి కాపు విద్యార్థులు నిధులు విడుదల చేయకపోవడంతో అప్పులపాలయ్యారని గుర్తు చేశారు. కాపు భవనాల నిర్మాణాలంటూ ఎల్లో మీడియాలో ఊదరగొట్టడం తప్ప ఒక్కపైసా కూడా ఇవ్వలేదన్నారు. సీఎం జగన్ వచ్చాక కాపుల సంక్షేమానికి ఏకంగా రూ.39,317.80 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అయినా, ఈనాడు పత్రిక మాత్రం కాపులను తప్పుదారి పట్టించేలా అసత్య కథనాలు ప్రచురిస్తోందని దుయ్యబట్టారు. చంద్రబాబుకు తొత్తుగా మారిన పవన్ ఏకంగా కాపులను అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కాపు ఎమ్మెల్యేలు బలంగా ఉన్నచోట మాత్రమే పవన్‌ను ఉపయోగిస్తున్నారని చెప్పారు. దమ్ముంటే పవన్.. కాపులపై కాకుండా ఇతర కులాలపై పోటీ చేయాలని సవాల్ చేశారు. కాపులను రాజ్యాధికారం దిశగా తీసుకెళ్తారని నమ్మిన కాపునాయకులు, జేఏసీల ఆశలను పవన్ నట్టేట ముంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులంటే పవన్ ఒక్కడేనా? ఇతర కాపులు రాజకీయ పదవులు చేయకూడదా? అంటూ నిలదీశారు. భీమవరంలో జనసేన పార్టీ కార్యాలయానికి స్థలం ఇవ్వట్లేదని అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. 30 మంది కాపు, బలిజలను ఎమ్మెల్యేలను చేయడంతో పాటు మంత్రులను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. చంద్రబాబు మోసానికి, అరాచకత్వానికి నిర్వచనమని విశాఖలో భూకబ్జాలు, విజయవాడలో దేవస్థానం భూములను ఒక సామాజిక వర్గానికి దోచిపెట్టారని దుయ్యబట్టారు. రంగా నుంచి ముద్రగడ పద్మనాభం వరకు, తాజాగా జనసేన కార్యకర్తలు సైతం చంద్రబాబు కుట్రలకు బలైపోయారని.. అందుకే కాపులంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. కాపులకు కొమ్ముకాస్తున్న సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తూ, కులాల్లో చిచ్చుపెట్టేలా వార్తలు ప్రచురిస్తున్న ఈనాడుపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏపీకి వెన్నుపోటు పొడిచిన మోదీతో ఎందుకు కలిశారు?

- టీడీపీ, జనసేన నేతలు సమాధానం చెప్పాలి
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ ఏం చేసిందని ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నారో జనసేన, టీడీపీ నేతలు చెప్పాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న మోదీ పదేళ్లలో కనీసం ఒక్కసారి కూడా ఆ ఆలోచన చేయలేదన్నారు. ఆంధ్రరాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన మోదీకి టీడీపీ, జనసేన ఎందుకు మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఏపీ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వస్తే తన అనుభవంతో ఎంతో చేస్తానని చెప్పిన చంద్రబాబు అనుభవం కనీసం రాజధాని కట్టుకోవడానికి కూడా పనికిరాలేదని ఎద్దేవా చేశారు. 2014లో ప్రత్యేక హోదా కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకుంటున్నామని చెప్పి.. ఆ తర్వాత అసలు ప్రత్యేకహోదాతో ఏం సాధిస్తామనే స్థాయికి దిగజారిపోయారని గుర్తుచేశారు. 2019లో ఏ బీజేపీని తిట్టి బయటికొచ్చారో.. ఇప్పుడు మళ్లీ అదే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తుందని చెప్పారు. ప్రత్యేకహోదా ఎందుకు సాధించలేదో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

బాబు రాజకీయ వికలాంగుడు

- ఊత కర్రలుగా బీజేపీ, జనసేన
- అమలుకు సాధ్యం కానివి.. సూపర్ సిక్స్ హామీలు
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వాకాడు (తిరుపతి జిల్లా) : అబద్ధాల చంద్రబాబు చేతిలో ఎన్నోసార్లు మోసపోయిన ప్రజలు.. అమలుకు సాధ్యం కాని సూపర్ సిక్స్ హామీలిస్తున్న ఆయనను నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం వాకాడులో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి ప్రసంగించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేసి మళ్లీ ధైర్యంగా ఎన్నికలకు వస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ వికలాంగుడని, ఊతకర్రలుగా బీజేపీ, జనసేన పార్టీలను పట్టుకుని ఎన్నికలకు సిద్ధమవుతున్నాడని తెలిపారు. రాజకీయాల్లో నిబద్ధత లేకుండా సొంత మామకే వెన్నుపోటు పొడిచిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో రైతు రుణమాఫీ, బంగారు రుణాల తొలగింపు, ఇంటికో ఉద్యోగం, ఇస్తామని నిరుద్యోగులను, రైతులను, మహిళలను మోసం చేశారన్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కలసి కట్టుగా పనిచేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుందామన్నారు. ఎంపీ గురుమూర్తి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ మురళీధర్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కాపులను దగా చేసింది చంద్రబాబే


- రంగాను చంపించింది, ముద్రగడ కుటుంబాన్ని రోడ్డుకు ఈడ్చింది బాబే కదా?
- పవన్ పేరు చెబితే జనం ఛీ కొడుతున్నారు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు కాపులకు ఒరగబెట్టింది ఏమీ లేదని, వారిని అన్ని విధాలుగా అణగదొక్కి.. కేవలం ఓటు బ్యాంకుగానే చూశాడని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజమెత్తారు. పవన్‌కళ్యాణ్ పేరు చెబితే ఛీ అనే పరిస్థితి వచ్చిందన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులకు జగన్ దగా చేశారంటూ చంద్రబాబు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాడని ప్రజలు నమ్మరని అన్నారు. ఆనాడు వంగవీటి రంగాను రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్ర పన్ని హత్య చేయించాడని మంత్రి కొట్టు ఆరోపించారు. ఈ విషయం జోగయ్య రాసిన పుస్తకంలోనే ఉందన్నారు. అలాగే కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని రోడ్డుకీడ్చి చిత్రహింసలకు గురిచేసింది బాబు కాదా అని ప్రశ్నించారు. ఉవ్వెత్తున ఎగసిపడిన కాపు ఉద్యమంలో అక్రమంగా కాపు యువకులపై కేసులు బనాయించి చంద్రబాబు హింసించిన విధానాన్ని కాపుజాతి మర్చిపోదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు కాపులపై బనాయించిన తప్పుడు కేసులను తీయించి వేసిందన్నారు. నాడు ప్రజారాజ్యం పార్టీని నేడు జనసేన పార్టీని అంతమొందించడానికి చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. ప్యాకేజీ పేరుతో పవన్‌కళ్యాణ్‌ను లోబరుచుకుని రాజకీయంగా ఎదగనివ్వకుండా అణగదొక్కేశాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంతమంది కలిసి కుట్రలు చేసినా గెలిచేది జగనే అని మంత్రి కొట్టు ధీమా వ్యక్తం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపులకు అన్ని విధాలుగా అండగా నిలిచారన్నారు.

బాబు నోట బ్యాంకు రుణాల మాట ఎందుకొచ్చింది?


వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్



సాక్షి, అమరావతి: యువత చదువుకోవడానికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తాననే మాట చంద్రబాబు నోట ఎందుకు వచ్చిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. బాబు బ్యాంకు రుణాలు అంటున్నారంటే అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాలన్నీ రద్దు చేస్తారా అని నిలదీశారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఈ పథకాలు తీసేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పిల్లలు ఎలా చదువుకోవాలని, పిల్లల చదువులతో ప్రభుత్వానికి పనిలేదా? అని మండిపడ్డారు. 2014లో పొత్తులతో గెలిచిన చంద్రబాబు.. రాష్ట్రానికి ఏం చేశారని నిలదీశారు. బాబు వస్తేనే జాబు వస్తుందని అప్పట్లో ప్రచారం చేసి, చివరికి ఆయన కొడుకు లోకేశ్‌కు మాత్రమే పదవులు ఇచ్చుకున్నారని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. రైతు రుణాలు మాఫీ చేస్తానని అన్నదాతలను, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని అక్కచెల్లెమ్మలను బాబు మోసం చేశారన్నారు. బాబు చేతిలో మోసానికి గురవ్వని వర్గం లేదని చెప్పారు. ప్రత్యేక హోదా ఇస్తేనే ప్రమాణ స్వీకారం చేస్తానని బాబు ఎందుకు అనలేదని నిలదీశారు. పాచిపోయిన లడ్డూలు అన్న పవన్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని చంద్రబాబు, బీజేపీతో కలిశారో చెప్పాలన్నారు. సీఎం వైఎస్ జగన్ తెచ్చిన మెడికల్ కాలేజీలు, హైవేలు, రోడ్లు కనపడటం లేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెట్టుకొన్నారని తెలిపారు. ప్రస్తుతమున్న వైఎస్సార్‌సీపీ స్థానాలు 151 నుంచి 175కి 175 సీట్లను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారనే వాతావరణం రాష్ట్రంలో స్పష్టంగా కన్పిస్తోందని భరత్ చెప్పారు.

బరిలో ఉంటా.. తగ్గేదే లే!

ఉండి టీడీపీ అసమ్మతి నేత శివరామరాజు



సాక్షి, భీమవరం: రానున్న ఎన్నికల్లో తాను పోటీలో ఉంటానని పశ్చిమగోదావరి జిల్లా ఉండి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అసమ్మతి నేత వేటుకూరి శివరామరాజు స్పష్టం చేశారు. ఏ పార్టీ నుంచి పోటీచేసేది రెండు రోజుల్లో వెల్లడిస్తానని తెలిపారు. పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న తన పట్ల చంద్రబాబు తీరు కలచివేసిందన్నారు. టీడీపీ అధిష్టానం తీరుతో కలతచెందిన శివరామరాజు మంగళవారం భీమవరంలోని తన కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన ఫ్లెక్సీలను తొలగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన తాను నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశానని.. అధిష్టానం ఆదేశాల మేరకు గత ఎన్నికల్లో నరసాపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి పరాజయం చెందానన్నారు. ఉండి నుంచి అధిష్టానం టికెట్ ఇవ్వకపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. టీడీపీ కోసం ఎంతో కష్టపడి పనిచేశానని, అభ్యర్థి ఎంపిక విషయంలో తనతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. పదిహేను రోజులుగా పార్టీ నాయకత్వం కనీసం పట్టించుకుకోలేదన్నారు. అనుచరుల కోరిక మేరకు వచ్చే ఎన్నికల్లో పోటీలో నిలవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు.

చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

కడప టీడీపీ మహిళా నేతల అల్టిమేటం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న టీడీపీ మహిళా కార్యకర్తలు

కడప రూరల్: కడప నగర టీడీపీలో అసమ్మతి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. పార్టీ కడప ఇన్‌చార్జి మాధవిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి (వాసు) అనుసరిస్తున్న విధానాలపై కడప నగర మాజీ మహిళా అధ్యక్షురాలు మీనాక్షి, సీనియర్ కార్యకర్త రామలక్ష్మమ్మ, స్వర్ణలత, టి.నిర్మల ఆధ్వర్యంలో బుధవారం కడపలోని ఎన్టీఆర్ కూడలి వద్ద కళ్లకు గంతలు కట్టుకొని ఒంటి కాలిపై నిరసన తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్థానికేతరురాలు మాధవిరెడ్డిని కడప ఇన్‌చార్జిగా నియమించడమే పెద్ద తప్పిదమని, స్థానికంగా పార్టీకి సేవలు చేసిన వారిని కాదని వ్యాపారవేత్తను ఇన్‌చార్జిగా నియమించడం దారుణమన్నారు. ఆమెతో పాటు ఆమె భర్త శ్రీనివాసులురెడ్డి పార్టీ కార్యకర్తలను ఏ మాత్రం పట్టించుకోవటం లేదన్నారు. వారంలోపు నిర్ణయం తీసుకోకపోతే.. చంద్రబాబు ఇంటి వద్దే నిరసన తెలుపుతామని హెచ్చరించారు. 'తారక రామా..పార్టీలోని పెద్దలు, నేతలతో మాకు ఇదేం ఖర్మ' అంటూ వాపోయారు. శ్రీనివాసులురెడ్డి, మాధవిరెడ్డి డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు.

మళ్లీ ఆ ఇద్దరే!

అమెరికా అధ్యక్ష తుది రేసులో నిలిచిన బైడెన్, ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష రేసులో చివరకు మళ్లీ బైడెన్, ట్రంప్‌లే నిలిచారు. అధ్యక్ష పీఠం కోసం తమ తమ పార్టీల తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వాలను బైడెన్, ట్రంప్ గెల్చుకున్నారు. మెజారిటీ డెలిగేట్ల ఓట్లను సాధించడం ద్వారా రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ తరఫున 81 ఏళ్ల జో బైడెన్‌లు తమ అభ్యర్థిత్వాన్ని ఖరారుచేసుకున్నారు. తాజాగా జార్జియాలో జరిగిన డెమొక్రటిక్ ప్రైమరీలో గెలిచి ఇప్పటిదాకా బైడెన్ 2,099 డెలిగేట్ల ఓట్లను సాధించారు. మొత్తం 3,933 ఓట్లలో 1,968 ఓట్లు వచ్చినా అభ్యర్థిత్వం ఖరారు అవుతుంది. ఇప్పటికే బైడెన్ ఆ సంఖ్యను దాటేయడం విశేషం. డెమొక్రటిక్ పార్టీ తరఫున బైడెన్ అభ్యర్థిత్వాన్ని ఆగస్ట్‌లో చికాగోలో జరిగే పార్టీ జాతీయ సదస్సులో అధికారికంగా ప్రకటిస్తారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం సాధించాలంటే కనీసం 1,215 ఓట్లు గెలవాలి. ట్రంప్ ఇప్పటిదాకా మొత్తంగా 1,228 ఓట్లను గెల్చుకున్నారు. జూలైలో మిల్‌వాకీలో జరిగే రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. మంగళవారం నాటి ప్రైమరీలో గెలవడం ద్వారా ట్రంప్ రిపబ్లికన్ పార్టీ తరఫున వరసగా మూడోసారి అధ్యక్ష ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. 2020 నాటి ప్రత్యర్థులే మళ్లీ అధ్యక్ష సమరంలో గెలుపు కోసం పోరాడుతున్నా ఈసారి ఎన్నికల్లో ప్రధాన అంశాలు, ప్రచార అస్త్రాలు మారాయి. ఆనాడు ట్రంప్‌పై ఎలాంటి కేసులు లేవు. కానీ ఇప్పుడు ట్రంప్ మెడకు 91 కేసులు చుట్టుకున్నాయి.

ఎవరికి ఓటేస్తారు?: బైడెన్

మంగళవారం నాటి ప్రైమరీ గెలుపు తర్వాత బైడెన్ మాట్లాడారు. ''ప్రజాస్వామ్యాన్ని గెలిపిస్తారా? లేదంటే కూలదోస్తారా?. స్వేచ్ఛ, ఎన్నుకునే హక్కులను పునరుద్ధరించుకుందామా? లేదంటే వాటిని అతివాదులకు అప్పగిద్దామా?'' అని పరోక్షంగా ట్రంప్‌ను విమర్శిస్తూ బైడెన్ ఓటర్లకు పిలుపునిచ్చారు. చరిత్రలో చెత్త అధ్యక్షుడు బైడెన్‌ను గద్దె దించాల్సిన సమయమొచ్చింది అని ట్రంప్ సైతం ఒక వీడియో సందేశంలో రిపబ్లికన్ ఓటర్లకు పిలుపునిచ్చారు.

డెమొక్రటిక్ పార్టీలో అభ్యర్థులు గెల్చిన డెలిగేట్ల ఓట్లు	
జో బైడెన్	2,099
ఇతరులు	20
జేసన్ పామర్	3

రిపబ్లికన్ పార్టీలో అభ్యర్థులు గెల్చిన డెలిగేట్ల ఓట్లు	
ట్రంప్	1,228
నిక్కీ హేలీ	91
రాన్ డీశాంటిస్	9
వివేక్ రామస్వామి	3

కవ్విస్తే అణు యుద్ధమే!

రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక



మాస్కో: తమ దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, గుర్తింపునకు ఏదైనా ముప్పు తలెత్తితే అణ్వాయుధాలు ప్రయోగించడానికి వెనుకాడబోమని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. రష్యావైపు ప్రత్యర్థులు కన్నెత్తి చూస్తే అణు యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని పరోక్షంగా తేల్చిచెప్పారు. ఇలాంటి ప్రమాదకర యుద్ధానికి దారితీసే చర్యలకు అమెరికా దూరంగా ఉంటుందని ఆశిస్తున్నామని బుధవారం ప్రసారమైన ప్రభుత్వ అధికారిక టీవీ చానల్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యాలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు అధ్యక్ష ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో పుతిన్ పశ్చిమ దేశాలకు హెచ్చరికలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో పుతిన్ మరోసారి అధ్యక్షుడిగా నెగ్గడం ఖాయమేనని తెలుస్తోంది. ఆరేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. అణు యుద్ధమే జరిగితే తలెత్తే పరిణామాల గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు బాగా తెలుసని చెప్పారు. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడైన బైడెన్ అన్నీ అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్లు పుతిన్ వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు అణు యుద్ధం వైపు మొగ్గు చూపుతాయని తాను భావించడం లేదన్నారు.

ఉక్రెయిన్ విషయంలో లక్ష్యాలు సాధిస్తాం

తమ అణ్వాయుధ శక్తులు పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని పుతిన్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సైనిక-సాంకేతికపరంగా తాము సన్నాహాలు పూర్తిచేసుకొని, సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఒకదేశంగా రష్యా మనుగడకు ఎలాంటి ముప్పు వాటిల్లినా సహించబోమని, తమ దేశ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కచ్చితంగా కాపాడుకుంటామని, ఇందుకోసం ఏమైనా చేస్తామని, ఇందులో భాగంగా అణ్వాయుధ ప్రయోగాలకైనా సిద్ధమేనని ఉద్ఘాటించారు. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధంలో అణ్వాయుధాలు ప్రయోగించాలని అనుకుంటున్నారా? అని ప్రశ్నించగా, ఆ అవసరం లేదని బదులిచ్చారు. ఉక్రెయిన్ విషయంలో తమ లక్ష్యాలు తప్పనిసరిగా సాధిస్తామని పుతిన్ ధీమా వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌తో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని సూచించారు. రష్యా భద్రతకు పశ్చిమ దేశాల నుంచి గ్యారంటీలు కోరుతున్నామని చెప్పారు. అయితే, చర్చలు జరిగే సమయాన్ని తమ ప్రత్యర్థి దేశం ఆయుధాలు సమకూర్చుకోవడానికి వాడుకోవద్దని అన్నారు. తమ దేశంలో ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగానే ఉక్రెయిన్ సైన్యం ఇటీవలి కాలంలో డ్రోన్లతో దాడులకు దిగిందని భావిస్తున్నామని తెలిపారు. 2022 ఫిబ్రవరిలో రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై దండయాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి అణ్వాయుధ ప్రయోగంపై పుతిన్ తరచుగా ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. గత నెలలో రష్యా ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలోనూ ఈ ప్రస్తావన తీసుకొచ్చారు. ఉక్రెయిన్‌కు సహకరిస్తే అణుబాంబులు ప్రయోగిస్తామని పశ్చిమ దేశాలను హెచ్చరించారు.

బెంగళూరు పేలుడు కేసులో ఒకరి విచారణ

సాక్షి, బళ్లారి: కర్ణాటక రాజధాని బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ రామేశ్వరం కేఫ్‌లో ఇటీవల జరిగిన బాంబు పేలుడు ఘటనలో బళ్లారిలో షబ్బీర్ అహ్మద్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కేఫ్‌లో బాంబు పెట్టి వెళ్లిపోయిన నిందితుడి కోసం గాలిస్తూ బుధవారం షబ్బీర్ ఆచూకీని కనుగొన్నారు. బళ్లారిలో మోతీ సర్కిల్ సమీపంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్లే దారిలో షబ్బీర్‌ను అతడి ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడ కొంతసేపు విచారించి బెంగళూరుకు తరలించారు. బాంబు పెట్టిన వ్యక్తికి, షబ్బీర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అనుమానాలున్నాయి. షబ్బీర్ బళ్లారి సమీపంలో తోరణగల్లు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. బాంబు పేలుడు తర్వాత ప్రధాన నిందితుడు బెంగళూరు నుంచి బళ్లారికి బస్సులు మారుతూ వచ్చాడు. ఆపై షబ్బీర్ ఇంటికి వచ్చి అతడిని కలిసినట్లు ఎన్ఐఏ అధికారులు సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్లు తెలిసింది. కాగా, షబ్బీర్‌ను విచారించి రాత్రి వదిలిపెట్టినట్లు సమాచారం.

సెమీ కండక్టర్ల రంగంలో గ్లోబల్ పవర్‌గా ఇండియా

- ప్రధాని మోదీ వెల్లడి
- 3 చిప్ ప్లాంట్లకు శంకుస్థాపన



గాంధీనగర్: సెమీ కండక్టర్ల రంగంలో మన దేశం కీలక పాత్ర పోషించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదిగే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఇండియాలో రూ.1.25 లక్షల కోట్లతో స్థాపించనున్న మూడు సెమీ కండక్టర్ల తయారీ ప్లాంట్లకు ప్రధాని మోదీ బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఇందులో రెండు గుజరాత్‌లో, ఒకటి అస్సాంలో రాబోతున్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు దేశీయంగా సెమీ కండక్టర్ల తయారీని పట్టించుకోలేదని పరోక్షంగా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అభివృద్ధి పట్ల అంకిత భావం లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పారు. దేశ శక్తి సామర్థ్యాలను, ప్రాధాన్యతలను, భవిష్యత్తు అవసరాలను గుర్తించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆక్షేపించారు. మన దేశాన్ని సెమీ కండక్టర్ల తయారీ హబ్‌గా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు. దేశీయంగా చిప్‌ల తయారీతో యువతకు ఎన్నెన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఈ రంగం దోహదపడుతుందని వివరించారు. సెమీ కండక్టర్ మిషన్‌ను రెండేళ్ల క్రితం ప్రకటించామని, తర్వాత కొన్ని నెలల వ్యవధిలోనే అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఈరోజు మూడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశామని వ్యాఖ్యానించారు. అనుకున్నది సాధించే శక్తి భారత్‌కు, ప్రజాస్వామ్యానికి ఉందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

పీఎం-సూరజ్ నేషనల్ పోర్టల్ ప్రారంభం

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీలు, బీసీలే అత్యధికంగా లబ్ధి పొందుతున్నారని ప్రధాని మోదీ చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆయా వర్గాలను విస్మరించాయని ఆరోపించారు. దేశాభివృద్ధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీల పాత్రను కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ గుర్తించలేదని విమర్శించారు. దళిత, గిరిజన వర్గాలకు చెందిన రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపదీ ముర్మును తాము రాష్ట్రపతులను చేశామని అన్నారు. అణగారిన వర్గాలను అత్యున్నత పదవుల్లో నియమిస్తున్నామని, ఇది ఇకపైనా కొనసాగుతుందని వివరించారు. ప్రధానమంత్రి సామాజిక్ ఉత్థాన్, రోజ్‌గార్ ఆధారిత్ జన్‌కల్యాణ్(పీఎం-సూరజ్) నేషనల్ పోర్టల్‌ను మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా ఎస్టీలు, ఎస్సీలు, వెనుకబడిన తరగతులతోపాటు పారిశుధ్య కార్మికులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

సీఈసీ, ఈసీల నియామక చట్టంపై 15న సుప్రీం అత్యవసర విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్య ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీలు) నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 15వ తేదీన విచారణ చేపడతామని సుప్రీంకోర్టు బుధవారం వెల్లడించింది. సీఈసీ, ఈసీ నియామకం కోసం ఉద్దేశించి ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కేంద్రం తప్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఏడీఆర్ విజ్ఞప్తి చేసింది. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్-2023'లోని సెక్షన్ 7 అమలుపై స్టే విధించాలని కోరింది. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పందించింది. శుక్రవారం విచారణ చేపట్టేందుకు అంగీకరించింది.

ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు

న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూరిన నిధుల వివరాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15 దాకా.. ఐదేళ్లలో 22,217 ఎలక్టోరల్ బాండ్లు జారీ చేశామని, వీటిని వ్యక్తులు/సంస్థలు కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు విరాళం రూపంలో అందజేశారని వెల్లడించింది. ఇందులో 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయని వివరించింది. నిబంధనల ప్రకారం.. జారీ చేసిన తేదీ నుంచి 15 రోజుల్లోగా నగదుగా మార్చుకోకపోవడం వల్ల మిగిలిపోయిన 187 బాండ్లకు సంబంధించిన డబ్బును ప్రధానమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖరా బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఇప్పటికే ఎన్నికల సంఘానికి అందజేశామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రతి బాండ్‌ను కొనుగోలు చేసిన తేదీ, కొనుగోలుదార్ల పేర్లు, బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న తేదీ వంటి అన్ని వివరాలను ఎన్నికల సంఘానికి డిజిటల్ రూపంలో అందజేశామని తెలిపారు.

సీఏఏ దరఖాస్తుదారుల కోసం హెల్ప్‌లైన్

సాక్షి, న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ) చట్టం(సీఏఏ)-2019 కింద భారత పౌరసత్వం పొందాలనుకునే శరణార్థులకు సాయపడేందుకు త్వరలో హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తేనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆన్‌లైన్ వేదికగా దరఖాస్తు ప్రక్రియ జరుగుతుందని హోం శాఖ బుధవారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టింది. దరఖాస్తుల సమర్పణకు ఇప్పటికే ఓ పోర్టల్‌ను సిద్ధం చేసినట్లు గుర్తుచేసింది. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. దేశంలోని ఏ ప్రాంతంలో నివసిస్తున్న వలసదారులైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి తమ దరఖాస్తు సంబంధ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.



పేద మహిళలకు ఏటా రూ. లక్ష

- ప్రభుత్వ ఉద్యోగాల్లో వారికి 50 శాతం రిజర్వేషన్
- 'మహిళా న్యాయ్' పేరిట ఎన్నికల హామీలను ప్రకటించిన రాహుల్ గాంధీ

ధులే: ఐదురకాల హామీలతో యువతకు 'యువ న్యాయ్' పేరిట ఎన్నికల వరాలు ప్రకటించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం పేద మహిళల కోసం ప్రత్యేకంగా 'మహిళా న్యాయ్' పేరిట హామీలను ఇచ్చారు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఏటా రూ.1 లక్ష అందజేస్తామని, వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ అమలుచేస్తామని ప్రకటించారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా తొలగిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చెప్పారు. బుధవారం మహారాష్ట్రలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ధులే జిల్లాలో జరిగిన మహిళా ర్యాలీలో ఐదు 'మహిళా న్యాయ్' గ్యారెంటీలను రాహుల్ ప్రకటించారు. ' ఏటా పేద మహిళలకు రూ.1 లక్ష వారి బ్యాంక్ ఖాతాలో జమచేస్తాం. మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకం, చైల్డ్ కేర్ సెంటర్లలో పనిచేసే మహిళా సిబ్బందికి అందే వేతనంలో కేంద్రం తరపు బడ్జెట్‌ను రెట్టింపు చేస్తాం. మహిళా సమస్యల పరిష్కారానికి, తమ హక్కుల పట్ల మహిళల్లో అవగాహన పెంపునకు నోడల్ అధికారిని నియమిస్తాం. దేశంలో ప్రతీ జిల్లాలో సావిత్రిబాయ్ పూలే హాస్టళ్లను నెలకొల్పుతాం'' అని హామీలు ఇచ్చారు. '' మోదీ సర్కార్ మహిళలను మహిళా రిజర్వేషన్ చట్టం పేరిట ఎగతాళి చేసింది. ఆర్భాటంగా చట్టం చేసింది. కానీ పదేళ్ల తర్వాత దానిని అమలుచేస్తారట. మేం అధికారంలోకి వస్తే తక్షణం చట్టాన్ని అమలుచేస్తాం' అని రాహుల్ అన్నారు.

లోక్‌సభ బరిలో ఖట్టర్, గడ్కరీ

72 మంది అభ్యర్థులతో బీజేపీ రెండో జాబితా

న్యూఢిల్లీ: హరియాణా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ సీనియర్ నేత మనోహర్‌లాల్ ఖట్టర్ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. 72 మంది అభ్యర్థులతో రెండో జాబితాను బుధవారం విడుదల చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అనురాగ్ ఠాకూర్, కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్‌తోపాటు ఖట్టర్‌కు ఇందులో స్థానం లభించింది. కేంద్ర మాజీ మంత్రులు సదానంద గౌడ, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్‌కు ఈసారి టికెట్ నిరాకరించారు. ఖట్టర్ హరియాణాలోని కర్నాల్ నుంచి, పీయూష్ గోయల్ ముంబై నార్త్ స్థానం నుంచి పోటీకి దిగబోతున్నారు. బసవరాజ్ బొమ్మై హవేరీ నుంచి, త్రివేంద్ర సింగ్ రావత్ హరిద్వార్ నుంచి పోటీ చేస్తారు. నితిన్ గడ్కరీ నాగపూర్ నుంచి అనురాగ్ ఠాకూర్ హమీర్‌పూర్ నుంచి బరిలోకి దిగుతారు. మహారాష్ట్రలోని బీడ్ స్థానంలో ప్రీతం ముండే స్థానంలో ఆమె సోదరి పంకజ ముండేకు అవకాశం కల్పించారు. బీజేపీ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు తేజస్వీ సూర్య మరోసారి బెంగళూరు సౌత్ స్థానంలో పోటీకి దిగుతారు. మైసూరు రాజవంశానికి చెందిన యదువీర్ కృష్ణదత్త వడెయార్ మైసూర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారు.



అమెరికా వర్సిటీ సీటు సాధించిన 'సుప్రీం' వంటమనిషి కుమార్తె ప్రజ్ఞ

ఘనంగా సన్మానించిన సీజే

న్యూఢిల్లీ: కలలు కనడం సులువే. వాటిని నెరవేర్చుకోవడమే కష్టం. నిరంతర శ్రమ, పట్టుదల, అంకితభావంతో కలలు సాకారం చేసుకొనేవారు కొందరే ఉంటారు. అలాంటి కొందరిలో ఒకరే ప్రజ్ఞ. సుప్రీంకోర్టులో పని చేస్తున్న వంట మనిషి కుమార్తె ప్రజ్ఞ(25) అమెరికాలోని అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ అభ్యసించే అరుదైన అవకాశం దక్కించుకున్నారు. న్యాయశాస్త్రంలో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు బుధవారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, దేశానికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు. భారత రాజ్యాంగంపై రచించిన మూడు పుస్తకాలపై వారంతా సంతకాలు చేసి, ఆమెకు బహూకరించారు. స్వయంకృషి, పట్టుదలతో ప్రజ్ఞ ఈ స్థాయికి చేరుకున్నారని, భవిష్యత్తులో ఆమెకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. పిల్లలు వారి కలలు నెరవేర్చుకొనేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు తల్లిదండ్రులపైనా ఉందని సూచించారు. సన్మాన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించిన ప్రజ్ఞ తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. వారిని కూడా న్యాయమూర్తులు సన్మానించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌లో మాస్టర్స్ చదవడానికి ప్రజ్ఞకు అవకాశం దక్కింది. స్కాలర్‌షిప్ లభించింది. ఆమె తండ్రి అజయ్ సమాల్ సుప్రీంకోర్టు వంట మనిషి. న్యాయశాస్త్రంలో ఉన్నత చదవులు చదవడానికి జస్టిస్ డీవై చంద్రచూడ్ తనకు స్ఫూర్తిగా నిలిచారని ప్రజ్ఞ చెప్పారు. ప్రజ్ఞ ప్రస్తుతం సుప్రీంకోర్టుకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్‌లో రీసెర్చర్‌గా పనిచేస్తున్నారు.

విశ్వాసపరీక్షలో నెగ్గిన సైనీ

చండీగఢ్: ఖట్టర్ రాజీనామాతో హరియాణా సీఎం కుర్చీపై కూర్చున్న నాయబ్ సింగ్ సైనీ బుధవారం అసెంబ్లీ చేపట్టిన విశ్వాస పరీక్షలో గెలిచారు. మంగళవారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే ఆయనే స్వయంగా విశ్వాస పరీక్షకు గవర్నర్‌ను అభ్యర్థించి శాసనసభ ప్రత్యేక సమావేశం జరిగేలా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కుదరక సంకీర్ణ ప్రభుత్వం నుంచి జననాయక్ జనతా పార్టీ(జేజేపీ) వైదొలగడం, సీఎంగా ఖట్టర్ రాజీనామా చేయడం, నూతన సీఎంగా సైనీ ప్రమాణం చేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో విశ్వాసపరీక్షలో పాల్గొనకుండా 10 మంది తమ పార్టీ ఎమ్మెల్యేలకు జేజేపీ విప్ జారీచేసింది. అయినాసరే ఐదుగురు జేజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. కానీ తీరా బలపరీక్షపై ఓటింగ్ జరిగే సమయానికి బయటకు వెళ్లిపోయారు. విశ్వాసపరీక్ష తీర్మానాన్ని ముఖ్యమంత్రి సభలో ప్రవేశపెట్టారు. రెండుగంటల చర్చ తర్వాత తీర్మానంపై ఓటింగ్‌ను స్పీకర్ అనుమతించారు. మూజువాణి ఓటుతో తీర్మానం నెగ్గింది. 90 మంది సభ్యులున్న హరియాణా అసెంబ్లీలో బీజేపీకి 41 మంది సొంత ఎమ్మెల్యేల బలముంది. మరో ఏడుగురు మద్దతు పలికారు. బుధవారం 12 మంది సభకు రాకపోవడంతో సభలో సభ్యుల సంఖ్య 78కి, మెజారిటీ మార్కు 40కి దిగివచ్చాయి. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కార్ బలపరీక్షలో నెగ్గడం లాంఛనమైంది.

బీజేపీతో చిరాగ్ పాశ్వాన్ వర్గం పొత్తు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్‌డీఏ కూటమితో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి(రామ్ విలాస్) పార్టీ పొత్తు ఖరారైంది. లోక్‌సభ సమరంలో సీట్ల సర్దుబాటు ఒప్పందంలో భాగంగా బిహార్‌లో చిరాగ్ వర్గం ఐదు స్థానాల్లో పోటీపడే అవకాశముంది. తన తండ్రి ఎనిమిదిసార్లు ఎంపీగా గెలిచిన హాజీపూర్ సీటు తమకే కావాలని పట్టుబట్టి చిరాగ్ సాధించారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. హాజీపూర్, వైశాలి, జుమాయ్, సమస్తీపూర్, ఖగారియా స్థానాల్లో చిరాగ్ వర్గం బరిలో దిగనుంది. బుధవారం ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చిరాగ్ భేటీ తర్వాత ఈ సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. 2020లో రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత పార్టీని చీల్చిన ఆయన తమ్ముడు పశుపతి కుమార్ పరాస్‌కు బిహార్ గవర్నర్ పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని సమాచారం. రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ చీఫ్ అయిన పశుపతితో బీజేపీ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దాని ప్రకారం పశుపతి వర్గం ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోదు. బదులుగా తమ వర్గం నేత ప్రిన్స్‌రాజ్‌కు బిహార్ మంత్రి పదవి ఇచ్చేందుకు బీజేపీ ఒప్పుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బిహార్‌లో 17 చోట్ల బీజేపీ, 16 చోట్ల జేడీ(యూ) పోటీకి దిగొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరో రెండు స్థానాలను ఎన్‌డీఏ కూటమిలోని రెండు చిన్న పార్టీలకు చెరొకటి చొప్పున ఇవ్వాలని భావిస్తున్నారు.

ఆయుర్దాయానికి కోవిడ్ కోత

- మహమ్మారి కారణంగా దాదాపు రెండేళ్ల ఆయుఃక్షీణత
- దక్షిణాసియా దేశాలపై కోవిడ్ పెను ప్రభావం
- తగ్గిన ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు
- లాన్సెట్ తాజా నివేదికలో వెల్లడి

కరోనా కోరల్లో చిక్కి యావత్ ప్రపంచం విలవిల్లాడిన ఘటన ఇప్పటికీ చాలా మందికి పీడకలే. అధునాతన కోవిడ్‌వ్యాక్సిన్లతో ఎలాగోలా కోవిడ్‌పై యుద్ధంలో గెలిచామని సంతోషపడేలోపే కరోనా మహమ్మారి మనుషుల ఆయుర్దాయాన్ని తగ్గించేసిందన్న చేదు నిజం తాజాగా బయటపడింది. 2019-2021 కాలంలో ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఆయుష్షు దాదాపు రెండు సంవత్సరాలు తగ్గిపోయిందని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక తాజా అధ్యయనం వెల్లడించింది. కోవిడ్ కష్టాల నుంచి తెరిపినపడి ఎలాగోలా మళ్లీ సాధారణ జీవితం గడుపుతున్నాం కదా అని సంబరపడుతున్న ప్రజానీకానికి ఇది పిడుగుపాటులాంటి వార్తే. లాన్సెట్ అధ్యయనంలోని ముఖ్యాంశాలు



- 2019 డిసెంబర్‌లో తొలిసారిగా కోవిడ్ వ్యాధికారక కరోనా వైరస్ విస్తృతి బయటపడ్డాక తొలి రెండేళ్లు అంటే 2020, 2021 సంవత్సరాల్లో జనాభా ఆయుర్దాయం ఎలా ఉంది అనే అంశాలపై తాజా అధ్యయనం సమగ్ర వివరాలను వెల్లడించింది. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా చూస్తే 84 శాతం దేశాల్లో ఆయుర్దాయం తగ్గింది. ఈ కాలంలో ప్రజల ఆయుర్దాయం 1.6 సంవత్సరాలు తగ్గిపోయింది.
- మెక్సికో సిటీ, పెరూ, బొలీవియా వంటి చోట్ల ఆయుఃక్షీణత మరింత ఎక్కువగా నమోదైంది. కరోనా తొలినాళ్లలో టీనేజర్లు మినహాయించి మిగతా అన్ని వయసుల వాళ్లు ఎక్కువగా మృత్యువాత పడ్డారని వార్తలొచ్చాయి. అందులో నిజం లేదని ఈ అధ్యయనం కుండబద్దలు కొట్టింది.
- ప్రపంచవ్యాప్తంగా టీనేజీ, యుక్త వయసు వాళ్లలో కోవిడ్ మరణాల రేటు ఎక్కువగానే ఉందని పేర్కొంది.
- ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు తగ్గడం విశేషం. 2019తో పోలిస్తే 2021లో ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు 7 శాతం తగ్గాయి. అంటే మరణాలు 5,00,000 తగ్గాయని అధ్యయనం వెల్లడించింది.
- దక్షిణాసియా, ఆఫ్రికా చిన్నారుల పేరిట కోవిడ్ శాపమనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి నలుగురు చిన్నారుల్లో ఒకరు దక్షిణాసియాలోనే చనియారు. ప్రతి నలుగురిలో ఒకరు సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాణాలు వదిలారు.
- అధ్యయనంలో భాగంగా మొత్తం జనాభాలో 15 ఏళ్లపైబడిన వారు ఎంత మంది? వారిపై కోవిడ్ ప్రభావం, ఆయుర్దాయం వంటి అంశాలను విశ్లేషించారు. వీరిలో 2019-2021 కాలంలో పురుషుల్లో 22 శాతం, మహిళల్లో 17 శాతం మరణాల రేటు పెరగడం ఆందోళనకరం
- 2020, 2021 సంవత్సరాల్లో మొత్తంగా 13.1 కోట్ల మంది మరణించారు. అందులో కోవిడ్ సంబంధ మరణాలు ఏకంగా 1.6 కోట్ల పైమాటే.
- గతంలో ఎన్నడూ లేని విధంగా జోర్డాన్, నికరాగ్వా వంటి దేశాల్లో కోవిడ్ మరణాలు భారీగా నమోదయ్యాయి.
- దక్షిణాఫ్రికాలోని క్వాజూలూ-నాటల్, లింపోపో వంటి చోట్ల ఆయుర్దాయం దారుణంగా తగ్గిపోయింది
- కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న/కోవిడ్ బారిన పడి కూడా బార్బడోస్, న్యూజిలాండ్, ఆంటిగ్వా, బార్బుడా వంటి దేశాల్లో తక్కువ మరణాలు నమోదవడం విశేషం.
- కోవిడ్ వల్ల ఆయుర్దాయం కొంత తగ్గినప్పటికీ దశాబ్దాలుగా అందుబాటులోకి వస్తున్న నూతన వైద్య విధానాల కారణంగా 1950 నుంచి చూస్తే ఆయుర్దాయం మెరుగ్గానే ఉండటం కాస్త ఊరటనిచ్చే అంశం.

\- సాక్షి, నేషనల్ డెస్క్

జపాన్ తొలి ప్రైవేట్ రాకెట్ 'కైరోస్' విఫలం





టోక్యో: జపాన్‌లో ప్రైవేట్ రంగంలో చేపట్టిన మొట్టమొదటి రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఈ రాకెట్‌ను ప్రయోగించగా, కొన్ని క్షణాల వ్యవధిలోనే ఆకాశంలో పేలిపోయింది. ఇందుకు కారణాలు ఏమిటన్న దానిపై విచారణ ప్రారంభించారు. తొలి ప్రైవేట్ రాకెట్ 'కైరోస్' ప్రయోగం విఫలం కావడం సైంటిస్టులను నిరాశపర్చింది. బుధవారం సెంట్రల్ జపాన్‌లోని వకయామా ప్రయోగం కేంద్రం నుంచి కైరోస్ రాకెట్‌ను నింగిలోకి పంపించారు. టేకాఫ్ అయిన తర్వాత సెకండ్ల వ్యవధిలోనే పెద్ద శబ్దంతో పేలిపోయింది. దట్టమైన పొగ అలుముకుంది. నేలపై పడిన రాకెట్ శకలాలు మంటల్లో చిక్కుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా? అనేది తెలియరాలేదు. టోక్యోకు చెందిన 'స్పేస్ వన్' అనే ప్రైవేట్ సంస్థ ఈ ప్రయోగం నిర్వహించింది. ఒకవేళ ప్రయోగం సఫలమై ఉంటే రాకెట్ ద్వారా ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తొలి ప్రైవేట్ సంస్థగా స్పేస్ వన్ రికార్డుకెక్కి ఉండేది. ఈ సంస్థ 2018లో ఏర్పాటైంది. జపాన్‌లోని బడా కంపెనీలు, బ్యాంకులు ఇందులో పెట్టుబడులు పెట్టాయి.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
గురువారం 14 మార్చి 2024

టాటా మోటార్స్ రూ. 9 వేల కోట్ల పెట్టుబడి



సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో టాటా మోటార్స్ గ్రూప్ రూ. 9 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించిన ఒప్పందాలు బుధవారం సాయంత్రం సచివాలయంలో జరిగింది. సీఎం స్టాలిన్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పందాలపై టాటా మోటార్స్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంతకాలు చేశారు. ఆటో మొబైల్ తయారీ ప్లాంట్‌ను ఈ ఒప్పందాల మేరకు ఏర్పాటు చేయనున్నారు. మంత్రి టీఆర్‌బీ రాజ, విష్ణు, వి. అరుణ్ రాయ్, సెంథిల్ రాజ్, టాటా గ్రూప్ అధికారి పీబీ బాలాజీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు.. కన్యాకుమారికి ప్రధాని



సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కన్యాకుమారికి రానున్నారు. అగస్తీశ్వరంలో జరిగే బ్రహ్మాండ బీజేపీ మహానాడుకు హాజరుకానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఈ ఏడాది నాలుగు సార్లు రాష్ట్రానికి వచ్చి వెళ్లిన విషయం తెలిసిందే. ఐదో సారి సేలంలో పర్యటించాల్సి ఉండగా, స్వల్ప మార్పులు చేశారు. ఈమేరకు శుక్రవారం కన్యాకుమారికి రానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లపై బీజేపీ దృష్టి పెట్టింది. ఈ పర్యటనలో భాగంగా అగస్తీశ్వరంలో భారీ బహిరంగ సభకు నిర్ణయించారు. శరవేగంగా ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వేదిక మీద నుంచి అభ్యర్థుల తొలి జాబితాను ప్రధాని ప్రకటించి, అభ్యర్థులను ఓటర్లకు పరిచయంచేసే అవకాశాలు ఉన్నాయని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా ఈ పర్యటన ముగించుకుని కేరళకు ప్రధాని వెళ్లనున్నారు. ప్రధాని పర్యటన దృష్ట్యా, కన్యాకుమారిలో భారీ భద్రతా ఏర్పాట్లపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది.

గవర్నర్ కార్యక్రమాన్ని బహిష్కరించిన మంత్రి



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న గవర్నర్

కొరుక్కుపేట: తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ 23వ స్నాతకోత్సవం చెన్నై వెపేరిలోని కాలేజ్ ఆఫ్ వెటర్నరీ మెడిసిన్ ప్రాంగణంలో బుధవారం ఘనంగా సాగింది. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ ఆర్‌ఎన్ రవితోపాటు భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, తమిళనాడు వెటర్నరి సైన్స్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ సైన్స్)డాక్టర్ రాఘవేంద్ర పాల్గొని మొత్తం 1,166 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఇందులో వైస్ చాన్స్‌లర్ కేఎన్ సెల్వ కుమార్, వర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ చేస్తున్న చర్యలను ఖండిస్తూ గవర్నర్ రవి హాజరైన ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్ బహిష్కరించడం చర్చనీయాంశంగా మారింది.

పొన్ముడికి మళ్లీ మంత్రి పదవి

సాక్షి, చెన్నై: అనర్హత వేటు పడ్డ పొన్ముడికి సుప్రీం కోర్టు రూపంలో ఇటీవల ఎమ్మెల్యే పదవి దక్కింది. ఇదే క్రమంలో ఆయనకు మళ్లీ మంత్రి పదవి సైతం దక్కనుంది. ఇందుకు సంబంధించిన సిఫార్సు గవర్నర్ ఆర్‌ఎన్ రవికి సీఎం స్టాలిన్ బుధవారం చేశారు. అక్రమాస్తుల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడడంతో గత ఏడాది చివర్లో ఎమ్మెల్యే, మంత్రి పదవికి పొన్ముడి అనర్హుడైన విషయం తెలిసిందే. ఆయన ప్రాతినిధ్యం వహించిన తిరుక్కోవిలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్టు గెజిట్‌లో కూడా ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో జైలు శిక్షను నిలుపుదల చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పు నకలు బుధవారం అసెంబ్లీ కార్యాలయానికి చేరింది. దీంతో తిరుక్కోవిలూరు ఖాళీ అన్న ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. ఈ పరిణామాలతో పొన్ముడికి మళ్లీ ఎమ్మెల్యే పదవి దక్కింది. అదే సమయంలో ఆయనకు మళ్లీ మంత్రి పదవి అప్పగిస్తూ సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన సిఫార్సు సాయంత్రం రాజ్‌భవన్‌కు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆమోదం కోసం పంపించారు. దీనిపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్నది వేచి చూడాల్సిందే. సీఎం సిఫార్సును ఆమోదించాల్సిన అవశ్యం ఉండడంతో పొన్ముడితో మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయిస్తారా? లేదా? ఆయన చేతిలో ఇది వరకు ఉన్న ఉన్నత విద్యాశాఖ పదవిని మళ్లీ కేటాయిస్తూ ప్రకటన వెలువడేనా..? అన్నది వేచి చూడాల్సిందే.

బీజేపీ నాయకుల నిరసన



నిరసనలో బీజేపీ నేత అన్నామలై

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో యథేచ్ఛగా విక్రయిస్తున్న మత్తు పదార్థాలను కట్టడి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతృత్వంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం జరిగింది. చెన్నై వేదికగా అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ ట్రాఫికింగ్ ముఠా నాయకుడు చక్రం తిప్పుతున్నా పాలకులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఈ నిరసనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, సీనియర్ నేతలు హెచ్.రాజ, నారాయణన్ తిరుపతి, కరు నాగరాజన్, వినోజ్ పి. సెల్వం, సుమతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డీఎంకే పాలకుల ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం ఫ్యాక్టరీలకు ఆదాయం కోసం టాస్మాక్‌ను నడుపుతున్నారని ఈసందర్భంగా అన్నామలై ఆరోపించారు. ప్రస్తుతం మత్తు పదార్థాల అమ్మకాల ద్వారా ప్రభుత్వం యువకులు, విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు.



పొల్లాచ్చి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

తమిళనాడుకు ఏం చేశారు?

అబద్ధాలు, కల్లబొల్లి మాటలతో మభ్యపెడుతున్న ప్రధాని మోదీ.. ఇప్పటి వరకు తమిళనాడుకు చేసిన సాయంపై తనతో బహిరంగ చర్చకు రావాలని సీఎం స్టాలిన్ సవాల్ విసిరారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా పన్నులు వసూలు చేస్తున్న కేంద్రప్రభుత్వం.. తమిళనాడుకు రావాల్సిన నిధుల విడుదల విషయంలో మాత్రం సవతితల్లి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. అన్నాడీఎంకే – బీజేపీ మధ్య రహస్య బంధం కొనసాగుతోందని, పైకి మాత్రం విడిపోయినట్లు నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. కొంగు మండలంలోని జిల్లాల ప్రగతి డీఎంకే ద్వారానే సాధ్యమని పేర్కొంటూ, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

- చర్చకు రావాలని ప్రధానికి సీఎం స్టాలిన్ సవాల్
- అన్నాడీఎంకే – బీజేపీ మధ్య రహస్య బంధం ఉందని ఆరోపణ
- రూ. 1,273 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన



కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

సాక్షి, చెన్నై: కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో బుధవారం సీఎం స్టాలిన్ పర్యటించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి పొల్లాచ్చి వరకు అయనకు బ్రహ్మరథం పట్టే విధంగా డీఎంకే వర్గాలు ఆహ్వానం పలికాయి. ఇక పొల్లాచ్చి వేదికగా జరిగిన బహిరంగ సభలో కొంగు మండలంలోని కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, నీలగిరి జిల్లాలో రూ. 560 కోట్లతో పూర్తి చేసిన 273 పనులు, రూ.489 కోట్ల 53 లక్షలతో పూర్తి చేసిన ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. వివిధ శాఖల తరపున 57,325 మంది లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. రూ. 10.11 కోట్లతో పూర్తి చేసిన 160 గృహాలు, రూ.3.31 కోట్లతో నిర్మించిన సహకార శాఖ భవనాలు, రూ. 13 కోట్ల 34 లక్షలతో నిర్మించిన మదుకరయ్ సర్కిల్ – కురిచ్చి సబర్బన్ ప్రాజెక్టు తదితర పనులను ప్రారంభించారు. అలాగే ఆ జిల్లాల్లో రూ. 1,273 కోట్లతో చేపట్టనున్న పలు ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

ప్రధానికి సవాల్..

రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వంలో కొంగు మండలానికి చెందిన పలువురు నేతలు మంత్రులుగా కొనసాగడమే కాకుండా, ఈ జిల్లాలు తమ కంచు కోట అంటూ హడావుడి చేశారన్నారు. అయితే ఈ మంత్రుల ద్వారా ఈ జిల్లాలకు ఒరిగిందేమిటో అని ఓ మారు ప్రజలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఓటు వేసిన ప్రజలకు అన్నాడీఎంకే పాలకులు ఏమైనా చేశారా? అని ఈ వేదిక నుంచి తాను ప్రశ్నిస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో ఇక్కడ జరిగిన ఘటనలు ఈ సందర్భంగా గుర్తుచేయాల్సి ఉందంటూ, పొల్లాచ్చి లైంగిక వేధింపులు, కొడనాడు ఎస్టేట్‌లో హత్య, దోపిడీ తదితర కేసులను ప్రస్తావించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకుని సర్వనాశనం చేసి వెళ్లిన అన్నాడీఎంకే నాయకులు, ఇప్పుడు కొత్త నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ – అన్నాడీఎంకే మధ్య రహస్య బంధం కొనసాగుతోందని, పైకి విడి పోయినట్టు నాటకాలాడుతూ ప్రజలను మభ్య పెట్టే పనిలో ఉన్నారని ఆరోపించారు. అన్నాడీఎంకే హయాంలో శాంతి భద్రతలు అధ్వానంగా మారాయని, రాష్ట్రమే సర్వనాశనమైందని, తాము అధికారంలోకి వచ్చినానంతరం అన్నింటినీ చక్కదిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేనప్పటికీ, ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగి ప్రజా హితమే లక్ష్యంగా ద్రవిడ మోడల్ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడుకు వచ్చినప్పుడల్లా అబద్ధాల మూటను విప్పి వెళ్తున్నారని మండిపడ్డారు. ఈ అబద్ధపు ప్రసంగాలను పక్కన పెట్టి, తమిళనాడు కోసం కేంద్రం ఏం చేసింది? అనే విషయంపై చర్చించుకుందామా? అని ప్రధానికి సవాల్ విసిరారు. మోదీ గ్యారంటీ.. మోదీ గ్యారంటీ అంటూ ప్రకటనలు ఇచ్చుకున్నారేగానీ, ప్రజలకు ఆయన చేసింది శూన్యం అని మండిపడ్డారు. మరో వారం రోజుల్లో తమిళనాడుకు మరో మారు ప్రధాని రాబోతున్నట్లు సమాచారం వచ్చిందని, ఈ సమయంలో తమిళనాడుకు చేసిందేమిటి, ప్రత్యేక కార్యక్రమాలు ఏమిటి, ప్రాజెక్టులు ఏమిటి? అనే వివరాలతో జాబితాను ప్రకటించేందుకు సిద్ధమా?, తమిళ సంక్షేమం, ప్రజలపై చిత్త శుద్ధి ఉంటే, తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, ముత్తుస్వామి, స్వామినాథన్, రామచంద్రన్, ఎం. సుబ్రమణియన్, కయల్విలి సెల్వరాజ్, ఎంపీలు ఎ. రాజ, నటరాజన్, షణ్ముగ సుందరం పాల్గొన్నారు.

మాజీ సైనికులకు కానుక

మాజీ సైనికులు సీఎం స్టాలిన్ ప్రత్యేక కానుక ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మాజీ సైనికులకు ఆస్తి, ఇంటి పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు కల్పిస్తున్నామని ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం 1.20 లక్షల మంది మాజీ సైనికులకు లబ్ధి చేకూరుస్తుందని వివరించారు.

కొంగు మండలం అభివృద్ధే లక్ష్యం..

కొంగు మండలంలోని కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూర్, నీలగిరి జిల్లాలో ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టేందుకు తాను ఇక్కడకు రావడం ఆనందం కలిగిస్తోందన్నారు. పశ్చిమ కనుమల్లోని ఈ జిల్లాల ప్రగతే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు వివరించారు. ఈ నాలుగు జిల్లాలోని ప్రజలు తనకు మరింత ఉత్సాహాన్ని కలిగించే విధంగా ఆహ్వానం పలికారని పేర్కొంటూ, ఎన్నికల సమయంలో ఈ జిల్లాలకు ప్రత్యేకంగా ఇచ్చిన హామీలు దిగ్విజయవంతంగా అమలు చేశామన్నారు. తనకు ఓటు వేయని వారికి సైతం సంక్షేమ ఫలాలను దరి చేర్చామని, ప్రజల నమ్మకాన్ని చూరగొనే విధంగా మూడేళ్లలో ప్రజాహిత పాలన అందించానని, ఇది మరింత విస్తృతం అవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలైనా సరే, సాధారణ ఎన్నికలైనా సరే, ఏ ఎన్నికలు వచ్చినా కొంగు మండలంలో ఇక మనమే అన్న ధీమా, నమ్మకం కలిగే విధంగా ఇక్కడి ప్రజలు ఆదరణ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు.



మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ చేస్తూ..

కుష్బుకు వ్యతిరేకంగా నిరసనలు

- పలుచోట్ల దిష్టిబొమ్మల దగ్ధం



సేలంలో కుష్బు చిత్ర పటాన్ని దగ్ధం చేస్తున్న మహిళలు

సాక్షి, చెన్నై: బీజేపీ నేత, సినీ నటి కుష్బుకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు నిరసనలతో హోరెత్తించాయి. పలుచోట్ల ఆమె చిత్ర పటాలను చెప్పులతో కొడుతూ, దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తూ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం గత ఏడాది గృహిణుల కోసం కలైంజ్ఞర్ మగలిర్ ఉరుమై తిట్టం (మహిళా హక్కు పథకం) అమలోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా కోటి 15 లక్షల మంది మహిళలకు ప్రతినెలా రూ. 1000 నగదు ఈ పథకం ద్వారా అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ కార్యక్రమంలో కుష్బు మాట్లాడుతూ ఈ పథకాన్ని తీవ్రంగా విమర్శించారు. మహిళలు ప్రతినెలా భిక్షమెత్తుకుంటు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ మహిళా సంఘాలు, డీఎంకే కూటమిలోని పార్టీల మహిళా సంఘాల నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు సాగాయి. చెన్నై, మదురై, తిరునల్వేలి, కోయంబత్తూరు, సేలం, నామక్కల్ తూత్తుకుడి, తిరుచ్చి, తంజావూరు వంటి నగరాలలో నిరసనలలో మహిళలు కుష్బు ఫొటోను చెప్పులతో కొడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక చోట్ల కుష్బు దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కాగా కుష్బుకు సరైన సమాధానం ఇచ్చే విధంగా మహిళలు స్వచ్ఛందంగా రోడ్డుపైకి వచ్చి నిరసనలు తెలియజేయడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళలే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

500 గ్రాముల బంగారంతో బెంగాల్ కార్మికుడు పరార్

అన్నానగర్: చెన్నై షావుకారుపేట ఎడపాళయం ప్రాంతానికి చెందిన కుశ్వర్ స్థానికంగా నగల దుకాణం నడుపుతున్నాడు. ఇందులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుమన్ (22) గత మూడేళ్లుగా నగల వ్యాపారిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సుమన్ రెండు రోజుల క్రితం దుకాణంలోని సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకుని పారిపోయాడని కుశ్వర్ యానైకొని గిరిజన పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. క్రైం బ్రాంచ్ పోలీసులు సుమన్ స్వగ్రామానికి పారిపోయాడా? లేక చెన్నైలోనే ఎక్కడైనా దాక్కున్నాడా? అని గాలింపు ప్రారంభించారు.

3 సీట్లకు వాసన్ పట్టు

- ఓ రాజ్యసభ స్థానం కూడా..

సాక్షి, చెన్నై: బీజేపీ కూటమిలో తమకు 3 సీట్లను కేటాయించాలని తమిళ మానిల కాంగ్రెస్ నేత వాసన్ పట్టుబడుతున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. అలాగే ఓ రాజ్యసభ సీటును కోరుతున్నట్టు ఆ పార్టీ వర్గాలుపేర్కొంటున్నాయి. వివరాలు.. బీజేపీకి తన మద్దతును వాసన్ ప్రకటించిన విషయం తెలిసిందే. చెన్నైలో తిష్ట వేసి ఉన్న బీజేపీ ఎన్నికల వ్యవహారాల కమిటీ పెద్దలు కిషన్‌రెడ్డి, వీకే సింగ్, ఎల్. మురుగన్, అన్నామలైను వాసన్ బుధవారం కలిశారు. తమకు కావాల్సిన సీట్లు, నియోజకవర్గాల వివరాలను ఆ కమిటీ ముందు ఉంచారు. ఈ మూడులోక్ సభ స్థానాలతో పాటు ఓ రాజ్యసభ సీటును ఆయన కోరుతున్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. బీజేపీతో సీట్ల పంపకాల పై దృష్టి పెట్టామని, తమ పార్టీకి చెందిన కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందని ఈ సందర్భంగా వాసన్ పేర్కొన్నారు. ఇక బీజేపీ కూటమిలో చేరిన అమ్మమక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్ సైతం కిషన్‌రెడ్డి, వీకే సింగ్‌తో భేటీ అయ్యారు. తమకు కావాల్సిన లోక్‌సభ నియోజకవర్గాల వివరాలను, సీట్ల సంఖ్య గురించి చర్చించారు.

పీఎంకేతో భేటీ

కూటమి చర్చలు, సీట్ల పందేరాలు ఓ వైపు జరుగుతుంటే, హఠాత్తుగా బీజేపీ కమిటీ పీఎంకే వైపు దృష్టి పెట్టింది. అన్నాడీఎంకేలో చర్చల్లో బిజీలో ఉన్న ఈ పార్టీని తమ వైపునకు తిప్పుకునేందుకు సిద్ధమైనట్లు సంకేతాలు వెలువడ్డాయి.

నేటి నుంచి మిలాన్ సాంస్కృతిక వేడుక



లోగో ఆవిష్కరిస్తున్న ముత్తమిళ్ సెల్వన్, విద్యార్థులు

సాక్షి, చెన్నై: చెన్నై శివారులోని కాటాన్ కొళత్తూరులో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు మిలాన్ పేరిట సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయి. దేశంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 1,800 మంది విద్యార్థులు తమ సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు. ఎస్‌ఆర్‌ఎంఐఎస్‌టీ వీసీ సి. ముత్తమిళ్ సెల్వన్ విద్యార్థి సమూహంతో కలిసి మిలాన్ లోగో, పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిలాన్ నిర్వాహక కమిటీలోని విద్యార్థులు కార్యక్రమాల వివరాలను మీడియాకు వివరించారు. 16వ వార్షిక వేడుకగా ఈ సాంస్కృతిక సంబరాలకు సర్వం సిద్ధం చేశామన్నారు. 150 కార్యక్రమాలు ఈ వేడుకలో జరగనున్నాయని వివరించారు. నాలుగు రోజుల మిలాన్ 2024 సంబరాలను తొలిరోజు సినీ నటి ఆండ్రియా ప్రారంభిస్తారని తెలిపారు. తొలిరోజు ఫ్యాషన్, సంగీతం, నాటకం, నృత్యం సాహిత్య, క్రీడలు, నాటకాలు వంటి రంగాలలో ఈవెంట్‌లు జరుగుతాయని తెలిపారు. ప్రముఖ గాయకుడు ప్రదీప్‌కుమార్ సంగీత విభావరికి ఏర్పాట్లు చేశామన్నారు. సంగీతం, వినోదం, సాంస్కృతిక వేడుకలో భాగంగా రెండో రోజు రక్తదాన శిబిరం, మహిళా సాధికారత కార్యక్రమాలు, సైన్స్ కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. 16వ తేదీన విద్యార్థులకు ఆన్‌లైన్ ఆధారిత వివిధ పోటీలు జరుగుతాయని, 17వ తేదీన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సీత కోక చిలుక పేరిట ప్రత్యేక కార్యక్రమం జరుగుతుందన్నారు. ముగింపు వేడుకకు ప్రఖ్యాత ప్లే బ్యాక్ సింగర్ నీతి మోహన్ హాజరు కానున్నారని తెలిపారు. కాగా మిలాన్ పోటీల విజేతలకు రూ. 12 లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నామని ప్రకటించారు.

వైఎస్ఆర్ సేవాదళ్‌కు కొత్త టీం

తమిళనాడు వైఎస్ఆర్ సేవాదళ్‌కు కొత్త కమిటీని బుధవారం ప్రకటించారు. వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్ర వైఎస్ఆర్ సేవాదళ్ కమిటీలో వివిధ హోదాలలో నియమితులైన వారి జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ వివరాలను సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన జహీర్ హుస్సేన్ మీడియాకు తెలియజేశారు.

- తమిళనాడు విభాగం అధ్యక్షుడిగా జహీర్ హుస్సేన్
- ప్రధాన కార్యదర్శిగా సూర్యారెడ్డి
- ఏపీలో టార్గెట్ 175 కోసం శ్రమిస్తామన్న నేతలు



జహీర్ హుస్సేన్ | సూర్యారెడ్డి | వెంకట శివ ప్రసాద్ | సాయి సింహారెడ్డి | కృతిక

సాక్షి, చెన్నై: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తమిళనాడులో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న నవరత్నాల పథకాలు ఇక్కడి సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. దీంతో తెలుగు వారే కాదు, తమిళులు సైతం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అభిమానులుగా మారిపోయారు. సామాజిక మాధ్యమాలలో తమకూ ఇలాంటి సీఎం కావాలనే నినాదాలతో వ్యాఖ్యలు చేసిన అభిమానులెందరో ఉన్నారు. అలాగే తమిళనాడు – ఆంధ్రప్రదేశ్ సరిహద్దులలోని జిల్లాల్లో అయితే సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేరు తరచూ మారుమోగుతుంటుంది. అదే సమయంలో గత కొన్నేళ్లుగా తమిళనాడు వైఎస్ఆర్ సేవాదళ్ వేదికగా అభిమానులు, నాయకులు తమ సేవా కార్యక్రమాలను, వైఎస్ఆర్ సీపీ కార్యక్రమాలను విస్తృతం చేస్తూ వస్తున్నారు. జగనన్నకు తాము సైతం అండగా ఉంటామనే నినాదంతో ముందుకెళ్తున్నారు. పార్టీ ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలను సేవాదళ్ ఉపాధ్యక్షుడు జహీర్ హుస్సేన్ నేతృత్వంలో అభిమానులు జరుపుకుంటూ వస్తున్నారు. ఇది వరకు సేవాదళ్ కమిటీ జంబో జట్టుగా ఉండగా, దీనిని రద్దు చేశారు. కొత్త కమిటీని ప్రకటించారు. కాగా ఉపాధ్యక్షుడి హోదాలో సేవా కార్యక్రమాలలో ముందుకు సాగుతూ వచ్చిన జకీర్ హుస్సేన్‌కు తాజాగా పదోన్నతి కల్పించారు. ఆయనకు తమిళనాడు వైఎస్ఆర్ సేవాదళ్ అధ్యక్ష పదవి అప్పగించారు.

కొత్త జాబితా విడుదల

వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసిన ప్రకటన వివరాలను జహీర్ హుస్సేన్ మీడియాకు వివరించారు. ఇందులో సేవాదళ్ అధ్యక్షుడిగా జహీర్ హుస్సేన్ నియమితులయ్యారు. కార్యదర్శిగా వెంకట శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సూర్యారెడ్డి, అధికార ప్రతినిధులు సాయి సింహారెడ్డి, కృతిక, సంయుక్త కార్యదర్శులు రుషిరెడ్డి, వైఎస్ మోహన్‌రెడ్డి, భాను, గురవయ్యా, చంద్రశేఖర్, చిన్న సంపత్‌కుమార్, సురేష్, లోకేశ్‌రెడ్డి, షనిత్ చౌదరి, ముత్తాల వేణుగోపాల్, శ్రీవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని నియమించారు. మొత్తం 17 మందితో కొత్త కమిటీని ప్రకటించారు.

175 లక్ష్యంగా శ్రమిస్తాం..

తమిళనాడులోని తెలుగు వారిని ఏకం చేసి 175కు 175 స్థానాల కై వసం కోసం తమ వంతుగా సేవాదళ్ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని జహీర్ హుస్సేన్ తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి కేటాయించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నేతలు వైఎస్ అనిల్‌రెడ్డి, సజ్జల భార్గవ్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు. తమిళనాడులో ఎక్కడెక్కడ ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి వివిధ పనులలో కార్మికులు ఉన్నారో, ఏఏ విద్యాసంస్థల్లో ఏ మేరకు తెలుగు విద్యార్థులు ఉన్నారో.. వారందరినీ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించనున్నామన్నారు. వీరందరినీ ఎన్నికల రోజు ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి ఓట్లు వేయించేందుకు కూడా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, త్వరలో ప్రకటించనున్న మేనిఫెస్టోలోని కొత్త అంశాలను వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సేవాదల్ నేతృత్వంలో వైఎస్ఆర్‌సీపీ పార్టీ కార్యక్రమాలతో పాటు సేవలను విస్తృతం చేస్తామన్నారు. రెండోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేయడం కోసం పూర్తిస్థాయిలో పనిచేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సూర్యారెడ్డి మాట్లాడుతూ, తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తమిళనాడులోని అన్ని విద్యాసంస్థల్లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులను ఏకం చేయనున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

మారిన పిల్లల ధోరణి

కొరుక్కుపేట: తమిళనాడు ప్రభుత్వం అందించిన అల్పాహార పథకంతో పిల్లలు బడికి వెళ్లడానికి నిరాకరించే ధోరణి ప్రస్తుతం మారిందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జయరంజన్ సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు నివేదించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ముఖ్యమంత్రికి 11 హరితహారం నివేదికలు అందజేసినట్టు తెలిపారు. సాధారణంగా ప్రభుత్వానికి బాధ్యత ఉంటుందన్నారు. ఈ క్రమంలో పనులు ఎలా జరుగుతున్నాయి, ప్రభుత్వ పథకాల స్థితిగతులను పరిశీలించడంపై దృష్టి సారించామన్నారు. పిల్లలకు అల్పాహారం అందించే పథకం బడిఈడు పిల్లల్లో మార్పు తెచ్చిందని, అల్పాహార కార్యక్రమం కారణంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు సైతం పెరిగిందన్నారు. తొమ్మిది గంటలకు పాఠశాలలకు వెళ్లాల్సిన పిల్లలు ప్రస్తుతం 7.30 గంటలకే చేరుకుంటున్నారన్నారు. పిల్లలు అల్పాహారాన్ని ఇష్టపడుతున్నట్టు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆహార కార్యక్రమాన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు విస్తరించడంతో తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఆరు నెలలకొకసారి అల్పాహార కార్యక్రమంపై ఎప్పటికప్పుడు సర్వేలు చేయబోతున్నామని వెల్లడించారు.

రేషన్ డీలర్ల ధర్నా



ఆందోళన చేస్తున్న రేషన్ దుకాణదారులు

తిరువళ్లూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్లు బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కాగా తిరువళ్లూరులో జరిగిన ఆందోళనకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుముగం అధ్యక్షత వహించగా కార్యదర్శి అంగముత్తు ధర్నాను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామినాథన్ హాజరై ప్రసంగిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఉద్యోగులకు జీతాలను బ్యాంకు అకౌంట్‌లో చెల్లించాలని కోరారు. పాత పింఛన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు నిత్యావసర వస్తువులను ప్యాకెట్‌ల రూపంలో అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కావేరి నీటిని ఎలా తీసుకురావాలో తెలుసు

- స్పష్టం చేసిన సీనియర్ మంత్రి దురై మురుగన్

వేలూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి కావేరి నీటిని ఏ విధంగా తమిళనాడుకు తీసుకురావాలో తమకు తెలుసని సీనియర్ మంత్రి దురై మురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడిలో రూ. 3 కోట్ల వ్యయంతో కర్పగం కో–ఆపరేటివ్ పెట్రోల్ బంకును కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కర్ణాటక రాష్ట్రం నుంచి చుక్క నీటిని కూడా తమిళనాడుకు ఇవ్వబోమని కర్ణాటక సీఎం సీతారామయ్య చెబుతున్నారని, అయితే ఏనాడైనా తమిళనాడుకు నీరు ఇస్తామని కర్ణాటక చెప్పిందా..? అని ప్రశ్నించారు. దీంతోనే ప్రతిసారీ సుప్రీంకోర్టుకు వెళ్లి తాము నీటిని తీసుకొస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం కాట్పాడిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇటీవల కాలంలో పెట్రోల్ కూడా నాణ్యత లేకుండా ఇస్తున్నారని ఫిర్యాదులు ఉన్నాయని, దీంతోనే ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. డీఎంకే లోక్‌సభ అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీతో చర్చించి మరో రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కదీర్‌ఆనంద్, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, జోన్ చైర్మన్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న మంత్రి దురై మురుగన్

వైద్యం కోసం తమిళనాడుకు విదేశీయులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఎం. సుబ్రమణియన్

సేలం: అమెరికా, యూరప్ వంటి దేశాల నుంచి సైతం రోగులు వైద్య సేవల కోసం తమిళనాడు వైపుగా వస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. సేలంలోని లోటస్ ఐ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను బుధవారం ఆరోగ్య మంత్రి ఎం సుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటస్ ఐ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 30 ఏళ్లుగా కేరళతో పాటు రాష్ట్రంలోని కోయంబత్తూరు, తిరుప్పూర్, తదితర ప్రాంతాల్లో విస్తృత వైద్యసేవలను అందిస్తున్నట్లు గుర్తుచేశారు. తమిళనాడులో నేడు వైద్యరంగం దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో దూసుకెళ్తోందన్నారు. సీఎం బీమా పథకంతో శస్త్ర చికిత్సలు విస్తృతమయ్యాయని తెలిపారు.

ఉద్యోగ శిక్షణ ఒప్పందం



విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా చెన్నైలో ఈశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, క్వాడ్రాసెంట్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ మధ్య బుధవారం కీలక ఒప్పందాలు జరిగాయి. ఈశ్వరి చైర్మన్ ఆర్. శివకుమార్, క్వాడ్రాసెంట్ ఎండీ ఎస్‌వీఆర్ మధుకుమార్ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు.

- సాక్షి, చెన్నై

మైనారిటీ విద్యార్థులకు ఊరట

- తమిళ పరీక్ష నుంచి మినహాయింపు

కొరుక్కుపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న మైనారిటీభాషా విద్యార్థులకు ఊరట లభించింది. తమిళ సబ్జెక్టు పరీక్ష రాయకుండా విద్యా మండలి మినహాయింపును జారీ చేసింది. ఈ విషయంలో పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. తమిళ విద్యా చట్టం 2006 ప్రకారం గత రెండు సంవత్సరాలుగా ఎనిమిదో తరగతి వేరే రాష్ట్రాల్లో చదివి, వారి తల్లిదండ్రులు ఉద్యోగం కారణంగా తమిళనాడుకు వచ్చిన విద్యార్థులు రాష్ట్ర పాఠ్యాంశాల ప్రకారం 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు తమిళం రాయడం నుంచి మినహాయింపు ఉంది. ఈనేపథ్యంలో పదో తరగతి సాధారణ పరీక్ష రాస్తున్నప్పుడు తమిళభాష పరీక్ష కచ్చితంగా రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తమిళనాడు స్టేట్ సిలబస్ కింద చదువుతున్న విద్యార్థులకు ఈనెల 26 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంలో మైనారిటీ భాషలను అభ్యసించే విద్యార్థులు తమిళ సబ్జెక్టు పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. అలాగే మైనారిటీ భాషను ఐచ్ఛిక సబ్జెక్టుగా రాసి విద్యార్థులు తప్పనిసరిగా 35 మార్కులు సాధించి, ఉత్తీర్ణత సాధిస్తే ఆ మార్కులు సర్టిఫికెట్‌లో పొందుపరుస్తారు. దీనిపై మద్రాసు హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంలో 2020 నుంచి మూడేళ్ల పాటు పార్టు –1 కింద పదో తరగతి పరీక్షల్లో భాషల వారీగా మైనారిటీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తమిళభాష పేపర్ రాయకుండా వినహాయింపు ఇస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈక్రమంలో మైనారిటీ భాషల విద్యార్థులు తమిళసబ్జెక్టు రాయకుండా మినహాయింపు ఇవ్వటం ఊరటనిచ్చింది.

పెంచిన అద్దెను తగ్గించాలి



నిరసనలో పాల్గొన్న బాలసుబ్రమణియన్

కొరుక్కుపేట: అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పెంచిన అద్దెను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆలయ స్థలాల్లో నివాసులు ధర్నా చేశారు. ఈ ధర్నాలో సుమారు 700 మంది పాల్గొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలయ స్థలాల్లో అద్దెకుంటున్న వారి అద్దెలను భారీ తగ్గించి 456/298 ఉత్తర్వును జారీ చేశారని, అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ఆ ఉత్తర్వును బుట్టదాఖలు చేసి, అద్దెలను విపరీతంగా పెంచిందని ఆరోపించారు. ఇక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలుపరిచినట్లే ఇనామ్ రద్దు చట్టాన్ని సవరించి ఇనామ్ భూముల్లో నివసిస్తున్న వారికి, గ్రామనత్తం స్థలాల్లో నివశిస్తున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆలయ స్థలాల్లో నివాసుల సంఘం అధ్యక్షుడు వి.బాలసుబ్రమణియన్, కోశాధికారి ఎస్ ఏళుమలై, జిల్లా విభాగాల నాయకులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, ఎండీఎంకే ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి ఆంధ్రిదాస్, హిందూ దేవాదాయ ఆలయాల అద్దె చెల్లింపుదారుల సంఘం ప్రధాన కార్యదర్శి కే. మణి, నిర్వాహక కమిటీ సభ్యులు శశికుమార్ తదితరులు ప్రసంగించారు.

వైభవంగా అష్టోత్తర శత శంఖాభిషేకం



శ్రీఓం జ్ఞానసత్యేంద్రస్వామివారికి పూజ చేస్తున్న భక్తులు

కొరుక్కుపేట: పరమేశ్వరుడికి అష్టోత్తర శత శంఖాభిషేకం వైభవంగా నిర్వహించారు. కాంచీపురం సమీపంలో ఆవలూరు ఆశ్రమంలో శ్రీఓం పంచశక్తి పీఠాధిపతి శ్రీఓం జ్ఞాన సత్యేంద్రస్వామి వారి 56వ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలతోపాటు పరమేశ్వరుడికి అష్టోత్తర శత శంఖాభిషేకం చేశారు. అలాగే గోమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొలుత తన గురుదేవులు ఆది సత్యేంద్రస్వాములవారికి స్వర్ణపాదపూజలు వైభవంగా జరిపారు. అనంతరం స్థానిక భక్తులు సత్యేంద్రస్వాములవారికి పాదపూజలు చేశారు. ఆశ్రమంలోనే భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో జనకల్యాణ్ సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామిజీ భక్తులతో కలసి చెన్నై పెరంబూరు సమీపం ఓట్టేరిలోని పశుసంరక్షణశాలకు వెళ్లి గోమాత పూజలు నిర్వహించారు. పశుసంరక్షణ శాలలో పనిచేస్తున్న కార్మికులు,మేనేజర్ సురేష్ కు ఆశీస్సులు అందజేశారు.

పేదరిక నిర్మూలనలో అద్భుత విజయాలు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ సి రంగరాజన్

కొరుక్కుపేట: ఆదాయ పంపిణీ, పేదరిక నిర్మూలనలో మన దేశం అద్భుతమైన విజయాలను సాధించిందని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్, మద్రాసు స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ చైర్మన్ డాక్టర్ సి.రంగరాజన్ అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ నిజ్వా, సుల్తానేట్ ఆఫ్ ఓమన్, ఎస్‌ఆర్‌ఎం –వడపళని క్యాంపస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న విధానాలపై నాలుగో అంతర్జాతీయ సదస్సు(ఐసీఈఏబీఎం–24) బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్, బింగ్‌హామ్టన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ పాల్ ఆర్ చియారోట్ పాల్గొని, జ్యోతిప్రజ్వలన చేసి, సదస్సు ప్రారంభించారు. ముందుగా ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఎస్ ప్రభాదేవి స్వాగతోపన్యాసం చేయగా, ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ వి శశిరేఖ సదస్సు లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ ఆదాయ పంపిణీ, పేదరిక నిర్మూలనలో దేశం పలు విజయాలను సాధించిందని చెప్పారు. విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఆఫ్ నిజ్వా –ఓమన్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్ కాలేజ్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ డాక్టర్ సేలం ఆల్ అబ్రి కీలకోపన్యాసం చేశారు. అతిథులను ఎస్‌ఆర్‌ఎం అకడమిక్ డైరెక్టర్ ఎస్ రామచంద్రన్, సదస్సు సమన్వయకర్త డాక్టర్ బి.జయప్రభలు ఘనంగా సత్కరించారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ వి. సుకన్య వందన సమర్పణ చేశారు.



నటుడు విజయ్‌సేతుపతి

కరా చిత్రం కోసం విజయ్‌సేతుపతి పాట

తమిళసినిమా: స్టార్ హీరోలు పాటలు పాడడం పరిపాటిగా మారింది. కమలహాసన్, విజయ్, శింబు, ధనుష్ వంటి వారు పాడిన పాటలు ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందాయి. కాగా తాజాగా మరో మల్టీ టాలెంటెండ్ హీరో విజయ్‌సేతుపతి కూడా పాడడం మొదలెట్టారు. ఈయన కరా అనే చిత్రంలో ఓ పాట పాడారు. మాస్టర్ మహేంద్రన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం కరా. దీని విశేషం ఏమిటంటే మొసలి ఇతి వృత్తంతో రూపొందడం. ఈ చిత్రం ద్వారా నటి సాహిబా బాసిన్ నాయకిగా పరిచయం అవుతున్నారు. నటుడు జీవా ప్రతినాయకుడిగా నటిస్తున్న ఇందులో మొట్టై రాజేంద్రన్, సేలం వేంగై కె.అయ్యనార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని భవానీ ఎంటర్‌ప్రైజస్ పతాకంపై రాజేంద్రకుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా అవతార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అచ్చు రాజామణి సంగీతాన్ని, గీరీశన్ ఏజీప ఛాయాగ్రహణం అందిస్తున్నారు. ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ మొసలి తమిళ పేరు కరా అని చెప్పారు. ఈ చిత్రం కోసం నటుడు విజయ్‌సేతుపతి పాడిన కాదల్ కుమారు వైరల్ ఆనారు అనే పాటను ఇటీవల విడుదల చేయగా అది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ట్రేండింగ్ అవుతోందని చెప్పారు. చిన్న పిల్లల నుంచి వయసు మళ్లిన వారు వరకూ ఆనందించే మంచి జనరంజకమైన కథా చిత్రంగా ఇది ఉంటుందన్నారు. ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

సాయిపల్లవిలో ఈ యాంగిల్ కూడా ఉందా?



నటుడు జునైద్‌ఖాన్ తదితరులతో నటి సాయిపల్లవి

తమిళసినిమా: వైద్య విద్య చదివి నటనపై ఆసక్తితో అటువైపు అడుగులు వేసిన నటి సాయిపల్లవి. మొదట్లో చిన్నచిన్న పాత్రల్లో నటించిన ఈమె ప్రేమమ్ అనే మలయాళ చిత్రం ద్వారా నాయకిగా పరిచయం అయ్యారు. అందులో ఆమె పోషించిన టీనేజర్ పాత్ర బహుళ ప్రాచుర్యం పొందింది. దీంతో దక్షిణాది చిత్ర పరిశ్రమ దృష్టిలో పడ్డారు. అలా తెలుగులో ఈమె నటించిన చిత్రాలు వరుసగా విజయాలను సాధించడంతో మంచి పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు దూరంగా, నటనకు అవకాశం ఉన్న పాత్రల్లోనే నటిస్తూ తనకంటూ ఓ ఇమేజ్‌ను సృష్టించుకున్నారు. నటనకు ప్రాధాన్యత లేకపోవడంతో పలువురు స్టార్ చిత్రాలను కూడా తిరస్కరించారు. దీంతో కొంతకాలం నటనకు దూరంగా ఇంట్లోనే కూర్చున్నారు. కాగా ప్రస్తుతం తెలుగులో నాగచైతన్య సరసన తండేల్ చిత్రం, తమిళంలో శివకార్తికేయన్ సరసన అమరన్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఇకపోతే సాయిపల్లవి అడుగులు తాజాగా బాలీవుడ్ వైపు పడ్డాయి. ఏక్ దిన్ అనే చిత్రంలో అమీర్‌ఖాన్ వారసుడు జునైద్‌ఖాన్‌కి జంటగా నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ జపాన్‌లో జరిగింది. అక్కడ షూటింగ్ పూర్తి కావడంతో ఆ చిత్ర యూనిట్ పార్టీ చేసుకున్నారు. అందులో పాల్గొన్న నటి సాయిపల్లవి ఫుల్ జోష్‌లో డాన్స్ చేశారు. ఈమె డాన్స్ చేసిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీంతో ఈమెలో ఈ యాంగిల్ కూడా ఉందా? అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇదంతా బాలీవుడ్ బాణీ అని కొందరు సెటైర్లు వేస్తున్నారు.

ప్రియుడు కొట్టారు.. మంచి ఫ్రెండ్స్ లేరు



నటి కిరణ్ రాథోడ్

తమిళసినిమా: పెరగడం, విరగడం ఈ రెండూ చిత్ర పరిశ్రమలో సహజం. ఉన్నత స్థాయికి ఎదగడం, పాతాళంలోకి తొక్కివేయడం ం అనేవి చాలా జరుగుతుంటాయి.అలా నటిగా తొలి చిత్రంతో వెలిగిపోయిన నటి కిరణ్ రాథోడ్ గుర్తుందా? ఆమె ఇప్పుడు జీవితంలో చాలా కోల్పోయి నిలబడే ప్రయత్నం చేస్తున్నారు. జెమిని చిత్రంతో కథానాయకిగా పరిచయం అయిన నటి కిరణ్. ఆ చిత్రం విజయంతో ఈమె పేరు మారుమ్రోగింది. అవకాశాలు వరుస కట్టాయి. అలా కమలహాసన్, అజిత్, విజయకాంత్, ప్రశాంత్ వంటి స్టార్ హీరోలతో జత కట్టారు. ఆ తరువాత సినిమాల్లో కనిపించలేదు. చాలా కాలం తరువాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఒకటి రెండు చిత్రాల్లో నటించారు. ఐటమ్ సాంగ్స్‌లోనూ నటించారు. ఈమె గురించి చాలా వదంతులు దొర్లాయి. కాగా ఇటీవల ఒక టీవీ చానల్‌లో పాల్గొన్న కిరణ్ తన నట జీవితం, వ్యక్తిగతం గురించి తెలుపుతూ కథానాయకిగా అవకాశాలు తగ్గుముఖం పట్టడంతో తన ప్రియుడు చెప్పిన మాటలు విని సినిమాలకు దూరం అయ్యానని చెప్పారు. అయితే అదే తాను చెసిన పెద్ద తప్పు అని ఆ తరువాత తెలుసుకున్నానన్నారు. దీంతో మళ్లీ నటించడానికి సిద్ధం కాగా కొందరు తనను తప్పుగా వాడుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. అడ్జెస్ట్‌మెంట్ కావాలని అన్నారని బహిరంగంగానే చెప్పారు. అలాంటి సమయంలో తన ప్రేమికుడు వదిలేశాడని చెప్పారు. అందుకు కారణం తమ మధ్య చిన్న సమస్యలేనని చెప్పారు. ఒకసారి అతను తనను కొట్టారని, దాన్ని తాను సహించలేకపోయానని తెలిపారు. ఆ తరువాత అతనికి ఫోన్ చేసి రమ్మని పిలిచి కోపంతో కసి తీరా గట్టిగా కొట్టానని చెప్పారు. అప్పుడు అతడు చిరిగిన బట్టలతో రోడ్డున పడ్డాడని చెప్పారు. ఈ కారణంగానో ఏమో కొందరు తనను తప్పుగా ఉపయోగించుకోవాలని చూశారని, మరి కొందరు రాత్రి వేళల్లో ఫోన్ చేసేవాళ్లని చెప్పారు. వారంతా తప్పుడు వాళ్లని తాను అర్థం చేసుకున్నానన్నారు. తనకు మంచి స్నేహితులు లేరని కిరణ్ చెప్పారు. ఇలాంటి పలు కారణాల వల్ల తాను సినిమా అవకాశాలను కోల్పోయానని చెప్పారు. అలాగే తనకు పెళ్లి అయ్యిందని, పిల్లలు పుట్టారని పుకార్లు పుట్టించారని, తాను పెళ్లే చేసుకోలేదని స్పష్టం చేశారు.



దర్శకుడు రామ్‌కుమార్‌తో విష్ణువిశాల్

విష్ణువిశాల్‌తో రెబల్ హీరోయిన్?

తమిళసినిమా: కోలీవుడ్‌లో కథానాయకుడిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నటుడు విష్ణువిశాల్. ఈయన ఇంతకు ముందు కథానాయకుడిగా నటించిన రాక్షసన్ చిత్రం సంచలన విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. కాగా ఆ చిత్రం దర్శకుడు రామ్‌కుమార్ తాజాగా మరోసారి విష్ణువిశాల్ హీరోగా చిత్రం చేయడానికి సిద్ధం అయ్యారు. ఇది విష్ణువిశాల్ నటిస్తున్న 21వ చిత్రం అవుతుంది. ఇటీవలే షూటింగ్ మొదలైన ఈ చిత్రంలో కథానాయకి ఎవరన్నది వెల్లడించలేదు. అయితే నటుడు విష్ణువిశాల్ మాత్రం ఇందులో పని చేస్తున్న ముఖ్య నటీనటులు, సాంకేతిక వర్గాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఒక్కొక్కరిని పరిచయం చేస్తున్నారు. అలా ఇందులో మలయాళ నటి మమితా బైజూ నటించనున్నట్లు ఆమె ఫొటోను తాజాగా విడుదల చేశారు. ఈమె ఇటీవల నటించిన మలయాళ చిత్రం ప్రేమలు సంచలన విజయాన్ని సాధించిందన్నది గమనార్హం. అలాగే కోలీవుడ్‌లో జీవీ.ప్రకాశ్‌కుమార్ సరసన రెబల్ చిత్రంలో నటించారు. ఈమె నటించిన తొలి తమిళ చిత్రం ఇదే. ఈ నెల 15వ తేదీన ఈ చిత్రం తెరపైకి రానుంది. కాగా తాజాగా ఇప్పుడు విష్ణువిశాల్ సరసన నటించే అవకాశం ఈ భామను వరించిందన్న మాట. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రాన్ని దర్శకుడు రామ్‌కుమార్ రాక్షసన్ చిత్రానికి భిన్నంగా ప్రేమతో కూడిన ఫాంటసీ కథా చిత్రాంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. కాగా దీనితో పాటు మోహన్‌దాస్, ఆర్యన్ చిత్రాల్లో విష్ణువిశాల్ నటిస్తున్నారు. వీటిలో మోహన్‌దాస్ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. ఆర్యన్ చిత్రం షూటింగ్ దశలో ఉంది.



నటి మమితాబైజూ

సైలెంట్‌గా శివకార్తికేయన్ 23వ చిత్ర షూటింగ్

తమిళసినిమా: మావీరన్, అయలాన్ చిత్రాల విజయాలతో నటుడు శివకార్తికేయన్ గ్రాఫ్ భారీగా పెరిగిందని చెప్పక తప్పదు. దీంతో ఈయన చిత్రాల ఎంపికలో మరింత జాగ్రత తీసుకుంటున్నారనే చెప్పాలి. తాజాగా నటుడు కమలహాసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న అమరన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇకపోతే శివకార్తికేయన్ తన 23వ చిత్ర షూటింగ్‌కు తయారయ్యారు. దీన్ని ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో మలయాళ నటి రుక్మిణి నాయకిగా నటిస్తున్నారు. ఈమె ఇటీవల మలయాళంలో సప్త సాగర దాసే ఎల్లో అనే చిత్రంలో నటించారు. కాగా రుక్మిణి ఇప్పుడు నటుడు శివకార్తికేయన్‌కు జంటగా కోలీవుడ్‌కు పరిచయం అవుతున్నారన్నమాట. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ సైలెంట్‌గా ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రారంభం అయ్యి తొలి షెడ్యూల్‌ను కూడా పూర్తి చేసుకుని ప్రస్తుతం పుదుచ్చేరిలో రెండవ షెడ్యూల్ జరుపుకుంటోంది. దీనికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా ఇంకా పేరు ఖరారు చేయని ఈ చిత్రాన్ని శరవేగంగా పూర్తి చేసి దీపావళికి తెరపైకి తీసుకు రావడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. అంతకు ముందే అమరన్ చిత్రం విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో శివకార్తికేయన్ అభిమానులు ఖుషీ అవుతున్నారు.



శివకార్తికేయన్, ఏఆర్.మురుగదాస్, అనిరుధ్

క్లుప్తంగా

విన్యాసాలు చేసి.. విగతజీవులయ్యారు

అన్నానగర్: చెన్నై మనలిలో మంగళవారం రాత్రి బైక్‌పై విన్యాసాలు చేసిన ఇద్దరు యువకులు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై కొడుంగయూరులోని సోలైయమ్మన్ కోవిల్ వీధికి చెందిన సంతోష్ (23), నగరంలోని అదే ప్రాంతంలోని సెల్వ పెరుమాల్ కోవిల్ వీధిలో నివాసముంటున్న శరణ్ (22) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో వారిద్దరూ ఒకే బైకులో చెన్నై మనలి ఆముల్‌లైవయల్ రోడ్డులో అతివేగంతో వెళ్లారు. దీంతో బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వారిద్దరు అక్కడికక్కడే మరణించారు. యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, మనలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

కొరుక్కుపేట: శారీరక రుగ్మతలతో బాధపడుతున్న వృద్ధ దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ధర్మపురి జిల్లా పల్లిపట్టు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పల్లిపట్టు అలపురం కల్లియూర్ గ్రామంలో గోపాల్ (73), అతని భార్య వేదియమ్మాల్ (70) నివాసమున్నారు. వారికి కొడుకు అన్బు ఉన్నాడు. అతడికి వివాహమై అదే ప్రాంతంలో వేరుగా ఉంటున్నాడు. గోపాల్, వేదియమ్మాల్ ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గత ఆరు నెలల క్రితం గోపాల్‌కు పక్షవాతం వచ్చింది. అలాగే వేదియమ్మాల్ కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. దీంతో ఇద్దరూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆవులకు నీళ్లు తాపించడానికి వచ్చిన కుమారుడు అన్బు అక్కడ తల్లిదండ్రుల ఇంటికి తాళం వేసి ఉండడం చూశాడు. తలుపు తట్టినా తెరవలేదు. కిటికీలోంచి చూడగా గోపాల్, వేదియమ్మాల్ చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండడం చూసి షాక్‌కు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. శారీరక రుగ్మతలతో చనిపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

15 టన్నుల రేషన్ బియ్యం సీజ్

- ఆరుగురి అరెస్టు

అన్నానగర్: వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై జోనల్ సూపరింటెండెంట్ రామగి రుష్ణన్ ఆధ్వర్యంలో సబ్ సూపరింటెండెంట్ సంపత్, ఇన్‌స్పెక్టర్ హేమలత ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం ఆవడి ప్రాంతంలో రహస్య నిఘా పెట్టారు. అక్కడికి వచ్చిన లారీలోని బస్తాలను తనిఖీ చేయగా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. అనంతరం 15 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని తిరునిన్నవూరుకు చెందిన చక్రవర్తి (50), రెడ్‌హిల్స్‌కి చెందిన రాధాకృష్ణన్ (36), తిరువారూరుకు చెందిన సంతోషం (33)ను అరెస్టు చేశారు. అలాగే సదయన్ కుప్పం, బర్మానగర్ ప్రధాన రహదారిపై ఆటోలో 2,400 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నించిన తండయారుపేటకు చెందిన నరేష్ (33), తిరువొత్తియూరుకు చెందిన శేఖర్ (40), వ్యాసర్‌పాడికి చెందిన శక్తివేల్ (42)ను అదుపులోకి తీసుకున్నారు.

వైభవంగా వసంతోత్సవం



శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ముందుగా నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. ఆదిదంపతులకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవర్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ క్రమంలో సూర్య పుష్కరిణి వద్ద త్రిశూలానికి ఆగమోక్తంగా అభిషేకం చేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనులపండువగా కేడిగ వాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామిఅమ్మవార్లకు కనులపండువగా కేడిగ వాహనసేవ నిర్వహించారు. విశేష అలంకరణలో దేదీప్యంగా విరాజిల్లుతున్న ఆదిదంపతులను కేడిగ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శాస్త్రోక్తంగా కలశోద్వాసన

ఉత్సవాల్లో భాగంగా రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శైవాగమన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా స్వామివారి గర్భాలయం వద్ద ధ్వజస్తంభానికి త్రిశూలంతో పాటు జ్ఞానప్రసూనాంబ సమేత సోమస్కంధ మూర్తి ఉత్సవమూర్తులకు సంకల్ప పూజలు చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభం నుంచి ధ్వజ పటం, దవళవస్త్రంతోపాటు భక్తులు సమర్పించిన చీరలను కిందకు దింపారు. ధ్వజస్తంభ పీఠానికి అభిషేకం చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. యాగశాలలో ఏర్పాటు చేసిన యాగ కలశాలను ఉద్వాసన చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి ధ్రువమూర్తులకు అభిషేకం చేశారు. రాత్రి 10.30 గంటలకు స్వామి అమ్మవార్లు సింహాసనం, కామధేనువు వాహనాలపై పురవీధుల్లో ఊరేగారు. కార్యక్రమాల్లో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిఈడు పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని బడిలో చేర్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగానే బుధవారం పట్టణంలోని లక్ష్మీపురం ప్రాంతంతో జరిగిన అవగాహన ర్యాలీని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సుమారు కిలోమీటరు దూరం సాగిన ర్యాలీలో బడి ఈడు పిల్లను బడిలో చేర్పించాలని కోరుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన చిన్నారులకు డ్రస్సులు తదితర వాటిని అందించి కలెక్టర్ అడ్మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లను రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసి, ప్రాధాన్యత కల్పించిందన్నారు. నిరుపేద విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం పౌష్టికాహారం అందజేస్తున్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిషత్తు విషయంలో తాము చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. ఉన్నత విద్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం 7.5 శాతం రిజర్వేషన్ సైతం కల్పిస్తున్న విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. దీంతో పాటు పుదుమైపెన్(కొత్తమహిళ)పథకం కింద డిగ్రీ చదివే విద్యార్థులకు ప్రతి నెలా రూ.వెయ్యితోపాటు ఇతర సదుపాయాలను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతోపాటు కళలు, కవిత్వం, వ్యాసరచన, కర్రసాము, డ్యాన్స్, సెమినార్, క్రీడలు తదితర వాటిలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఐదేళ్లు పూర్తి అయి, ఇప్పటి వరకు పాఠశాలకు వెళ్లని 1,876 మందిని గుర్తించామని, వారిని వందశాతం పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రవిచంద్రన్, మున్సిపల్ కమిషనర్ సుభాషిణి పాల్గొన్నారు.

వేపంబట్టు రైల్వే బ్రిడ్జి పనులకు భూమిపూజ



పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణస్వామి

తిరువళ్లూరు: పదేళ్లపాటు వివాదాలతో ఆగిన బ్రిడ్జి నిర్మాణ పనులకు మార్గం సుగమం కావడంతో బుధవారం భూమిపూజ చేశారు. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా వేపంబట్టు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి 2011లో రూ. 29.50 కోట్లను కేటాయించి పనులను చేపట్టారు. రెండు వైపులా బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం పిల్లర్లు నిర్మాణంతోపాటు ఇతర పనులు వేగంగా సాగాయి. అయితే బ్రిడ్జి నిర్మాణంతో నివాసాలు దెబ్బతినే అవకాశం ఉందని, కొందరు డిజైన్‌ను మార్చాలని కోర్టును ఆశ్రయించారు. దాదాపు పదేళ్ల పాటు కోర్టు కేసులతో పనులు ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాక్ దాటే సమయంలో పలువురు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో డిజైన్ మార్పు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కమిటీ ఏర్పాటు చేయగా, దాదాపు రెండు నెలల పాటు క్షుణ్ణంగా పరిశీలించిన కమిటీ డిజైన్ మార్పు చేయడం సాధ్యం కాదని నిర్ధారించింది. దీంతో కోర్టు యథాతథంగా పనులు చేపట్టాలని ఆదేశించింది. దీంతో పాటు చెన్నై మెట్రోపాలిటిన్ అథారిటీ బ్రిడ్జి నిర్మాణం కోసం అదనంగా రూ.24.18 కోట్లను ఆరునెలల క్రితం కేటాయించి టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు దక్కించుకున్న వారు బుధవారం ఉదయం పనులను ప్రారంభించారు. పనులను పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసి ప్రారంభించారు. పనులను 2025 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు.

రూ. 12 లక్షల నగదు, 23 సవర్ల నగల చోరీ

తిరువొత్తియూరు: చెన్నై నుంగంబాకంలోని ఓ పారిశ్రామికవేత్త ఇంట్లో రూ.12 లక్షల నగదు, 23 సవర్ల నగలు చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. చెన్నై నుంగంబాకం మురళి వీధికి చెందిన కుప్పరాజు(45) పారిశ్రామికవేత్త. ఇతను 10వ తేదీ కుటుంబంతో కోవై వెళ్లి మంగళవారం రాత్రి తిరిగి వచ్చారు. ఆ సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.12 లక్షల నగదు, 23 సవర్ల నగలు చోరీ అయినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మహిళపై దాడి చేసి 13 సవర్ల నగల అపహరణ

తిరువొత్తియూరు: మహిళపై దాడి చేసి 13 సవర్ల నగలు చోరీ చేసిన సంఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై నెర్కుంద్రం మందవెల్లి వీధికి చెందిన అలుగురాజా (34) కోయంబేడు కూరగాయల మార్కెట్‌లో క్యాబేజీ హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నాడు. తన తల్లి ఓవియం (57) ఇంట్లో ఒంటరిగా ఉంటున్న సమయంలో తన భార్య ఆనంది (26) ఇంట్లోకి చొరబడి ఆమెపై దాడి చేసి, ఆమె ధరించి ఉన్న 13 సవర్ల నగలను తాళి చైన్ లాక్కుని పారిపోయారని కోయంబేడు పోలీసు స్టేషన్‌లో అలగురాజా ఫిర్యాదు చేశారు. తన భార్య, తనకు మధ్య సమస్యలున్న కారణంగా తన తల్లిపై దాడి చేసి 13 సవర్ల నగలు లాక్కెళ్లినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై తనతల్లిపై దాడి చేసి పారిపోతున్న వీడియోను ఆధారాలను పోలీసులకు అప్పగించాడు. దీంతో ఆనందిని పోలీసుస్టేషన్‌కు రప్పించి విచారణ జరిపారు. ఆ సమయంలో ఆమె తన అత్తపై దాడి చేయలేదని, 13 సవర్ల నగలు అపహరించలేదని తెలిపారు. దీంతో క్రైమ్ విభాగం పోలీసు ఇన్‌స్పెక్టర్ గోమతి నేతృత్వంలో పోలీసులు విచారణ చేయగా ఆనంది తన అత్తపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమెపై మూడు విభాగాల కింద కేసు నమోదు చేసి ఆనందిని విచారణ చేస్తున్నారు.

కోర్టు విచారణకు గైర్హాజరు.. ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: కోర్టు విచారణకు గైర్హాజరై తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నై మాధవరం కొళత్తూరు టీచర్స్ కాలనీకి చెందిన రౌడీ మోహన్ 2011వ సంవత్సరం రెట్టేరి సమీపంలో జరిగిన కేసులో నిందితుడు. ఈ నేపథ్యంలో మోహన్‌తో సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో కొళత్తూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన మదన్‌కుమార్ (38), టీచర్స్ కాలనీకి చెందిన స్టీఫెన్ రాజ (34) అనే ఇద్దరు వరుసగా కోర్టులో విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో వారిని అరెస్టు చేయాలని కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో మాధవారం సహాయ కమిషనర్ సహదేవన్ నేతృత్వంలో మాధవరం పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ భూపాలం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, మదన్‌కుమార్, స్టీఫెన్‌రాజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి జైలులో పెట్టారు. మొగప్పేర్ ప్రాంతానికి చెందిన డైజీ (42) 2022వ సంవత్సరం మాధవరంలో జరిగిన చోరీ కేసులో అరెస్టు చేసి, జైలుకు వెళ్లి నిబంధనల మేరకు బెయిల్ తీసుకున్నారు. ఈ క్రమంలో దిండిక్కల్‌ప్రాంతంలో మరో చోరీకి సంబంధించి ఆమెను అరెస్టు చేసి, మదురై జైలులో పెట్టారు. బెయిల్‌పై విడుదలైన ఆమె తరువాత కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్నారు. దీంతో ఆమెకు కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, డైజీని చెన్నై మాధవరం ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి జైలులో పెట్టారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామికి హుండీ కానుకల ద్వారా రూ.1.13కోట్ల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 19 రోజుల హుండీ కానుకలను బుధవారం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించారు. ఇందులో బంగారం 100 గ్రాములు, వెండి 670 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10వేలు, నిత్య అన్నదానం హుండీ ద్వారా రూ.32 వేలు, ప్రధార రథం హుండీ ద్వారా రూ.5వేలు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 70 డాలర్లు, కెనడ 210 డాలర్లు, సింగపూర్ 2 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, న్యూజిలాండ్ 60 డాలర్లుతో కలిపి మొత్తం రూ.1.13కోట్లు ఆదాయం వచ్చినట్లు వారు వివరించారు. ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు. యూనియన్ బ్యాంక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన భగవతి అమ్మన్ ఉత్సవాలు

తిరువొత్తియూరు: కుమరిలోని ప్రసిద్ధ దేవాలయాలలో మండైకాడు భగవతి అమ్మన్ ఆలయం ఒకటి. ఈ ఆలయంలో మాసిక్కోడై వేడుక ఈనెల 3వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. చివరిరోజైన బుధవారం మధ్యాహ్నం వడుగు పూజ నిర్వహించారు. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వడుగు పూజలతో ఉత్సవాలు పూర్తయినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జాఫర్ సాధిక్ స్నేహితుడి అరెస్టు

కొరుక్కుపేట: డ్రగ్ స్మగ్లింగ్‌కు సంబంధించిన కేసులో జాఫర్ సాదిక్ స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. గత నెలలో ఢిల్లీలో డ్రగ్ దోపిడీకి సంబంధించిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ వ్యవహారం వెనుక తమిళసినీ నిర్మాత జాఫర్ సాధిక్ సూత్రధారిగా ఉన్నట్లు తేలింది. ఆయన చెన్నై వెస్ట్ జిల్లా డీఎంకే విభాగానికి డిప్యూటీ ఆర్గనైజర్‌గా కూడా ఉన్నారు. డ్రగ్స్ కేసులో ఆయన పేరు ఉండడంతో డీఎంకే నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఇప్పటి వరకు రెండు వేల కోట్లు విలువైన 3,500 కిలోల డ్రగ్స్ విదేశాలకు తరలిపోయిందని, దీనిపై విచారణ చేస్తూ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ సాధిక్‌కు సమన్లు జారీ చేసింది. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చేసేది లేక ఆయన ఇంటికి నోటీసులు అతికించారు. కాగా పరారీలో ఉన్న సాధిక్‌ను ఈనెల9న రాజస్థాన్ రాష్ట్రంలో అరెస్టు చేశారు. ఈ క్రమంలో సాధిక్ స్నేహితుడు సదాను నార్కోటిక్స్ నిరోధక పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు.

రూ.28 లక్షల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై ఫ్లవర్ బజార్ ప్రాంతంలో రూ.28 లక్షల విలువైన విదేశీ సిగరెట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, గోడౌన్ ఉద్యోగి సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చెన్నై ఫ్లవర్ బజార్ అంగప్పన్ వీధిలోని ఓ గోడౌన్ నుంచి అనుమానాస్పదంగా బండిల్స్‌ను కారులో ఎక్కిస్తున్నట్లు సహాయ కమిషనర్ దక్షిణామూర్తికి సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆవుడయప్పన్, పోలీసులు కార్లు తనిఖీ చేయగా విదేశీ సిగరెట్లు తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో కారులో ఉన్న ఇద్దరిని కార్లో ఎలిఫెంట్ గేట్ పోలీసుస్టేషన్‌కు తీసుకుని వచ్చి విచారణ జరిపారు. వారు చెన్నై షావుకారుపేట పొన్నప్పన్ వీధికి చెందిన గోడౌన్ ఉద్యోగి ప్రవీణ్ (32), ఎంకేబీనగర్ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ అబ్దుల్ రహీం (45) అని తెలిసింది. వారి వద్ద నుంచి రూ.28. 57 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న గోడౌన్ యజమాని చాందలాల్ (67) కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వినాయకుని సేవలో విదేశీ భక్తులు



ఆలయంలో విదేశీ భక్తులు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని వివిధ దేశాలకు చెందిన భక్తులు బుధవారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. అమెరికా, కెనడా, యూకే, నెదర్లాండ్, జర్మనీ, రష్యా దేశాలకు చెందిన 46 మంది భక్తులు స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం ఇప్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.21 లక్షల మోసంపై ఫిర్యాదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: కాట్పాడిలో ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.21 లక్షలు మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు బుధవారం ఉదయం ఎస్పీ మణివన్నన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాట్పాడి, లత్తేరి, కేవీ కుప్పం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు ఇచ్చిన ఫిర్యాదులో కాట్పాడికి చెందిన ఆర్మీ మాజీ సిపాయి ఒకరు తమకు ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తామని, మాయ మాటలు చెప్పాడని, వాటిని నమ్మిన తాము ఒక్కొక్కరు రూ.4 లక్షల వంతున మొత్తం రూ. 21 లక్షలు అతనికి అందజేశామని, అయితే తమకు ఉద్యోగం తీసి ఇవ్వలేదని పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి వేచి ఉన్న తాము అతని వద్ద నగదును తిరిగి ఇవ్వాలని కోరితే తమకు హత్య బెదిరింపులతోపాటు నగదు ఇచ్చేందుకు కుదరదని చెపుతున్నాడన్నారు. ఈ నగదును తాము అప్పులు చేసి, ఇవ్వడంతో అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని, వీటిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే సత్‌వచ్చారికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదులో ప్రధానమంత్రి ఇంటి రుణాల పేరుతో రూ. 5 లక్షలు ఇప్పిస్తామని తెలిపి, ఇందుకు మొదటగా రూ.50 వేలు చెల్లించాలని అదే ప్రాంతానికి చెందిన ఒకరు తనను మోసం చేసి, రుణం ఇప్పించకుండా తమకు డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వీటిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరింది. ఫిర్యాదులను స్వీకరించి వీటిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

అన్నాడీఎంకేకు మన్సూర్ మద్దతు



అన్నాడీఎంకే కమిటీతో సమావేశమైన మన్సూర్అలీ ఖాన్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే కూటమిలో ఇండియ జననాయగ పులిగల్ కట్చి నేత, సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ చేరారు. అన్నాడీఎంకే నేతృత్వంలో కూటమి ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు చిన్న పార్టీలు మాత్రమే కూటమిలోకి చేరాయి. ఈ పరిస్థితులలో బుధవారం సినీ నటుడు మన్సూర్ అలీ ఖాన్ నేతృత్వంలోని ఇండియ జననాయగ పులిగల్ కట్చి ప్రతినిధులు అన్నాడీఎంకే కార్యాలయానికి వచ్చారు. తమ మద్దతును అన్నాడీఎంకేకు ప్రకటించి, కూటమిలో చేరుతున్నట్టు మన్సూర్ అలీఖాన్ ప్రకటించారు. అన్నాడీఎంకే కమిటీ ప్రతినిధులు దిండుగల్ శ్రీనివాసన్, కేపీ మునుస్వామి తదితరులతో మన్సూర్ సమావేశమయ్యారు. తమకు ఓ సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, తమ కూటమిలో చేరుతుందని ఆశించిన పీఎంకే ప్రస్తుతం రూటు మార్చినట్టుగా కనిపించడం అన్నాడీఎంకేను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టింది. ఆ పార్టీతో మళ్లీ చర్చలను ముమ్మరం చేశారు. అదేసమయంలో ప్రేమలత విజయకాంత్ నేతృత్వంలోని డీఎండీకే కూడా చేజారకుండా జాగ్రత్తలలో పడ్డారు. మలి విడత చర్చలకు హాజరు కావాలని ఆ పార్టీకి అన్నాడీఎంకే పిలుపునివ్వడం గమనార్హం.

కిలో నకిలీ హాల్‌మార్క్ బ్రాండ్ ఆభరణాల స్వాధీనం

అన్నానగర్: కిలో నకిలీ హాల్‌మార్క్ బ్రాండ్ ఆభరణాలను స్వాధీనం బ్యూరో ఆఫ్ స్టాండర్డైజేషన్ ఆఫ్ ఇండియా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని పాత మామల్లపురం రోడ్డులోని కేళంబాక్కంలోని రకుల్ గోల్డ్ హౌస్ నగల దుకాణంలో నకిలీ హాల్‌మార్క్ ఉన్న నగలను విక్రయిస్తున్నట్లు బ్యూరో ఆఫ్ స్టాండర్డైజేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) చెన్నై శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో బీఎస్ఐ కో డైరెక్టర్ జీవానందం, డిప్యూటీ డైరెక్టర్ దినేష్ రాజగోపాలన్, అధికారులతో కూడిన బృందం బుధవారం నగల దుకాణంలో తనిఖీలు చేశారు. ఇందులో నకిలీ హాల్‌మార్క్‌లతో 1,173 గ్రాములు బరువున్న 262 నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బీఎస్ఐ చెన్నై బ్రాంచ్ ఆఫీస్ హెడ్ జీ భవాని మాట్లాడుతూ ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం నగల దుకాణ యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నేరానికి ఒక సంవత్సరం వరకు జైలుశిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు చెప్పారు. హాల్‌మార్క్‌తో ఆభరణాలు విక్రయిస్తున్నట్లు గుర్తించే తరమణిలో బీఐఎస్ చెన్నై శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బంగారు నగలలో హెచ్‌యూఐటీ నంబర్, బీఐఎస్ హాల్‌మార్క్ గుర్తు ప్రామాణికతను కేర్ మొబైల్‌యాప్‌లో పోస్టు చేయడంతో పబ్లిక్ వెరిఫై చేయవచ్చన్నారు. ప్రామాణికమైన హాల్‌మార్క్ స్టాంప్ నగల గురించి మరింత సమాచారం కోసం డబ్ల్యాడబ్ల్యాడబ్ల్యా బీఐఎస్.గవర్నమెంట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పాన్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చన్నారు.

ఆభరణాల గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

అన్నానగర్: తంజావూరు సమీపంలో రాజకీయ పార్టీల సదస్సులు, పండుగలకు మండపాలు సరఫరా చేసే ఓ వ్యక్తి అలంకరణ వస్తువుల గోడౌన్‌లో బుధవారం వేకువజామున అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో రూ.2 కోట్ల విలువైన వస్తువులు కాలిపోయాయి. వివరాల్లోకి వెళితే.. తంజావూరులోని అరులానంద నాగరాయ్‌లో పందల్ శివ (58) ఉన్నారు. ఈయన తమిళనాడుతోపాటు వివిధ రాష్ట్రాల్లో జరిగే రాజకీయ పార్టీల కార్యక్రమాలు, సమావేశాలతోపాటు పలు పండుగలకు పూలమాలలు, అలంకరణ తోరణాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆయనకు చెందిన గోడౌన్ నాంజికోట్టై సమీపంలోని షణ్ముఖ పట్టణంలో ఉంది. ఈ గోడౌన్‌లోనే టెంట్, స్టేజీ అలంకరణ, కటౌట్ తదితరాల తయారీకి ఉపయోగించే సామగ్రిని ఉంచారు. ఈ గోడౌన్‌లో బుధవారం వేకువజామున ఒకసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో షాక్‌కు గురైన గోడౌన్ మేనేజర్ వెంటనే తంజావూరు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు వాహనాలతో సంఘటనా స్థలానికి చేరుకుని, దాదాపు నాలుగు గంటలకు పైగా పోరాడి మంటలను ఆర్పారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.2 కోట్ల విలువైన అలంకార వస్తువులు, రాజకీయ పార్టీల నేతల కటౌట్లు తదితరాలు పూర్తిగా కాలిపోయాయి. శివ తంజావూరు తమిళ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంటలు ఎలా చెలరేగాయన్న విషయం వెంటనే తెలియలేదు. పారిశ్రామిక పోటీ కారణంగా ఎవరైనా నిప్పు పెట్టారా? లేక మరేదైనా కారణమా? అని తమిళ యూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.కోటి విలువైన గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

కొరుక్కుపేట: విమానంలో థాయ్‌లాండ్ నుంచి చెన్నైకి అక్రమంగా తరలిస్తున్న 1.51 కిలోల నాణ్యమైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. థాయ్‌లాండ్ నుంచి తిరుచ్చి మీదుగా చెన్నైలోని అన్నానగర్ ప్రాంతానికి రూ.కోటి విలువైన రూ.1.51 కిలోల నాణ్యమైన గంజాయిని కారులో తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెస్టన్ జాయింట్ కమిషనర్ విజయకుమార్, అన్నానగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసన్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 10వ తేదీన అన్నానగర్‌లోని న్యూ ఆవడి రోడ్డులో ప్రైవేట్ పోలీసులు నిఘా పెట్టారు. కారులో వెళుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా హైగ్రేడ్ గంజాయి ఉండగా గుర్తించి, గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు శివగంగై జిల్లాకు చెందిన యాసర్ ఆరాఫత్ (34), రాయపేటకు చెందిన మహ్మద్ జైనుల్ రియాజ్ (30), చెన్నై సమీపంలోని మంగత్‌కు చెందిన వర్షన్ (65)గా గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కార్తీక్ విదేశాలకు పరారైయ్యారు.దీంతో అతనికి లుకౌట్ నోటీసు జారీ చేశారు.

తమిళభాషకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



రచయితలను అభినందిస్తున్న వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు: రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తమిళభాషకు, తమిళ పేర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ అన్నారు. వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఆవరణలో తమిళ రచయిత పెరింజిత్తనార్ 92వ జయంతి వేడుకలతోపాటు తమిళ బాషాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తమిళ రచయితలను అభినందించి, ప్రసంగించారు. దేశంలో మొత్తం 7,100 భాషలున్నాయని వీటిలో ముఖ్యంగా 23 భాషలను మాత్రమే మాట్లాడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జనాభా సంఖ్య 800 కోట్లు ఉందని, అందులో ఒక కోటి మంది మాట్లాడే భాష 23 భాషల్లోనే ఉందన్నారు. రచయిత పెరింజిత్తనార్ తమిళ భాష కోసం, తమిళం కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. శ్రీలంకలో తమిళులు మూడు విభాగాలుగా ఉన్నారని ఆయన చెప్పారు.

నేరుగా వచ్చి ఆత్మహత్యాయత్నం

ఫోన్ మాట్లాడుతూ ట్రాక్‌పైకి వచ్చింది

గీతాంజలి మృతిపై జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ వాంగ్మూలం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'గుంటూరు నుంచి 12.05 గంటల ప్రాంతంలో తెనాలి స్టేషన్ దగ్గరకు వచ్చే సరికి అప్పటి వరకూ ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ పక్కన నిలబడిన యువతి ఒక్కసారిగా ట్రాక్ పైకి వచ్చేసింది. ఆమెను తప్పుకోమని అరుస్తూ ఎమర్జెన్సీ బ్రేక్ వేశా. అయితే అప్పటికే రైలు ఇంజన్ ఆమెకు తగిలింది. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను ప్రయాణికుల సహకారంతో ట్రైన్ ఎక్కించుకుని తెనాలి స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కు అప్పగించా'నని జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ జీఆర్‌పీ పోలీసులకు అప్పుడే స్టేట్‌మెంట్ ఇచ్చారు. రైల్వే స్టేషన్ మాస్టర్ దగ్గర ఉన్న పుస్తకంలో కూడా ప్రమాదానికి సంబంధించిన వివరాలను నమోదు చేశారు. సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు గీతాంజలి ఈ నెల ఏడున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయడం ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తెలుగుదేశం సోషల్ మీడియాలోనూ, అఫిషియల్ మీడియాలో కూడా ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించేలా కామెంట్స్ పెడుతున్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆమెను రైలు కిందకు తోసేసి పరారు అయ్యారంటూ ఒక వీడియోలో ఇద్దరు మాట్లాడుకుంటున్నట్లుగా చూపిస్తూ మార్ఫింగ్ వీడియోని సర్క్యులేట్ చేస్తున్నారు. దీనిని ఎడిట్ చేసి బయటకు వదిలినట్లుగా పోలీసుల విచారణలో స్పష్టం అయ్యింది. ఈ వీడియోను సర్క్యులేట్ చేసింది ఎవరు? అనేదానిపై కూడా విచారణ జరుపుతున్నారు. చనిపోయిన తర్వాత కూడా వదలకుండా ఆమె వ్యక్తిత్వాన్ని తప్పు పట్టేవిధంగానే తెలుగుదేశం సోషల్‌మీడియాలో బురదజల్లుతోంది. లోకోపైలెట్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో అసలు ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం లేదని, ఆమె ఒక్కతే వచ్చి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు స్పష్టం అవుతోంది. అయినా తెలుగుదేశం చేస్తున్న తప్పుడు ఆరోపణల నేపథ్యంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బృందం బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ చుట్టుపక్కల వారిని విచారించింది. దగ్గరలో ఏమైనా సీసీ కెమెరాలు ఉన్నాయా అన్న విషయాన్ని ఆరా తీసింది. సోషల్‌మీడియా ట్రోలింగ్‌ల నేపథ్యంలో మృతి చెందినట్లు ఆమెకుటుంబ సభ్యుల ఫిర్యాదు నేపథ్యంలో ట్రోలింగ్‌కు పాల్పడిన హ్యాండిల్స్‌ను గుర్తించి బాధ్యులను అదుపులోకి తీసుకునే దిశగా పోలీసు బృందాలు తమ విచారణ వేగవంతం చేశాయి. ఒక బీసీ మహిళను వేధించి ఆత్మహత్యకు పురికొల్పడమే కాకుండా చనిపోయిన తర్వాత కూడా ఈ విధంగా ట్రోల్ చేయడాన్ని తెలుగుదేశం పార్టీలోనే కొందరు తప్పు పడుతున్నారు.

నాడు రిషితేశ్వరిని ఇలాగే పొట్టన పెట్టుకున్నారు

నాడు రిషితేశ్వరి నుంచి నేటి గీతాంజలి వరకూ పచ్చమూకల వికృత చర్యలకు బలైపోయిన వారే. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా ఎవరిని తీసుకున్నా వారికి ముందు నుంచి మహిళలంటే చిన్నచూపే. 2015లో గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ర్యాగింగ్‌కు గురై యూనివర్సిటీ వసతి గృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మౌనం వహించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. బాబురావుతోపాటు అప్పుడు యూనివర్సిటీ పరిపాలనలో ఉన్న ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. బలహీన వర్గాల విద్యార్థినికి న్యాయం చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వప్రయత్నించకపోగా న్యాయం కోసం ఉద్యమిస్తున్న వారిని అడ్డుకుంది. రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉద్యమం చేస్తున్నాయనే కారణంతో ప్రభుత్వం, యూనివర్సిటీ ఉన్నతాధికారులు యూనివర్సిటీ విద్యార్థి సంఘాలను నిషేధించారు. యూనివర్సిటీలో ఉన్న విద్యార్థి సంఘాల బోర్డులను సైతం తొలగించారు. ఉద్యమాన్ని అణిచేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించింది. విద్యార్థిని ఆత్మహత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను రక్షించేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అప్పట్లో ప్రజాసంఘాలు బహిరంగంగానే ఆరోపణలు చేశాయి. విచారణ కమిటీల పేరుతో కాలయాపన చేసింది. రిషితేశ్వరి ఆత్మహత్యపై కథనాలు రాస్తున్నారనే అక్కసుతో కొందరు మీడియా ప్రతినిధులపై కేసులు నమోదు చేస్తామని కూడా బెదిరించారు. రాష్ట్రంలో బలహీన వర్గాల మహిళల ప్రాణాలకు రక్షణ లేదని రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని, చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకమైన నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో ఎమ్మెల్యే ఆర్కే రోజాతోపాటు పలువురు అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. తప్పనిసరి పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. బాబురావుపై చర్యలు తీసుకుందే తప్ప చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా కూడా బుద్ధి మార్చుకోలేదు.

దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదు

- గీతాంజలి మృతిపై సమగ్ర విచారణ
- హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరు : గీతాంజలి మృతిపై సమగ్ర విచారణ చేస్తున్నామని, బాధ్యులైన దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇంటి పట్టా పొందడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేకూర్చిన లబ్ధిని, అమ్మ ఒడి పథకం వల్ల తన కుటుంబానికి చేకూర్చిన మేలును వివరించడమే ఆమె చేసిన పాపమా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన నాయకులు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని గీతాంజలిని వేధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. గీతాంజలిని మానసిక క్షోభకు గురిచేసి ఆమె బలవన్మరణానికి కారకులయ్యారన్నారు. దిశ యాప్ ద్వారా సమాచారం ఇవ్వడం, మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఉంటే సకాలంలో ఆ అమ్మాయిని కాపాడుకునే వాళ్లమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

సోషల్‌మీడియా చీడ పురుగులు

టీడీపీ, జనసేన సోషల్ మీడియా విభాగాల పైశాచికత్వం

- అందుకోసం ప్రత్యేకంగా విభాగాలు.. వేలాది ఫేక్ ఖాతాలు
- మహిళలు, విద్యార్థులు, సామాన్యులే లక్ష్యం
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గొంతు నొక్కే కుట్ర
- టీడీపీ సీనియర్ నేతలు అయ్యన్న, బండారులదీ అదే జాడ్యం
- ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తున్న సీఐడీ
- వేధింపులకు పాల్పడితే సైబర్ బుల్లీషీట్ల నమోదు



సాక్షి, అమరావతి: పేదింటి పిల్లలు ప్రభుత్వ బడుల్లో చదువుకుని ఇంగ్లిష్‌లో గలగలా మాట్లాడితే వారికి కడుపు మంట..వారిపై సోషల్ మీడియాలో హేళనలు... వేధింపులు ప్రభుత్వ బడిలో చదువుకుని ప్రతిభా పాటవాలతో అమెరికా వెళ్లి ఐక్యరాజ్యసమితిలో ప్రసంగిస్తే చాలు... సోషల్ మీడియాలో ఈసడింపులు... చీత్కారాలు.. ప్రభుత్వం తనకు ఇల్లు ఇచ్చిందని పేద మహిళ సంతోషం వ్యక్తం చేస్తే చాలు... సోషల్ మీడియాలో దూషణలు, దుర్భాషలు.. పేదలు, సామాన్యులు హాయిగా నవ్వితే ఓర్చుకోలేరు... సంతోషంగా ఉంటే తట్టుకోలేరు... జీవితంలో ఒక మెట్టు పైకి ఎక్కితే సహించలేరు. దూషణలతో వేధిస్తూ.. పరుష పదజాలంతో దూషిస్తున్నారు. చివరికి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా అవమానభారంతో నలుగురులోకి రాలేని పరిస్థితి తీసుకువస్తారు. తాజాగా తెనాలికి చెందిన గీతాంజలి ఉదంతమే అందుకు తార్కాణం. రాష్ట్రంలో దాదాపు ఐదేళ్లుగా టీడీపీ, జనసేనలు సాగిస్తున్న వికృత క్రీడ ఇది. మహిళలు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికలపై ట్రోలింగ్‌తో పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారు. అందుకోసం టీడీపీ, జనసేన పార్టీలు ఏకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేసి మరీ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు పాల్పడుతుండటం ఆ రెండు పార్టీల దుర్మార్గ రాజకీయాలకు పరాకాష్ట..

ఓటమిని జీర్ణించుకోలేక దిగజారుడు రాజకీయాలు

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ఘోరపరాజయంతో చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు బరితెగించారు. సాధారణ మహిళలు, విద్యార్థులు, సామాన్యుల్ని లక్ష్యంగా చేసుకుని దుర్మార్గ రాజకీయాలకు తెరతీశారు. సోషల్ మీడియా ద్వారా అసభ్య కామెంట్లతో దాడులు చేయమని తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలకు ఆదేశించారు. అందుకు పవన్ కళ్యాణ్ కూడా తోడయ్యారు. టీడీపీ, జనసేన పార్టీలు పక్కా పన్నాగంతో సోషల్ మీడియా వేదికగా కుట్రకు తెరతీశాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసి వందలాది మందిని తమ సోషల్ మీడియా విభాగాల్లో నియమించాయి. వేలాది ఫేక్ అకౌంట్లు సృష్టించి వాటి ద్వారా సామాన్యులను వేధించడం మొదలుపెట్టాయి. టీడీపీ సీనియర్ నేతలు అయ్యన్న పాత్రుడు, బండారు సత్యనారాయణ మూర్తిలు కూడా సోషల్ మీడియా ద్వారా సామాన్యులను వేధించడం విభ్రాంతి కలిగిస్తోంది. ఆ రెండు పార్టీల సోషల్ మీడియా విభాగాలకు చెందిన వందలాది మంది ట్రోలింగ్ పిశాచాలుగా మారి సామాన్యులను వేధింపులకు గురిచేశారు.

లబ్ధిదారులే లక్ష్యం

పేదలందరికీ ఇళ్లు, వైఎస్సార్ ఆసరా, వాహన మిత్ర, చేయూత, తోడు, చేదోడు, సున్నావడ్డీ, రైతు భరోసా తదితర పథకాల లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తే చాలు వారిని వ్యక్తిగతంగా దూషిస్తూ విరుచుకుపడుతున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేయకుండా కట్టడిచేయాలన్నదే టీడీపీ, జనసేన పార్టీల కుట్ర.

న్యాయ వ్యవస్థపైనా ట్రోలింగే

టీడీపీ, జనసేన పార్టీలు చివరికి న్యాయ వ్యవస్థను కూడా విడిచిపెట్టకపోవడం పరాకాష్ట. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన చంద్రబాబుకు జ్యుడిషియల్ రిమాండ్ విధించిన విజయవాడ ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తిని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. హైకోర్టు ఆదేశాలతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి లక్ష్యంగా పోస్టులు పెట్టిన టీడీపీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముల్లా ఖాజా హుస్సేన్‌ను గతేడాది నవంబర్ 27న పోలీసులు అరెస్ట్ చేశారు.

పోలీసులు, సీఐడీ కఠిన చర్యలు

సామాన్యులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో వేధింపులపై పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టింగులు పెడుతున్నవారిని ఐపీ అడ్రస్‌లతో గుర్తించి కేసులు నమోదు చేస్తోంది. సైబర్ బుల్లీషీట్లను తెరచి దర్యాప్తు ముమ్మరం చేస్తోంది. ఈ నాలుగున్నరేళ్లలో సీఐడీ 2,919 సైబర్ బుల్లీషీట్లను నమోదు చేసింది. సోషల్ మీడియా వేధింపులకు భయపడకుండా ఫిర్యాదు చేయాలని సీఐడీ విభాగం కోరుతోంది.

వేధిస్తే కఠిన శిక్షలు

ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌కు పాల్పడేవారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.

- ▲ **67 ఐటీ చట్టం:** ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా
- ▲ **ఐపీసీ 354:** ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను లక్ష్యంగా చేసుకుని వేధిస్తే ఈ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేస్తారు. మహిళను నేరుగా గానీ ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల ద్వారా అదే పనిగా సంప్రదించడం, వెంటపడటం, దూషించడం, అవమానించడం, వేధించడం తీవ్రమైన నేరాలు.. అందుకు గరిష్టంగా ఐదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా
- ▲ **ఐపీసీ 509:** ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను తమ మాటలు, చేతలు, సైగల ద్వారా అవమానించడం, ఆమె గౌరవానికి భంగం కలిగించడం తీవ్రమైన నేరం. గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా
- ▲ **ఐపీసీ 306:** ఒకర్ని వేధించి ఆత్మహత్యకు పాల్పడేలా చేయడం. బాధ్యులకు గరిష్టంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా
- ▲ **ఐపీసీ 120ఎ:** ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది ఉద్దేశపూర్వకంగా ఒకరిని నేరుగా లేదా ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల ద్వారా వేధించడం తీవ్రమైన నేరం.
- ▲ **ఐపీసీ 504:** ఉద్దేశ పూర్వకంగా గౌరవానికి భంగం కలిగించడం తీవ్రమైన నేరం. రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా

ఫిర్యాదు ఇలా...

సైబర్ క్రైమ్ పోర్టల్:
https:// cybercrime. gov. in/
సైబర్ మిత్ర వాట్సాప్ నంబర్: 9121211100
సైబర్ బుల్లీయింగ్ 4ఎస్4యు: 9071666667

సామాన్యుల గొంతు నొక్కే కుట్ర

ప్రతిపక్షాలు అధికార పార్టీని విమర్శించవచ్చు... పథకాల్లో లోపాలను ప్రశ్నించవచ్చు. అందుకు విరుద్ధంగా పథకాలు, కార్యక్రమాల లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని వారిని వ్యక్తిగతంగా వేధించేందుకు బరితెగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విధానంపై ప్రశంసలు వ్యక్తమవడం ప్రతిపక్ష పార్టీలకు నచ్చలేదు. కాకినాడ జిల్లా బెండపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇంగ్లిష్‌లో అనర్గళంగా ప్రసంగించడంతో ఓర్వలేక వారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ, జనసేన నేతలు, సోషల్‌మీడియా విభాగాలు వేధింపులకు పాల్పడ్డాయి. అమెరికాలోని ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులనూ అదే రీతిలో వేధించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే ఆ రెండు పార్టీల లక్ష్యం. ఇంగ్లీష్ మీడియం చదువుల గురించి మాట్లాడకుండా చేయాలన్నదే కుతంత్రం.

ఇంగ్లిషులో మాట్లాడితే ఓర్వలేక..



ప్రభుత్వం ఇచ్చిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలతో అమెరికన్ స్లాంగ్‌లో అనర్గళంగా మాట్లాడిన బెండపూడి విద్యార్థినులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి జెడ్పీ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం' (ఎల్ఐపీ), ' లెర్న్ ఏ వర్డ్ ఏ డే' వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడే స్థాయికి వచ్చారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు అమెరికన్ యాక్సెంట్‌లో మాట్లాడడం నేర్పించారు. అమెరికాలోని అట్లాంటా, జార్జియా ప్రాంతాల్లో ఉన్న పిల్లలు, వారి స్నేహితులతో ఆన్‌లైన్‌లో విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. తోలెం మేఘన, తేజస్విని వంటి విద్యార్థినులు మెరికల్లా రాణించారు. అమెరికన్ యాసలో అనర్గళంగా మాట్లాడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇవి టీడీపీ నేతలకు కంటగింపుగా మారాయి. ఆ విద్యార్థినులకు వ్యతిరేకంగా ట్రోల్ చేయించారు. ఆ విద్యార్థినులు టెన్త్‌లో ఫెయిల్ అయ్యారంటూ టీడీపీ నేత అయ్యన్నపాత్రుడు నోరుపారేసుకున్నారు. ఆ విద్యార్థిని టెన్త్‌లో 478 మార్కులతో పాసైంది. ఆ విద్యార్థిని తల్లి తొండంగి పోలీసులకు 2022 జూన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు కూడా నమోదు చేశారు. మేఘనపై అసభ్యకర పదజాలంతో ట్రోలింగ్ చేశారు. ఆమె తల్లి తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ సెక్షన్ 509, ఐటీ యాక్ట్ 2020 సెక్షన్ 67 కింద ట్రోలర్స్‌పై అప్పటి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేశారు.

ఎగిసిపడుతున్న నిరసన జ్వాలలు

గీతాంజలి ఘటనపై సర్వత్రా ఆందోళన

- ఆ పసిపిల్లల జీవితాలు ఏం కావాలంటూ ప్రశ్న
- తీవ్రవాదుల కంటే ప్రమాదంగా ఐటీడీపీ
- రాక్షస మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఎస్వీయూ విద్యార్థుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ
- బెంగళూరులోనూ నిరసనలు
- టీడీపీ సోషల్ మీడియా పశువులను శిక్షించాలని సర్వత్రా డిమాండ్



తిరుపతిలో ఎస్వీయూ విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ



విశాఖ జిల్లా తగరపువలస అంబేద్కరు కూడలిలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన

తణుకు అర్బన్/ భీమవరం/ కాకినాడ క్రైం/ విజయవాడస్పోర్ట్స్/ కడప/ సాక్షి,నెట్‌వర్క్: గీతాంజలి మృతిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు తగ్గడం లేదు. బుధవారం నాడు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు టీడీపీ రాక్షస మూకలు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనలు చేపట్టారు. సోషల్ మీడియా హంతకులు ఇద్దరు పిల్లల తల్లిని నిర్దాక్షిణ్యంగా చంపేశారని ధ్వజమెత్తారు. కక్షగట్టి ఆమె ప్రాణాలను బలిగొన్నారని, రాజకీయ లబ్దే పరమావధిగా క్షోభకు గురిచేస్తూ పైశాచిక ఆనందాన్ని అనుభవించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదొంగలే పొట్టన పెట్టుకున్నారు.

గీతాంజలిని టీడీపీ పచ్చ దొంగలే పొట్టనపెట్టుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన తణుకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీపీ దొంగలు తీవ్రవాదుల కంటే ప్రమాదకరంగా మారారని దుయ్యబట్టారు. మహిళలు, బాలికలను వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిల్లో వేధించే వారికి కఠిన శిక్షలు తప్పవని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన న్యాయవాది ఎం.చిత్రభాను స్పష్టంచేశారు. మహిళలు మానసికంగా ధైర్యంతో అన్ని సమస్యలను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో మహిళల వేధింపుల పట్ల ధైర్యంగా 111పోలీసులకు ఫిర్యాదు చేయాలని భీమవరానికి చెందిన వైద్యురాలు మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి అన్నారు.

టీడీపీలో మహిళలకు గౌరవం ఎన్టీఆర్‌తోనే పోయింది

టీడీపీపి స్థాపించిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలోనే ఆ పార్టీలో మహిళలకు గౌరవం ఉండేదని డాక్టర్ నూరి పరి అన్నారు. ఆయన్ని వెన్ను పోటు పొడిచి ఈ లోకం నుంచి పంపించేసిన వ్యక్తులే ప్రస్తుతం ఆ పార్టీకి ఆధిపత్యం చెలాయిస్తూ ఆయన ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. పదో తరగతి విద్యార్థిని మేఘనని, ఇంగ్లిష్ ధారాళంగా మాట్లాడుతున్న మరో విద్యార్థినిని ఇదే విధంగా ట్రోల్ చేసి మానసిక హింసకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గీతాంజలికేసులో అజయ్ సత్య అనే టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తపై రాష్ట్రప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి కారకులైన వారిని శిక్షించాలని అన్నమయ్య జిల్లా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సతీమణి శిల్పా నాగినిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా కోరారు. వందలాది మంది మహిళలతో కలిసి ఆమె బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్వీయూ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థినులతో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

రాక్షసుల వేధింపులకు బలైపోయిన ఆడబిడ్డ

గీతాంజలి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా రాక్షసుల వేధింపులకు బలైపోయిన విశ్వబ్రాహ్మణ జాతి ఆడ బిడ్డ గీతాంజలిని బలి తీసుకున్న టీడీపీ, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులందరూ తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. గీతాంజలికి పట్టిన దుర్గతి భవిష్యత్‌లో మరొకరికి జరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తనకు లబ్ధి జరిగిన సంతోషాన్ని పంచుకుంటేనే టీడీపీ జనసేన నేతలు ఓర్వలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

మదనపల్లెలో కొవ్వొత్తుల ప్రదర్శన



టీడీపీ, జనసేన స్వార్థ రాజకీయాలకు, ఆయా పార్టీల సోషల్ మీడియా రాబందుల వికృతచేష్టలకు నిండుప్రాణం బలికావడం విచారకరమని అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. వుయ్ స్టాండ్ విత్ గీతాంజలి కార్యక్రమంలో ఆమెకు ఆత్మశాంతి కలగాలని కోరుతూ బెంగళూరు బస్టాండులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని హెడ్‌పోస్టాఫీసు వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

తెనాలిలో స్వర్ణకార దుకాణాల బంద్



గీతాంజలి మృతికి సంతాపంగా బుధవారం తెనాలిలో స్వర్ణకారులు బంద్ పాటించారు. పట్టణ నడిబొడ్డులోని వెయ్యికి పైగా స్వర్ణకార దుకాణాలను మూసివేశారు. శ్రీకామాక్షీ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో వందలాది కార్మికులు మాజేటి నాగేశ్వరరావు వీధిలోని అసోసియేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గీతాంజలి జోహార్ అంటూ నినాదాలు చేశారు. సోషల్ మీడియా దౌర్జన్యానికి బలైన గీతాంజలి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించటంపై హర్షం వ్యక్తంచేశారు.



కడప హెడ్‌పోస్టాఫీస్ వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కొవ్వొత్తుల ర్యాలీ




నంద్యాలలో మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

కొత్తదారి

కార్పొరేట్ ప్రపంచంలో మూడు దశాబ్దాల పాటు పనిచేసిన హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన సీమా సేథ్ ఇక ఆ రంగంలో మరింత ముందుకు వెళ్లాలనుకోలేదు. ఒకసారి వెనక్కి తిరిగి చూసింది. ఒక రోజు ఒక ఆటోడ్రైవర్‌తో మాట్లాడుతున్నప్పుడు చదువుకు దూరమైన నిరుపేద పిల్లల గురించి తెలుసుకుంది. ఈ క్రమంలో కార్పొరేట్ ప్రపంచాన్ని వదిలి 'నయీ దిశ' పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి కొత్త దారిలో ప్రయాణిస్తోంది. అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలను విద్యావంతులను చేస్తోంది. తాను కూడా టీచర్‌గా మారి పిల్లలకు పాఠాలు చెబుతోంది....


సీమా సేథ్



కార్పొరేట్ రంగం నుంచి కార్మిక లోకానికి...

'ఇంజినీర్ కావాలనేది నా లక్ష్యం' అంటున్న బప్పన్ దాస్ 'నయీ దిశ' గురించి ఎంతో గొప్పగా మాట్లాడుతాడు. బప్పన్ తొమ్మిది నెలల వయసు ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఉపాధి వెదుక్కుంటూ పశ్చిమ బెంగాల్ నుంచి గురుగ్రామ్‌కు వచ్చారు. 'ఈరోజు తిండి దొరికేతే చాలు' అన్నట్లుగా ఉండేది వారి ఆర్థిక పరిస్థితి. దీంతో చదువు మాట అటుంచి బప్పన్ కనీసం బడి ముఖం కూడా చూడలేకపోయాడు.

'నయీ దిశ' పుణ్యమా అని బప్పన్ ఎనిమిది సంవత్సరాల వయసులో బడిలోకి అడుగు పెట్టాడు.

'సీమా మేడమ్ నుంచి పాఠాలు వినడమే కాదు ఆమెతో కలిసి ఆడుకున్నాం. సరదాగా ఎన్నో ప్రాంతాలు తిరిగాం' అంటాడు బప్పన్.

బడి అంటే భయపడే స్థితి నుంచి బడికి ఇష్టంగా వెళ్లడం వరకు బప్పన్‌ను మార్చివేసింది సీమ.

'నిరుపేద పిల్లల జీవితాల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఒక మార్గం మరో మార్గంలోకి తీసుకువెళ్లి మరిన్ని మంచిపనులు చేయిస్తుంది' అంటుంది సీమ.

ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం సికిందర్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి పిల్లలకు ఇంగ్లీష్ పాఠాలు బోధించేది. ఈ పని తనకు ఎంతో ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చేది. తనను రోజూ స్కూల్‌కు తీసుకెళ్లే ఆటోడ్రైవర్ 'పిల్లలకు పాఠాలు చెప్పడానికి డబ్బులు తీసుకుంటారా?' అని అడిగాడు.

'లేదు' అని చెప్పింది సీమ.

తాను ఉండే కాలనీ పేరు చెప్పి 'అక్కడ చాలా మంది పిల్లలు బడికి వెళ్లడం లేదు' అని చెప్పాడు.

'ఎందుకు?' అని అడిగింది సీమ.

'పిల్లలను బడికి పంపించే స్తోమత తల్లిదండ్రులకు లేదు' అని చెప్పాడు ఆటోడ్రైవర్. ఆ తరువాత...

'మేడమ్... మీరు అక్కడ స్కూల్ పెట్టండి. ఎంతో మంది పిల్లలు చదువుకొని బాగుపడతారు' అన్నాడు ఆటోడ్రైవర్.

సీమ ఆలోచనలో పడింది.

ఆ తరువాత ఆసక్తి పెరిగింది. 'మీ కాలనీలో స్కూల్ ఎక్కడ స్టార్ట్ చేయాలో చెబితే అక్కడే చేస్తాను' అన్నది సీమ. ఆటోడ్రైవర్ నివసించే పేద ప్రజల కాలనీలో ఒక గోదాములో సీమ స్కూల్ స్టార్ట్ చేసింది. 35 మంది పిల్లలతో 'నయీ దిశ' ప్రస్థానం మొదలైంది. కొద్దిమంది పిల్లలతో ఒక గదిలో మొదలైన స్కూల్ ఆ తరువాత వందమంది పిల్లలతో ఎనిమిది గదుల్లోకి విస్తరించింది.

గురుగ్రామ్‌లోని వివిధ కళాశాలలలో చదివే విద్యార్థులు ఈ స్కూల్‌కు వచ్చి కంప్యూటర్ నుంచి థియేటర్ వరకు ఎన్నో విషయాలు బోధిస్తున్నారు. విద్యాసంబంధమైన కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా 'నయీ దిశ' కేంద్రంగా మారింది.

> **వినే వారు తప్పకుండా ఉంటారు**
> మన మనసులో మంచి ఆలోచన ఉన్నప్పుడు, అది వినడానికి ఈ విశ్వంలో ఎవరో ఒకరు తప్పనిసరిగా ఉంటారు. 'ఆలోచన బాగానే ఉంది గానీ.. అసలు ఇది నెరవేరుతుందా...' అనుకున్న ఎన్నో ఆలోచనలు నెరవేరాయి. మంచి పని కోసం ప్రయాణం ప్రారంభించినప్పుడు దారే తన వెంట తీసుకువెళుతుంది. ఎన్ని అవరోధాలు ఉన్నా వాటంతట అవే తొలగిపోతాయి.
> – సీమ, నయీ దిశ–వ్యవస్థాపకురాలు

'నయీ దిశ' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతో మంది నిరుపేద పిల్లలకు అకాడమిక్ పునాదిని ఏర్పాటు చేసింది సీమ. ఇప్పుడు ఆ పునాది మీదే పిల్లలు ఎన్నో కలలు కంటున్నారు.

'తమ పిల్లల్లో వచ్చిన మార్పును చూసి తల్లిదండ్రులు సంతోషించారు. నయీ దిశ పిల్లలకు ఎంత విలువ ఇస్తుందో దగ్గరనుంచి చూశారు. పిల్లలకు బడి అంటే స్వేచ్ఛ అనుకునేలా చేశాం. పిల్లలు తమ మనసులోని భావాలను అందంగా వ్యక్తీకరించడం నుంచి ఇంగ్లీష్‌లో మాట్లాడడం వరకు ప్రతి క్షణం అభ్యాస వేడుకే' అంటుంది సీమ.

'మొదటి నుంచీ పిల్లలకు ఎన్నో సబ్జెక్ట్‌లు బోధిస్తూ వారి ఎదుగుదలను చూశాను. మొదట్లో క్రమశిక్షణా రాహిత్యంతో ఉండే పిల్లలు... కాలక్రమేణా మాట, మర్యాద నేర్చుకున్నారు' అంటుంది 'నయి దిశ' స్కూల్లో పని చేస్తున్న నిషా అనే టీచర్.

'నయీ దిశ' విజయంతో ఇందిరా కాలనీలో మరో స్కూల్‌ను ప్రారంభించించి సీమ. ఈ స్కూల్‌లో 65 మంది నిరుపేద పిల్లలు చదువుకుంటున్నారు.

సిలబస్‌ను సరిగ్గా అనుసరిస్తున్నారో లేదో తెలుసుకోవడానికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడానికి నెలకొకసారి టీచర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతి నెల పేరెంట్స్–టీచర్ మీటింగ్ కూడా ఉంటుంది.

'మా అబ్బాయికి చదువు పట్ల ఉండే శ్రద్ధ చూస్తుంటే ముచ్చట వేస్తోంది. ఇదంతా నయీ దిశ పుణ్యమే. డాక్టర్ కావాలనేది మా అబ్బాయి కల. పదిమందికి ఉపయోగపడే కల కంటే అది తప్పక నెరవేరుతుంది అని సీమ మేడమ్ ఒక మీటింగ్‌లో చెప్పారు' అంటున్నాడు అశోక్‌రావు అనే పేరెంట్.

మార్పు

చరిత్రను తిరగరాశారు రంగస్థలానికి కొత్త వెలుగు తెచ్చారు

తమిళనాడులోని పురాతన నృత్య–నాటక రూపం 'కట్టైకుట్టు'లో మహిళల ప్రాతినిధ్యం ఏ రకంగానూ ఉండేది కాదు. 'కట్టైకుట్టు' అంటే 'పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం'గా ఉన్న పేరును భారతి తమిళవనన్ బృందం మార్చే ప్రయత్నం చేస్తోంది. 'కట్టైకుట్టు'కు సంబంధించి నటన, సాంకేతికత, సంగీతం, దర్శకత్వం లాంటి వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తోంది. ఎంతో మంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇస్తోంది....


'కట్టైకుట్టు' కళా ప్రదర్శన

కాంచీపురంలో 33 సంవత్సరాల క్రితం ప్రారంభమైన 'కట్టైకుట్టు సంఘం' పురాతన కళాసంప్రదాయం అయిన కట్టైకుట్టును సజీవంగా ఉంచడానికి అంకితం అయింది. ఆ పురాతన కళారూపాన్ని ఈ తరానికి పరిచయం చేయడంతోపాటు 'ఈ కళలో మహిళలు అద్భుతాలు సృష్టించగలరు' అని నిరూపించింది.

'కట్టైకుట్టు నేర్చుకోవడానికి ఆడా, మగా తేడా లేదు. కులం, మతం అడ్డు కాదు అని చెప్పాలనుకున్నాం' అంటారు కట్టైకుట్టు నిర్వాహకులు.

'కట్టైకుట్టు' ప్రదర్శన ఆషామాషీ కాదు. ఖరీదైన అలంకరణతో కూడిన ఓపెన్–ఎయిర్ ప్రదర్శన.సంగీతం, పాటలు, మాటలను ఏకతాటిపైకి తెచ్చి ప్రేక్షకులను రంజింప చేయాలి.

'ఇంత క్లిష్టమైన కళకు మహిళలు అర్హులు కాదు' అనే భావనను 'కట్టైకుట్టు సంఘం' తొలగించింది. మహిళల అద్భుత కళాప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చింది. మొదట్లో మహిళలను రంగస్థలం మీదికి తీసుకురావడం అనేది అంత తేలిగ్గా జరగలేదు. పురుషులతో కలిసి నటించడానికి కొందరు మహిళలు నిరాకరించారు. కొందరు ఒప్పుకున్నా వారి తల్లిదండ్రులు అభ్యంతర పెట్టారు.

'ఇదేమైనా ప్రభుత్వ ఉద్యోగమా! తినడానికి తిండి కూడా దొరకదు' అని కొందరు నిట్టూర్చారు.

అయితే ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ కళాప్రియులైన మహిళలను రంగస్థలం మీదికి తీసుకురాగలిగారు.

వారిలో నిండైన ఆత్మవిశ్వాసాన్ని నింపగలిగారు.

'మీరొక చారిత్రక ఘట్టంలో భాగం అవుతున్నారు' అని చెప్పారు.

ఆ మహిళా కళాకారులు చారిత్రక ఘట్టంలో భాగం కావడమే కాదు చరిత్రను తిరగ రాశారు.'కట్టైకుట్టు'కు కొత్త వెలుగు తీసుకువచ్చారు.

'కట్టైకుట్టు' సంఘంలోని వారందరూ వివాహిత మహిళలే. డిగ్రీ పూర్తి చేసిన వారే.

'బాడీ మూమెంట్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్, ఒక పెద్ద డైలాగ్‌ను సంగీతంతో మిళితం చేసే విధానంతో కూడిన కట్టైకుట్టు కళారూపాన్ని మహిళా కళాకారులు కూడా అద్భుతంగా చేయగలరని నిరూపించాం' అంటుంది భారతి తమిళవనన్. ఆమె గత పన్నెండు సంవత్సరాలుగా 'కట్టైకుట్టు' ప్రదర్శనలు ఇస్తోంది. ఎంతోమంది మహిళలకు నేర్పిస్తోంది.

భారతి కళాకారుల కుటుంబం నుంచి రాలేదు. తన స్వగ్రామం వేలూరులో కట్టైకుట్టు కళాకారులను చూస్తూ పెరిగింది,

'ప్రదర్శన కోసం వేరే గ్రామాలకు వెళ్లినప్పుడు పురుషులు మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడతారు. అలాంటి వారికి మేము మా ప్రతిభతోనే తగిన సమాధానం చెబుతాం. మహిళలు చేయలేరు అన్నవారే ప్రదర్శన తరువాత మమ్మల్ని ప్రశంసించడం మరిచిపోలేని విషయం' అంటుంది తమిళి జ్వానసన్. వివాహ సమయంలో తప్ప ప్రదర్శనకు ఎప్పుడూ సెలవు ఇవ్వలేదు తమిళి జ్వానసన్.

ప్రముఖ కళాకారిణి సంగీత ఈశ్వర్ దగ్గర కట్టైకుట్టు, భరతనాట్యం నేర్చుకున్న తిలగావతి పళని 'శ్రీకృష్ణ కట్టైకుట్టు కుజు' పేరుతో స్వంత కట్టైకుట్టు పాఠశాలను నడుపుతోంది.

'కట్టైకుట్టు కళాకారులు నిరక్షరాస్యులు , మహిళలు ఈ కళారూపానికి తగరు...లాంటి ఎన్నో అపోహలను బద్దలు కొట్టాం' అంటుంది పళని. ప్రస్తుతం ఆమె తన పాఠశాల ద్వారా 65 మంది విద్యార్థులకు 'కట్టైకుట్టు'లో శిక్షణ ఇస్తోంది.

ప్రతిష్ఠాత్మకమైన 'కట్టైకుట్టు గురుకులం' ద్వారా గ్రామీణ ప్రాంతంలోని పిల్లలకు 'కట్టైకుట్టు'లో శిక్షణ ఇస్తోంది కట్టైకుట్టు సంఘం. వీరిలో నుంచి భారతి లాంటి ఎంతో మంది అద్భుత కళాకారులు రంగస్థల ప్రపంచానికి పరిచయం కావచ్చు. ప్రతి సంవత్సరం 'కట్టైకుట్టు సంఘం' కాంచీపురంలో పెద్ద ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచం నలుమూలల ఉన్న కళాభిమానులను ఈ ఉత్సవం ఆకట్టుకుంటోంది.



> **ఎన్నో అవరోధాలు అధిగమించి...**
> మా ఊళ్లో కట్టైకుట్టు కళాకారులను చూస్తూ పెరిగాను. నేను కూడా వారిలాగా చేయాలి అని కలలు కనేదాన్ని. అయితే పెరిగి పెద్దయ్యే క్రమంలో కట్టైకుట్టు రంగస్థలంపై అడుగు పెట్టడానికి ఎన్ని అవరోధాలు ఉన్నాయో తెలిసింది. అయినా సరే, ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లాను. తల్లిదండ్రులు ప్రోత్సహించారే తప్ప అభ్యంతర పెట్టలేదు. ఈ పురాతన కళారూపంలోకి మరింత మంది మహిళలు రావాలని కోరుకుంటున్నాను.
> – భారతి తమిళవనన్

దివ్యమైన విజయం

స్త్రీల కలలు తరచు సామాజిక నిబంధనల మధ్య పరిమితం అవుతుంటాయి. అలాంటి ప్రపంచంలో అనీ దివ్య అసమానతలను ధిక్కరించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంది. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలో పుట్టి, విజయవాడలో పెరిగిన అనీ దివ్య... బోయింగ్ 777 ను నడిపి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా కమాండర్‌గా పేరు పొందింది. 'మహిళా కమాండర్లలో అతి పిన్నవయస్కురాలిగా చేరాలని కలలు కనలేదు. కానీ, అభిరుచి, అంకితభావం ఆమె కలను సాకారం చేశాయి' అని చెప్పే ముప్పై ఏడేళ్ల దివ్య... మహిళా శక్తి అంటే ఏమిటో తన విజయగాథ ద్వారా మనకు పరిచయం చేస్తుంది.


అనీ దివ్య

'అమ్మాయిలు పెద్దగా కలలు కనడానికి వీలులేని ప్రదేశం నుండి వచ్చాను' అని చెప్పే దివ్య 11వ తరగతి వరకు సాధారణ విద్యార్థిని. ఆమె తన కలను సాకారం చేసుకోవడానికి 90 శాతం కంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేయడం తప్పనిసరి అని తెలుసుకుంది. అడ్డంకులను అధిగమించాలని నిశ్చయించుకుని, సవాల్‌ను ఎదుర్కొంది. అదే సంవత్సరంలో అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు స్కోర్ చేసింది. దీంతో ఆమె కలలు స్పష్టంగా ఉన్నాయి అని కుటుంబ సభ్యులకూ అర్థమైంది. కానీ, ముందుకు వెళ్లే మార్గం సులభంగా లేదు. అందుకు తగినంత ఖర్చు పెట్టే ఆర్థిక స్తోమత ఆమె కుటుంబానికి లేదు. కానీ, ఆమె తండ్రి ఫ్లయింగ్ స్కూల్ ఫీజు కోసం రుణం తీసుకున్నాడు. దీంతో ఆమె అసలు ప్రయాణం మొదలైంది. 17 ఏళ్ల వయసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ ఫ్లయింగ్ స్కూల్‌లో చేరింది. 19 ఏళ్ల వయసులో కమర్షియల్ లైసెన్స్ పొందిన అతి పిన్న వయస్కురాలైన మహిళా పైలట్‌గా నిలిచింది. ట్రైనింగ్ పూర్తయ్యాక ఎయిర్ ఇండియాలో కో–పైలట్‌గా చేరింది. 21 ఏళ్ల వయసులో ట్రైనింగ్ కోసం లండన్‌కు వెళ్లింది. అక్కడ ఆమె బోయింగ్ 777ను నడపడం ప్రారంభించింది. పైలట్‌గానే కాదు కెప్టెన్ దివ్య మోటివేషనల్ స్పీకర్ కూడా. విమానయాన రంగంలో తన అనుభవాలు, సవాళ్లను వేదికలపై స్పీచ్‌లుగా ఇచ్చింది. ముంబై రిజ్వీ లా కాలేజీ నుండి ఎల్ఎల్‌బీ పట్టా కూడా పొందింది.

ఎగతాళి చేసేవారు

''నాన్న ఆర్మీలో ఉద్యోగి అవడంతో మా కుటుంబం పఠాన్‌కోట్‌లో ఉండేది. నేను అక్కడే పుట్టాను. నాన్న వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని విజయవాడలో స్థిరపడ్డారు. అలా, నా స్కూల్ చదువు మొత్తం విజయవాడలోనే జరిగింది. చిన్నప్పటి నుంచి పైలట్ కావాలనే కోరిక ఉండేది. ఇది తెలిసి ఇతర పిల్లలు నన్ను ఎగతాళి చేసేవారు. పిల్లల్లో చాలామంది ఇంజనీరింగ్ లేదా డాక్టర్ కావాలనే అనుకునేవారు. అదృష్టవశాత్తు నా ఎంపికకు నా తల్లిదండ్రులు మద్దతు ఇచ్చారు. మా అమ్మ ఎప్పుడూ నన్ను ప్రోత్సహించేది. అయితే, పైలట్ కావాలనే నా నిర్ణయాన్ని బంధువులు, కుటుంబ స్నేహితులు వ్యతిరేకించేవారు. ఇది అమ్మాయిలకు తగిన వృత్తిగా అనుకునేవారు కాదు.

సవాల్‌గా తీసుకున్నాను..

ఇంగ్లీష్ రాయడం, చదవడం వచ్చు. కానీ, ఇంగ్లీషులో మాట్లాడటం అనేది సమస్యగా ఉండేది. దీంతో ట్రైనింగ్ కాలేజీలో చేరిన మొదటి రోజు నుంచీ తోటి వారి హేళనకు గురయ్యాను. ఒక చిన్న పట్టణం నుండి వెళ్లడం, ఇంగ్లీషులో పట్టులేకపోవడంతో మొదటి రోజు నుండి సవాళ్లు ఎదురయ్యాయి. చాలాసార్లు మా సీనియర్లు క్లాస్ బయటకు పిలిచి ర్యాగ్ చేసేవారు. ఈ సమస్యను అధిగమించాలంటే ముందు నా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనుకున్నాను. అందుకు సెలవుల్లో నాకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాను. ఆంగ్లంలో మాట్లాడటానికి మంచి పట్టు సాధించాను. ట్రైనింగ్ పూర్తయ్యే సమయానికి స్కాలర్‌షిప్ కూడా వచ్చింది.

సాధించినప్పుడే మన శక్తి బయటకు తెలుస్తుంది

ప్రపంచంలోనే బి777 మహిళా కమాండర్లలో అతి పిన్న వయస్కురాలిగా పేరు తెచ్చుకున్నందుకు గర్వంగా ఉంది. నడిచొచ్చిన దారిని చూసుకుంటే అన్నింటిని ఎలా అధిగమించాను అనే ఆశ్చర్యం కలుగుతుంది. నిజానికి ఎవరి ప్రయాణమూ అంత సాఫీగా సాగదు. ఎత్తుపల్లాలు ఉండనే ఉంటాయి. ఆ కష్టాలను దాటుకొని వచ్చినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. మనలోని ఆత్మ విశ్వాసం బయటకు కనిపిస్తుంది. కలలు సామాజిక అంచనాలకు, ఆర్థిక పరిమితులకు పరిమితం కాదని ఆ శక్తి గుర్తు చేస్తుంది. ఒక చిన్న పట్టణం నుండి ఏవియేషన్ కమాండింగ్ ఎత్తుల వరకు ఎదగడంలో నా బలహీనతలపై చాలా పోరాటం చేశాను'' అని వివరిస్తుంది కెప్టెన్ అనీ దివ్య.

బ్యూటిప్స్

ఇలా చేయండి... ఈ ఒక్కటీ చాలు...

కొంతమంది స్కిన్ చాలా మెరిసిపోతుంది. మరి కొంతమందికి మాత్రం డ్రై స్కిన్, మొటిమలు, టాన్, పిగ్మంటేషన్, మచ్చలు, డల్ స్కిన్ వంటి సమస్యలు ఉంటాయి. వీటి వల్ల చాలా మంది సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కోల్పతారు. నలుగురిలోకి వెళ్లలేరు. అయితే, విటమిన్ ఇ చర్మానికి సంబంధించిన అనేక సమస్యల్ని దూరం చేస్తుంది. మరి దీనిని ఎలా అప్లై చేయాలి. అప్లై చేస్తే ఏయే లాభాలు ఉన్నాయో తెలుసుకోండి.




చర్మ సమస్యలకి విటమిన్ ఇ చక్కటి ఉపశమనం. ఇందుకోసం టీ స్పూన్ బొప్పాయి జ్యూస్, టీ స్పూన్ రోజ్ వాటర్‌ని తీసుకోవాలి. అందులోనే విటమిన్ ఇ ఆయిల్ కలిపి ముఖానికి పట్టించాలి. 20 నిమిషాల తర్వాత క్లీన్ చేయాలి. దీనివల్ల ముఖం కాంతివంతంగా, మృదువుగా మారుతుంది.







స్కిన్ టోన్ పెరగడానికి: కొద్దిగా విటమిన్ ఇ ఆయిల్‌ని అంతే పరిమాణంలో పెరుగు, గుడ్డుతో కలపండి. దీనిని బాగా మిక్స్ చేయండి. దీనిని బాగా కలిపి ముఖానికి అప్లై చేసి మృదువుగా మసాజ్ చేయండి. తర్వాత శుభ్రం చేయండి. ముఖం మెరిసిపోతుంది.

విటమిన్ ఈ ఆయిల్‌ని కలబందతో కలిపి కూడా వాడొచ్చు. దీనివల్ల ముఖం మెరిసిపోతుంది. కాంతిమంతంగా మారుతుంది.

టీ స్పూన్ పరిమాణంలో గ్రీన్ టీ తీసుకోండి. అందులోనే తేనె కూడా వేయండి. తర్వాత కొద్దిగా విటమిన్ ఇ ఆయిల్ వేయండి. వీటన్నింటిని కలిపి ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. దీనివల్ల ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి.



ఇంటిప్స్

మురికిని ఇలా వదిలించండి



- వాటర్ బాటిల్‌లో సగం వరకు నీళ్లుపోయాలి. మిగతా సగంలో నిమ్మకాయ ముక్కలు, ఉప్పు, ఐస్ ముక్కలను వేసి బాగా షేక్ చేయాలి. ఇలా పది నిమిషాలు చేసిన తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఈ విధానంలో బాటిల్ కడగడం వల్ల బాటిల్‌లో సూక్ష్మజీవులు పూర్తిగా పోతాయి.
- టీస్పూను వంటసోడా, రెండు టీస్పూన్ల వెనిగర్‌ను బాటిల్‌లో వేసి మూతపెట్టాలి. ఇరవై నిమిషాల తరువాత బాటిల్‌ను బాగా షేక్ చేసి కడగాలి. ఇలా కడిగిన బాటిల్‌ను మూతతీసి పూర్తిగా ఆరిన తరువాత వాడుకోవాలి.
- వంటసోడా, వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా మాడిన గిన్నె, ఫ్రైపాన్‌పై రాసి ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత డిష్‌వాషర్‌తో రుద్ది కడిగితే మురికి మొత్తం తొలగి పోతుంది.
- గోరువెచ్చని పాలల్లో రెండు టీస్పూన్ల పెరుగు వేసి కలపాలి. పాలల్లో ఈ మిశ్రమం వేసి, వడలను వేసి ఐదారు గంటలు నానపెడితే పెరుగు చక్కగా తోడుకుంటుంది. ఇప్పుడు ఈ వడలకు తాలింపు వేసి తింటే పెరుగు వడలు చాలా రుచిగా ఉంటాయి.



పెరుగు లేనప్పుడు ఇలా చేస్తే పెరుగు పులవకుండా పెరుగు వడలు రుచిగా వస్తాయి.

- వేడినీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేస్తే ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్డసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో రష్మిక, సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ క్రీడాకారిణులు శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఇండోర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 1-0తో టాప్ సీడ్ ఇరీనా మరియా (రొమేనియా)పై ... సహజ 6-3, 6-1తో జీల్ దేశాయ్‌పై గెలిచారు. రష్మికతో మ్యాచ్‌లో రెండో సెట్ మధ్యలో గాయంతో ఇరీనా వైదొలిగింది.

భారత హాకీ జట్టు శిక్షణ బృందంలో ప్యాడీ ఆప్టన్

పారిస్ ఒలింపిక్స్ సమయంలో భారత పురుషుల హాకీ జట్టు సభ్యుల మానసిక దృఢత్వం కోసం... దక్షిణాఫ్రికాకు చెందిన విఖ్యాత మెంటల్ కండీషనింగ్ కోచ్ ప్యాడీ ఆప్టన్ సేవలు తీసుకోవాలని హాకీ ఇండియా నిర్ణయం తీసుకుంది. 2011లో వన్డే ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన భారత క్రికెట్ జట్టుకు ప్యాడీ ఆప్టన్ మెంటల్ కండీషనింగ్ కోచ్‌గా ఉన్నారు. ఇటీవల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా క్రీడల సమయంలోనూ ఆప్టన్ భారత హాకీ జట్టు వెంబడి ఉన్నారు.





సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 21-18, 21-14తో 2019 చాంపియన్ జోడీ మొహమ్మద్ అసన్-హెంద్రా సెతియావాన్ (ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 2022 విజేత జోడీ మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రి-బగాస్ మౌలానా (ఇండోనేసియా)తో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది.

లక్ష్య సేన్ బోణీ



మరోవైపు పురుషుల సింగిల్స్‌లో 2022 రన్నరప్, భారత స్టార్ లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-14, 21-14తో ప్రపంచ 33వ ర్యాంకర్ మాగ్నస్ జొహాన్సన్ (డెన్మార్క్)పై విజయం సాధించాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్‌కు నిరాశ ఎదురైంది. చికో ఔరా ద్వి వర్దాయో (ఇండోనేసియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రియాన్షు 19-21, 21-11, 9-21తో ఓడిపోయాడు. మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ ముందంజ వేయగా... గత ఏడాది సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జంట ఈసారి తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. అశ్విని-తనీషా ద్వయం 21-13, 21-18తో యెంగ్ ఎన్గా టింగ్-యెంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) జోడీపై నెగ్గింది. గాయత్రి-ట్రెసా జోడీ 18-21, 12-21తో అప్రియాని రహాయు-సితీ ఫాదియా (ఇండోనేసియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో ఘన విజయం

- 7 వికెట్లతో గుజరాత్ జెయింట్స్ ఓటమి
- రేపు ముంబై, బెంగళూరు మధ్య ఎలిమినేటర్

న్యూఢిల్లీ: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో ఏడాది తుది పోరుకు అర్హత సాధించింది. గ్రూప్ దశలో ఆడిన 8 మ్యాచ్‌లలో 6 గెలిచిన ఢిల్లీ 12 పాయింట్లతో టాపర్‌గా ఫైనల్‌కు చేరుకుంది. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో పట్టికలో చివరి స్థానంతో గుజరాత్ ఈ సీజన్‌ను ముగించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులే చేసింది. భారతి ఫుల్‌మలి (36 బంతుల్లో 42; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...కాథరీన్ బ్రైస్ (22 బంతుల్లో 28 నాటౌట్; 4 ఫోర్లు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (21 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఒకదశలో జట్టు స్కోరు 48/5 కాగా... భారతి, బ్రైస్ ఆరో వికెట్‌కు 50 బంతుల్లో 68 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఢిల్లీ బౌలర్లలో మిన్ను మణి, మరిజాన్ కాప్, శిఖా పాండే తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 13.1 ఓవర్లలో 3 వికెట్లకు 129 పరుగులు సాధించి గెలిచింది. ఓపెనర్ షఫాలీ వర్మ (37 బంతుల్లో 71; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు వేగంలో అర్ధసెంచరీ సాధించగా... జెమీమా రోడ్రిగ్స్ (28 బంతుల్లో 38 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి జోరు ప్రదర్శించింది. షఫాలీ, జెమీమా మూడో వికెట్‌కు 55 బంతుల్లోనే 94 పరుగులు జత చేశారు. విజయానికి 2 పరుగుల దూరంలో షఫాలీ వెనుదిరిగినా... జెమీమా ఫోర్ కొట్టడంతో మరో 41 బంతులు మిగిలి ఉండగానే క్యాపిటల్స్ జట్టుకు గెలుపు దక్కింది. ఫైనల్లో ఢిల్లీ ప్రత్యర్థిని నిర్ణయించే 'ఎలిమినేటర్' మ్యాచ్ రేపు జరుగుతుంది. గత ఏడాది చాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'ఎలిమినేటర్' పోరులో తలపడనున్నాయి. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరగ్గా... చెరో మ్యాచ్‌లో విజయం సాధించి సమఉజ్జీలుగా నిలిచాయి. ఆదివారం జరిగే ఫైనల్‌తో డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ ముగుస్తుంది.



షఫాలీ వర్మ

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
ఢిల్లీ	8	6	2	12	1.198
ముంబై	8	5	3	10	0.024
బెంగళూరు	8	4	4	8	0.306
యూపీ	8	3	5	6	-0.371
గుజరాత్	8	2	6	4	-1.158

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ముంబైకు టైటిల్ లాంఛనమే!

రెండో ఇన్నింగ్స్‌లో పోరాడుతున్న విదర్భ • కరుణ్ నాయర్, అక్షయ్ అర్ధ సెంచరీలు

ముంబై: అత్యద్భుతం జరిగితే తప్పించి... ముంబై జట్టు 42వసారి రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలవడం లాంఛనం కానుంది. ముంబై నిర్దేశించిన 538 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన విదర్భ జట్టు బ్యాటర్లు బుధవారం పట్టుదలతో ఆడారు. ముంబై బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు ఆట ముగిసే సమయానికి 92 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 248 పరుగులు సాధించింది. విదర్భ విజయం సాధించాలంటే మ్యాచ్ చివరిరోజు మరో 290 పరుగులు సాధించాలి. చేతిలో 5 వికెట్లు ఉన్నాయి. ఒకవేళ మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ముంబై జట్టును విజేతగా ప్రకటిస్తారు. నాలుగో రోజు ఆటలో విదర్భ బ్యాటర్లు కరుణ్ నాయర్ (220 బంతుల్లో 74; 3 ఫోర్లు), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (91 బంతుల్లో 56 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 90 పరుగులు జోడించారు. అంతకుముందు అథర్వ తైడె (64 బంతుల్లో 32; 4 ఫోర్లు), ధ్రువ్ షోరే (50 బంతుల్లో 28; 4 ఫోర్లు), అమన్ మోఖాడె (78 బంతుల్లో 32; 2 ఫోర్లు) కూడా ముంబై బౌలర్లకు అంత తొందరగా వికెట్ సమర్పించుకోకుండా క్రీజులో సాధ్యమైనంత ఎక్కువసేపు ఉండేందుకు ప్రయత్నించారు. విదర్భ కోల్పోయిన ఐదు వికెట్లు ముంబై స్పిన్నర్లకే లభించడం గమనార్హం.



కరుణ్ నాయర్

రచిన్‌కు 'హ్యాడ్లీ' అవార్డు



క్రైస్ట్‌చర్చ్: ప్రపంచ క్రికెట్‌లో ఇటీవల సంచలన ప్రదర్శనతో దూసుకొచ్చిన న్యూజిలాండ్ యువ ఆటగాడు రచిన్ రవీంద్రకు ఆ దేశపు బోర్డు నుంచి సముచిత గుర్తింపు దక్కింది. కివీస్ వార్షిక అవార్డుల్లో రచిన్ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి ప్రతిష్టాత్మక 'సర్ రిచర్డ్ హ్యాడ్లీ' పురస్కారాన్ని అందుకున్నాడు. అటు టెస్టు, ఇటు పరిమిత ఓవర్ల క్రికెట్‌లో గత ఏడాది కాలంలో 24 ఏళ్ల రచిన్ సంచలన ప్రదర్శన కనబర్చాడు. వన్డే వరల్డ్‌కప్‌లో 3 సెంచరీలు సహా 578 పరుగులు సాధించిన రచిన్... ఇటీవల దక్షిణాఫ్రికాపై టెస్టులో డబుల్ సెంచరీతో మెరిశాడు. అతి పిన్న వయసులో 'హ్యాడ్లీ అవార్డు' గెలుచుకున్న ప్లేయర్‌గా రచిన్ నిలిచాడు. న్యూజిలాండ్ 'టెస్టు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కేన్ విలియమ్సన్‌కు దక్కింది.

అగ్ర స్థానానికి అశ్విన్

ఆరోసారి నంబర్‌వన్‌గా ఆఫ్‌స్పిన్నర్ • ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లో మళ్లీ దూసుకుపోయాడు. తాజా టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 870 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్‌తో ధర్మశాలలో జరిగిన చివరి టెస్టులో 9 వికెట్లతో చెలరేగడంతో రెండో స్థానం నుంచి అశ్విన్ టాప్ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఈ స్టార్ బౌలర్ నంబర్‌వన్‌గా నిలవడం ఆరోసారి కావడం విశేషం. 2016 అక్టోబర్‌లో తొలిసారి ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న అశ్విన్ ఆ తర్వాత మరో నాలుగుసార్లు అగ్రస్థానాన్ని అలంకరించాడు. ఇప్పటి వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (847 పాయింట్లు) రెండో స్థానానికి పడిపోగా... రెండు స్థానాలు ఎగబాకిన ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జోష్ హాజల్‌వుడ్ (847) బుమ్రాతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. టాప్-10లో భారత్ నుంచి రవీంద్ర జడేజా (7వ స్థానం) కూడా ఉండగా... ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆకట్టుకున్న కుల్దీప్ యాదవ్ 31 నుంచి 15 స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉండటం విశేషం. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించిన కెప్టెన్ రోహిత్ శర్మ ఐదు స్థానాలు ఎగబాకి 5వ ర్యాంక్‌కు చేరుకోగా...యశస్వి జైస్వాల్ 10 నుంచి 8వ స్థానానికి పురోగతి సాధించాడు. మరో టాప్ ప్లేయర్ విరాట్ కోహ్లి ఇంగ్లండ్‌తో సిరీస్ మొత్తానికి దూరమైనా... ఒకటే ర్యాంక్ కోల్పోయి 9వ స్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, అశ్విన్ కూడా ఎలాంటి మార్పూ లేకుండా వరుసగా మొదటి, రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.



శరత్ సంచలనం

న్యూఢిల్లీ: సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్‌లో భారత స్టార్ ఆచంట శరత్ కమల్ సంచలన విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 88వ ర్యాంకర్ శరత్ కమల్ 8-11, 11-6, 11-8, 11-9తో ప్రపంచ 13వ ర్యాంకర్ డార్కో జోర్జిచ్ (స్లొవేనియా)ను బోల్తా కొట్టించాడు. మరోవైపు మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ (భారత్) జోడీ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఐహిక-సుతీర్థ ద్వయం 4-11, 14-12, 3-11, 9-11తో అడీనా (బెల్జియం)-మరియా జియావో (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోయింది.





ఐపీఎల్‌కు హ్యారీ బ్రూక్ దూరం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ నుంచి ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ వైదొలిగాడు. గత నెలలో తన బామ్మ కన్నుమూసిన నేపథ్యంలో కుటుంబసభ్యులతో ఉండాలని బ్రూక్ నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది మినీ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రూ. 4 కోట్లకు బ్రూక్‌ను కొనుగోలు చేసింది. గత ఐపీఎల్ సీజన్‌లో బ్రూక్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున 11 మ్యాచ్‌లు ఆడి కేవలం 190 పరుగులు సాధించాడు.

సినిమా

అరుదైన రికార్డ్



ప్రభాస్

హీరో ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. పాన్ ఇండియా స్థాయిలోనే కాదు.. పాన్ వరల్డ్ రేంజ్‌లో అభిమానులను అలరిస్తున్నారాయన. రేర్ కాంబినేషన్స్, రికార్డ్ స్థాయి బాక్సాఫీస్ నంబర్స్, భారీ పాన్ వరల్డ్ మూవీ లైనప్స్... ఇలా అన్ని అంశాల్లో ఎన్నో రికార్డులు, ఘనత సాధించిన ప్రభాస్ తాజాగా మరో అరుదైన రికార్డ్ సొంతం చేసుకున్నారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) టాప్ హ్యాష్ ట్యాగ్స్ ఆఫ్ ఇండియా లిస్టులో నిలిచిన ఏకైక హీరోగా రికార్డ్ సాధించారు ప్రభాస్. ట్విట్టర్ ఇండియా విడుదల చేసిన ఈ జాబితాలో ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో టాప్ 10 మోస్ట్ యూజ్డ్ హ్యాష్ ట్యాగ్స్‌లో ప్రభాస్ మాత్రమే చోటు దక్కించుకున్నారు. తమ అభిమాన హీరో సాధించిన ఈ క్రెడిట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు ప్రభాస్ ఫ్యాన్స్. ఇదిలా ఉంటే.. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం మే 9న విడుదల కానుంది. అలాగే మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' సినిమాలోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు ప్రభాస్. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న 'కన్నప్ప'లో కీలక పాత్ర చేస్తున్నారు. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్ 2', సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రాలు ఉన్నాయి. ఈ చిత్రాలషూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

బ్యాట్‌మేన్ ఆలస్యంగా వస్తాడు

బ్యాట్‌మేన్ విన్యాసాలను 'బ్యాట్‌మేన్'లో అద్భుతంగా చూపించారు దర్శకుడు మాట్ రీవ్స్. ఈ చిత్రం 2022లో రిలీజై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్ ప్రకటించినప్పటి నుంచి విడుదల కోసం బ్యాట్‌మేన్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. జెఫ్రీ రైట్, రాబర్ట్ ప్యాటిన్‌సన్, ఆండీ సెర్కిస్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2025 అక్టోబరులో రిలీజ్ చేయాలనుకున్నారు. ఇంకో ఏడాది ఆగాలా? అనుకున్న అభిమానులు మరింత నిరాశపడే చేదు వార్తను ఇచ్చింది 'బ్యాట్‌మేన్ 2' యూనిట్. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేయడంలేదు. 2026 అక్టోబరు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇలా 'బ్యాట్‌మేన్ 2' చిత్రం ఏకంగా ఏడాది ఆలస్యంగా థియేటర్స్‌కు రానుంది. కాగా కథ, స్క్రీన్ ప్లే విషయంలో దర్శకుడు మాట్ రీవ్స్ కొత్తగా కొన్ని మార్పులు అనుకున్నారని, వీటిని సెట్స్‌లో చిత్రీకరించేందుకు టైమ్ పడుతుందని, అందుకే 'బ్యాట్‌మేన్ 2' చిత్రం విడుదల వాయిదా పడిందని హాలీవుడ్ సమాచారం.



బ్యాట్‌మేన్ 2



రష్మికా మందన్నా

అంజలి



సూర్య

విద్యార్థులే కానీ...
వేసవి సెలవులు లేవు

వేసవి వస్తే విద్యార్థులు రిలాక్స్ అవుతారు. వేసవి సెలవులను ఆస్వాదిస్తారు. కానీ.. ఈ విద్యార్థులకు మాత్రం వేసవి సెలవులు లేవు. కాలేజీలకు వెళుతున్నారు. ఎందుకంటే వీళ్లు రియల్ స్టూడెంట్స్ కాదు.. రీల్ స్టూడెంట్స్. కొందరు స్టార్స్ ప్రస్తుతం స్టూడెంట్స్‌గా నటిస్తున్నారు. షూటింగ్ సెట్స్‌లో క్లాసులకు హాజరు అవుతున్నవారు కొందరైతే.. ప్రిపరేషన్ స్టూడెంట్స్ మరికొందరు. ఈ విద్యార్థుల గురించి తెలుసుకుందాం.

• కెరీర్‌లో పలు చిత్రాల్లో కాలేజ్ స్టూడెంట్‌గా నటించారు హీరో సూర్య. కానీ ఐదు పదుల వయసుకి చేరువ అవుతున్న టైమ్‌లో కూడా కాలేజీకి వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. 'సూరరై పోట్రు' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. స్టూడెంట్ నుంచి గ్యాంగ్‌స్టర్‌గా మారే ఓ వ్యక్తి జీవితం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందట. స్టూడెంట్ రోల్ కోసం ప్రస్తుతం సూర్య బరువు తగ్గుతున్నారని సమాచారం. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.

• కాలేజీ స్టూడెంట్ రోల్ హీరోయిన్ రష్మికా మందన్నాకు బాగా కలిసి వస్తుందని చెప్పొచ్చు. ఆ మాట కొస్తే... నటిగా రష్మికా మందన్నా కెరీర్ మొదలైంది కన్నడ హిట్ క్యాంపస్ డ్రామా 'కిర్రిక్ పార్టీ' సినిమాతోనే. అంతేకాదు...రష్మికా మందన్నా తెలుగు ఎంట్రీ మూవీ 'ఛలో'లోనూ, రెండో మూవీ 'గీత గోవిందం'లోనూ ఆమెది కాలేజీ స్టూడెంట్ రోల్. ఇలా కాలేజీ స్టూడెంట్‌గా రష్మికా మందన్నా చేసిన సినిమాలన్నీ దాదాపు సూపర్ హిట్స్. తాజాగా ఈ కోవలో రష్మికా మందన్నా చేస్తున్న చిత్రం 'ది గాళ్‌ఫ్రెండ్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా పీజీ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రోల్‌లో కనిపిస్తారని తెలిసింది. ఆమె బాయ్ ఫ్రెండ్‌గా దీక్షిత్ శెట్టి నటిస్తున్నారు. ఓ కాలేజీ స్టూడెంట్ తన ప్రేమను నెగ్గించుకునే క్రమంలో పడిన సంఘర్షణ నేపథ్యంతో ఈ సినిమా ఉంటుందట. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. 'చి..ల..సౌ'తో దర్శకుడిగా తొలి సినిమాతోనే హిట్ కొట్టిన రాహుల్ రవీంద్రన్ 'ది గాళ్ ఫ్రెండ్' సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజయ్యే చాన్స్ ఉంది.

• కాలేజీలో ఓ ఫెయిల్యూర్ స్టూడెంట్‌గా తెరపై శ్రీ విష్ణు కనిపించిన ప్రతిసారీ ఆయనకు మంచి పేరు వచ్చింది. 'నీదీ నాదీ ఒకే కథ', 'బ్రోచేవారెవరురా' వంటి సినిమాల్లో శ్రీ విష్ణు స్టూడెంట్‌గా నటించారు. మళ్లీ ఈ తరహా పాత్రలో శ్రీవిష్ణు హీరోగా నటించిన చిత్రం 'ఓం భీమ్ బుష్'. శ్రీవిష్ణుతో పాటు ఈ చిత్రంలో రాహుల్ రవీంద్రన్, ప్రియదర్శి ఇతర లీడ్ రోల్స్ చేశారు. ఓ యూనివర్సిటీలోని ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్ జీవితాలు ఓ ఘటనతో సడన్‌గా ఏ విధంగా మలుపు తిరిగాయి? అనే కోణంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమా ఫస్టాఫ్‌లో కాలేజీ సీన్స్ ఉంటాయి. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో వి సెల్యూలాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. స్టూడెంట్‌గా ఇన్నాళ్లూ సెట్‌లో బిజీగా ఉన్న శ్రీవిష్ణు ఇప్పుడు ఈ చిత్రం ప్రమోషన్స్‌తో బిజీగా ఉంటున్నారు.



శ్రీవిష్ణు

కాలేజీ స్టూడెంట్

• 'ఏవండీ.. (మృణాల్ ఠాకూర్).. రామచంద్రా.. (చిన్న వాయిస్‌తో విజయ్ దేవరకొండ).. నేను కాలేజ్‌కి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా? (మృణాల్ ఠాకూర్),.. ఒక లీటర్ పెట్రోల్ కొట్టిస్తే దించేస్తా..' (విజయ్ దేవరకొండ)...'ఫ్యామిలీస్టార్' సినిమాలోని డైలాగ్ ఇది. సో.. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కొన్ని సన్నివేశాల్లో కాలేజ్‌కి వెళతారని కన్ఫార్మ్ చేసుకోవచ్చు. 'గీత గోవిందం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. బాలీలో ఓ పాట చిత్రీకరిస్తే ఈ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

• 'ఇగై' సినిమా కోసం లా పాయింట్స్ చెబుతున్నారు అంజలి. ఎందుకంటే ఈ సినిమాలో అంజలి లా స్టూడెంట్. అశోక్ వేలాయుదం దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలో మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారు అంజలి. చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఈ నటీనటులే కాక.. మరికొందరు కూడా కాలేజ్ స్టూడెంట్ రోల్స్ చేస్తున్నారు.



మృణాల్ ఠాకూర్

బ్యాంకాక్‌లో కుబేర



నాగార్జున

ధనుష్, నాగార్జున అక్కినేని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్ యూనిట్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్‌ని బ్యాంకాక్‌లో ప్రారంభించారు. ''సరికొత్త కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'కుబేర'. బ్యాంకాక్‌లో ప్రారంభించిన షెడ్యూల్‌లో నాగార్జునతో పాటు మరికొందరు నటీనటులపై కొన్ని టాకీ, యాక్షన్ పార్ట్‌లు చిత్రీకరించనున్నాం. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ఇంతకుముందు ఎవరూ చూడని కొన్ని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుకుంటోంది. శివరాత్రి కానుకగా విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలీ నారంగ్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి.

ఆ దూరాన్ని వెయ్ దరువెయ్ తగ్గిస్తుంది

\- సాయిరామ్ శంకర్



''పూర్తి స్థాయి వినోదం, ఫ్యామిలీ డ్రామా, ఓ చిన్న సందేశం.. ఇలా అన్ని వాణిజ్య అంశాలతో 'వెయ్ దరువెయ్' సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పగలను. నా కెరీర్‌లో ఈ మధ్య గ్యాప్ వచ్చింది. ఆ దూరాన్ని 'వెయ్ దరువెయ్' తగ్గిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో సాయిరామ్ శంకర్ అన్నారు. నవీన్ రెడ్డి దర్శకత్వంలో సాయిరామ్ శంకర్, యషా శివకుమార్ జంటగా నటించిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో సాయి తేజ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''నవీన్ 'వెయ్ దరువెయ్' కథ చెప్పగానే నచ్చింది. ఇందులో నా పాత్ర చాలా సరదాగా ఉంటుంది. నాకు తప్పకుండా మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుందనిపించింది. ఈ సినిమాని 35 రోజుల్లోనే పూర్తి చేశామంటే ఆ క్రెడిట్ నిర్మాత, డైరెక్టర్, కెమెరామేన్‌లదే. పైగా నటీనటులందరూ అనుభవం ఉన్నవాళ్లు కావడం కూడా మరో కారణం. ఈ మూవీకి భీమ్స్‌గారి సంగీతం, నేపథ్య సంగీతం ప్లస్ అయింది. నా 20 ఏళ్ల సినీ ప్రయాణంలో విజయాలు, పరాజయాలూ ఉన్నాయి. ప్రస్తుతం ఆచితూచి మంచి కథలు ఎంచుకుంటున్నా. మా అన్నయ్య (పూరి జగన్నాథ్) దర్శకత్వంలో హీరోగా చేసే స్థాయికి నేనింకా చేరుకోలేదు. ఆ స్థాయి, ఆ స్టార్‌డమ్, నా మార్కెట్ పరిధి పెరిగినప్పుడు చేస్తాను. ప్రస్తుతం నేను నటించిన 'ఒక పథకం ప్రకారం, రీ సౌండ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

సాక్షి
బిజినెస్
గురువారం
14-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
906	338
72,762	21,997

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,229	▽ 35
డోజోన్స్	33,190	△ 184
ఎఫ్‌టీఎస్ఈ 100	7,772	△ 24
డాక్స్	17,961	▽ 4
షాంఘై	3,043	▽ 12
నికాయ్	38,969	▽ 102

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	65,335	▽ 231
బంగారం (99.5 స్వచ్ఛత)	65,073	▽ 230
వెండి (కేజీ)	72,469	▽ 206

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	81.23	84.52
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	103.88	108.33
€	యూరో	భారతీయ	88.65	92.70
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	46.00	66.00
AUS$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	52.71	56.92
S$	సింగపూర్ డాలర్	భారతీయ	60.07	64.30
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.19	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	21.67	23.45
¥	చైనా యువాన్	భారతీయ	10.39	12.38

పేటీఎంకు మరో షాక్

15లోగా వేరే బ్యాంకుల ఫాస్టాగ్‌లు తీసుకోండి: యూజర్లకు ఎన్‌హెచ్‌ఏఐ సూచన

న్యూఢిల్లీ: టోల్ ప్లాజాల దగ్గర ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తకుండా మార్చి 15లోగా ఇతర బ్యాంకుల నుంచి ఫాస్టాగ్‌లు తీసుకోవాలంటూ పేటీఎం ఫాస్టాగ్ యూజర్లకు నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) సూచించింది. తద్వారా జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు జరిమానాలు, డబుల్ ఫీజు చార్జీలను నివారించవచ్చని ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇతరత్రా సందేహాల నివృత్తి కోసం ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐహెచ్ఎంసీఎల్) వెబ్‌సైట్‌లోని ఎఫ్ఏక్యూ సెక్షన్‌ను సందర్శించాలని తెలిపింది. నిబంధనల ఉల్లంఘనల కారణంగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై (పీపీబీఎల్) రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్చి 15 తర్వాత నుంచి పేటీఎం ఫాస్టాగ్ యూజర్లు తమ ఖాతాలను రీచార్జ్ చేసుకునే వీలుండదు. అయితే, తమ ఖాతాల్లో బ్యాలెన్స్‌ను వాడుకోవచ్చు.

ఈ–స్కూటర్‌కు రూ.10,000

ఈ–త్రీవీలర్‌కు రూ.50,000 వరకు ● కేంద్ర నూతన ప్రోత్సాహక పథకం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర, త్రిచక్ర వాహనాల విక్రయాలను దేశవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని బుధవారం ప్రకటించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ టూవీలర్‌కు రూ.10,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తారు. సుమారు 3.33 లక్షల యూనిట్ల ఈ–టూవీలర్లకు మద్దతు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అలాగే ఈ–రిక్షా, ఈ–కార్ట్ కొనుగోలుకు రూ.25,000 వరకు, పెద్ద ఈ–త్రీవీలర్‌కు రూ.50,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం ఉంటుంది. 41,000 యూనిట్లకు ఈ స్కీమ్‌ను విస్తరిస్తారు. ఈ పథకం కోసం భారీ పరిశ్రమల శాఖ రూ.500 కోట్లను కేటాయించింది. 2024 ఏప్రిల్‌తో మొదలై జూలై వరకు ఈ స్కీమ్‌ను అమలు చేస్తారు. ఫేమ్–2 సబ్సిడీ పథకం ఈ ఏడాది మార్చి 31న ముగుస్తుండడంతో ప్రభుత్వం కొత్త పథకాన్ని పరిచయం చేసింది.

పసిడి రుణాలను సమీక్షించుకోండి

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇస్తున్న పసిడి రుణాల్లో నిబంధనల ఉల్లంఘన జరుగుతుండటంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఇలాంటి పలు ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని, ఈ నేపథ్యంలో బంగారం రుణాల పోర్ట్‌ఫోలియోను సమగ్రంగా సమీక్షించుకోవాలని పీఎస్‌యూ బ్యాంకులన్నింటికీ సూచించింది. ఈ మేరకు బ్యాంకుల చీఫ్‌లకు లేఖ రాసినట్లు ఆర్థిక సర్వీసుల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. బంగారం రుణాలపై ఫీజులు.. వడ్డీల వసూళ్లు .. ఖాతాల మూసివేతలో అవకతవకలు జరుగుతుండటం, తగినంత విలువ గల బంగారాన్ని తనఖా పెట్టించుకోకుండానే రుణాలివ్వడం, నగదు రూపంలో రీపేమెంట్లు తీసుకోవడం తదితర ఉల్లంఘనలపై డీఎఫ్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా 2022 జనవరి 1 నుంచి 2024 జనవరి 31 వరకు మంజూరైన రుణాలపై సమీక్ష జరగనుంది.

రామ్‌కో సిమెంట్స్ గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్ట్ ప్రారంభం




భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురం గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ యూనిట్‌లో 'గతి శక్తి కార్గో టెర్మినల్ ప్రాజెక్ట్'ను బుధవారం వర్చువల్ పద్ధతిలో ఆవిష్కరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-3-2024	
విశాఖ	450–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	433–00
విజయవాడ	433–00
రిటైల్ ధర (డజను)	72.00
13-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

చిన్న షేర్ల పెద్ద క్రాష్



- కుప్పకూలిన ఈక్విటీ మార్కెట్
- 73 వేల దిగువకు సెన్సెక్స్
- 22 వేల కిందికి నిఫ్టీ

సెన్సెక్స్ భారీ పతనంతో బీఎస్ఈలో రూ.13.47 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.372 లక్షల కోట్లకు దిగివచ్చింది. గత 3 రోజుల్లో రూ.20.69 లక్షల కోట్ల సంపద ఆవిరైంది.

ముంబై: చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్ల భారీ పతనంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ బుధవారం కుప్పకూలింది. అమెరికా ద్రవ్యోల్బణం దిగిరాకపోవడంతో 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు' ఆశలు సన్నగిల్లాయి. ట్రేడింగ్‌లో వినిమయ, ఇంధన, మెటల్ షేర్ల భారీ పతనంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ 73,000, నిఫ్టీ 22,000 స్థాయిలను కోల్పోయాయి.

లాభాల నుంచి భారీ నష్టాల్లోకి

ద్రవ్యోల్బణం 4 నెలల కనిష్టానికి దిగివచ్చిన సానుకూల సంకేతాలతో ఉదయం స్టాక్ సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ఉదయం సెన్సెక్స్ 325 పాయింట్లు పెరిగి 73,993 వద్ద, నిఫ్టీ 96 పాయింట్లు బలపడి 22,432 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అయితే చిన్న, మధ్య తరహా షేర్లలో నెలకొన్న అమ్మకాలతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఈ షేర్ల ట్రేడింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయన్న సెబీ చైర్మన్ మాధవీ పురి ఇటీవలి వ్యాఖ్యలు దీనికి నేపథ్యం. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,152 పాయింట్లు క్షీణించి 72,516 వద్ద, నిఫ్టీ 430 పాయింట్లు దిగివచ్చి 21,906 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 906 పాయింట్లు నష్టపోయి 72,762 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 338 పాయింట్లు పతనమై 21,997 వద్ద స్థిరపడ్డాయి.

- స్కాటిష్ చమురు కంపెనీ కెయిర్న్‌కు రూ.77.6 కోట్లు చెల్లించాలంటూ సెబీ ఆదేశాలు జారీ చేయడంతో వేదాంత లిమిటెడ్ షేరు 7% నష్టపోయి రూ.252 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 8% నష్టపోయి రూ.250 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. కంపెనీకి రూ.6,858 కోట్ల నష్టం వాటిల్లింది.
- మార్కెట్ పతనంలో భాగంగా అదానీ గ్రూప్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మొత్తం పదింటికి గానూ ఏడు కంపెనీల షేర్లు నష్టపోయాయి

● జీజే కెమికల్స్ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.221)తో పోలిస్తే 4.52% డిస్కౌంట్‌తో రూ.211 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 18% క్షీణించి రూ.181 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 16% నష్టపోయి రూ.185 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.724 కోట్లుగా నమోదైంది.

ఎఫ్అండ్‌వోపై దృష్టి ఆందోళనకరం

రిటైల్ ఇన్వెస్టర్లకు సీఈఏ హెచ్చరిక



అత్యధిక రిస్కులతోకూడిన ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్అండ్‌వో)లో లావాదేవీలు చేపట్టేందుకు రిటైల్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం ఆందోళనకరమని ప్రధాన ఆర్థిక సలహాదారు(సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ తాజాగా పేర్కొన్నారు. తక్షణ లాభాలపై దృష్టి పెట్టడం పెట్టుబడుల పురోగతికి ప్రతికూలమని సెబీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు.

2026 ఆఖర్లో
టాటా 'ధోలేరా' చిప్

టాటా, సీజీ పవర్ సెమీకండక్టర్ల ప్లాంట్ల శంకుస్థాపనలో కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడి



కార్యక్రమంలో కేంద్రమంత్రి వైష్ణవ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తదితరులు

ధోలేరా (గుజరాత్): టాటా ఎలక్ట్రానిక్స్ తలపెట్టిన ధోలేరా (గుజరాత్) ప్లాంటు నుంచి చిప్‌ల తొలి బ్యాచ్ 2026 డిసెంబర్ నాటికి అందుబాటులోకి రాగలదని కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్లాంటులో 28, 50, 55 నానోమీటర్ నోడ్‌ల చిప్స్ తయారు కానున్నాయని పేర్కొన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన రెండు, సీజీ పవర్‌కి చెందిన ఒక చిప్ ప్లాంటుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ఈ మూడింటిపై కంపెనీలు మొత్తం రూ.1.26 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. మూడు భారీ సెమీకండక్టర్ల ప్లాంట్లకు ఒకే రోజున శంకుస్థాపన చేయడం రికార్డని మంత్రి చెప్పారు. 2029 నాటికి టాప్ 5 సెమీకండక్టర్ల వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టాటా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ల ప్రాజెక్టులతో అస్సాంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 72,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగగలదని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు.

ఫినో పేమెంట్స్ బ్యాంక్‌లో ఇద్దరు మహిళా డైరెక్టర్లు

ముంబై: ఫినో పేమెంట్స్ బ్యాంక్ తాజాగా అనితా సుధీర్ పాయ్, నీతా ముఖర్జీలను తమ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్లుగా నియమించుకుంది. వారికి సుమారు మూడు దశాబ్దాల పాటు బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్నట్లు సంస్థ తెలిపింది. అనిత ఇటీవలి వరకు యస్ బ్యాంక్ సీవోవోగా వ్యవహరించగా, నీతా ముఖర్జీ ఐసీఐసీఐ బ్యాంక్..ఆర్‌బీఎల్ బ్యాంక్ మొదలైన వాటిల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.



అనితా సుధీర్ పాయ్ నీతా ముఖర్జీ

హెచ్‌ఐఎల్ చేతికి టాప్‌లైన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీకే బిర్లా గ్రూప్ కంపెనీ అయిన హెచ్‌ఐఎల్ తాజాగా పైప్స్, ఫిట్టింగ్స్ బ్రాండ్ టాప్‌లైన్‌ను కొనుగోలు చేసింది. టాప్‌లైన్‌ను ప్రమోట్ చేస్తున్న క్రెస్టియా పాలిటెక్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. డీల్ విలువ రూ.265 కోట్లు. డీల్‌లో భాగంగా క్రెస్టియాకు చెందిన అనుబంధ కంపెనీలు టాప్‌లైన్ ఇండస్ట్రీస్, ఆదిత్య పాలిటెక్నిక్, ఆదిత్య ఇండస్ట్రీస్, సాయినాథ్ పాలిమర్స్ సైతం హెచ్‌ఐఎల్ పరం అయ్యాయి. తూర్పు భారత్‌లో టాప్‌లైన్‌కు ప్రముఖ బ్రాండ్‌గా పేరుంది. 2023–24లో క్రెస్టియా, అనుబంధ కంపెనీల మొత్తం అంచనా టర్నోవర్ రూ.330 కోట్లు అని హెచ్‌ఐఎల్ వెల్లడించింది.

ఆసరాతో అగ్రపథం..

ఏపీ పొదుపు సంఘాల సభ్యుల సగటు వార్షిక ఆదాయం రూ.2.80 లక్షలు

2019 తరువాత సభ్యుల రోజువారీ ఆదాయంలో భారీ పెరుగుదల

రూ.100 నుంచి రూ.373కి పెరిగిన రోజువారీ ప్రాథమిక ఆదాయం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని మహిళా పొదుపు సంఘాలు ఆదాయపరంగా దేశంలోనే అగ్రగామిగా నిలిచాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఏపీలోని సంఘాల సభ్యుల వార్షిక ఆదాయం అత్యధికంగా ఉందని, 2019 నుంచి 2024 నాటికి వారి రోజువారీ ఆదాయం భారీగా పెరిగిందని నివేదిక తెలిపింది. పొదుపు సంఘాలకు సంబంధించి దేశవ్యాప్తంగా అత్యధిక సగటు ఆదాయం కలిగిన 20 జిల్లాల్లో 15 గ్రామీణ జిల్లాలే కాగా ఇందులో తొమ్మిది జిల్లాలు ఏపీలోనే ఉండటం గమనార్హం. డిజిటల్ లావాదేవీల్లోనూ ఆంధ్రప్రదేశ్ మహిళా పొదుపు సంఘాలు ముందు వరుసలో నిలిచాయి. పొదుపు సంఘాల సభ్యులు సాధికారతతో లక్షాధికారులుగా అవతరిస్తున్నారని నివేదిక విశ్లేషించింది. ఇటీవల వారి ఆదాయాలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో మహిళా పొదుపు సంఘాల సభ్యుల క్రెడిట్ ఆదాయాలపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం పొదుపు మహిళలను ప్రోత్సహిస్తూ అమలు చేసిన ఆసరా, చేయూత, సున్నా వడ్డీ లాంటి పథకాలు, బ్యాంకు రుణాలతో తోడ్పాటు, మల్టీ నేషనల్ కంపెనీలతో అనుసంధానం లాంటివి సత్ఫలితాలనిచ్చినట్లు స్పష్టమవుతోంది. తద్వారా ఎన్‌పీఏల రేటు గణనీయంగా తగ్గిపోయి రికవరీ బాగుండటంతో పెద్ద ఎత్తున రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయి. సకాలంలో చెల్లింపులు కారణంగా వారి రుణ పరపతి సైతం పెరిగింది. గత సర్కారు హయాంలో ఏపీలో పొదుపు సంఘాల ఎన్‌పీఏలు ఏకంగా 18.36 శాతం ఉండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆసరా, సున్నావడ్డీ పథకాల ద్వారా ఆదుకుని జీవం పోయడంతో ఇప్పుడు ఎన్‌పీఏలు గణనీయంగా 0.17 శాతానికి తగ్గిపోయాయి.

- ఆంధ్రప్రదేశ్ తరువాత అత్యధిక వార్షిక ఆదాయం కలిగిన మహిళా పొదుపు సంఘాల సభ్యుల్లో తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్, కేరళ, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలున్నాయి. మరో ఏడాదిలోగా హర్యానా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్నాటక, జార్ఖండ్ పొదుపు సంఘాల సభ్యుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటనుంది.
- వచ్చే రెండేళ్లలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ మహిళా పొదుపు సంఘాల సభ్యుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటనుంది.
- 2027 నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మహిళా పొదుపు సంఘాల సభ్యులు లక్షాధికారులై గేమ్ ఛేంజర్‌గా నిలుస్తారు. మహిళా పొదుపు సంఘాల సభ్యులు లక్షాధికారులుగా అవతరించడమే కాకుండా వారి కార్యకలాపాలను విస్తృతం చేస్తూ సంపదను సృష్టించి పునఃపంపిణీ చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లోని 72.7 శాతం మహిళా పొదుపు సంఘాల లావాదేవీలు ఇప్పుడు మెట్రో ప్రాంతాలకు, బయట జిల్లాలకు విస్తరించాయి. 20 కి.మీ. నుంచి 2,000 కి.మీ. పరిధిలో రాష్ట్రం లోపల, బయట కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా 65 శాతం మంది ఆదాయపరంగా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 30.5 శాతం గ్రామీణ ఏటీఎం లావాదేవీలు పట్టణాలు, మెట్రో ప్రాంతాలు, ఆయా జిల్లాల వెలుపల జరుగుతున్నాయి.
- పొదుపు సంఘాల ద్వారా వచ్చే ఆదాయాన్ని సభ్యులు వారి సొంత జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లి వ్యయం చేయడం పెరిగిన వారి కొనుగోలు శక్తిని సూచిస్తోంది.
- విజయనగరం జిల్లాకు చెందిన పొదుపు సంఘాల సభ్యులు 68 కి.మీ. ప్రయాణించి విశాఖలో వ్యయం చేయగా శ్రీకాకుళం జిల్లా సంఘాల సభ్యులు 1,115 కి.మీ. ప్రయాణించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ జిల్లాలో వ్యయం చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన మహిళా సభ్యులు 1,647 కిలోమీటర్ల మేర ప్రయాణించి ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లాలో వ్యయం చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన మహిళా సభ్యులు 2,074 కి.మీ.ప్రయాణించి ఢిల్లీలో వ్యయం చేశారని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. వ్యాపారాల నిమిత్తం వారు వివిధ ప్రాంతాలకు వెళ్లి లావాదేవీలు నిర్వహించి ఉంటారని పేర్కొంది.

టాప్ గ్రామీణ జిల్లాల్లో పొదుపు సభ్యుల రోజు వారీ సగటు ఆదాయం (రూపాయల్లో)

జిల్లా	2020	2021	2022	2023	2024
అన్నమయ్య	150	197	228	289	368
నెల్లూరు	131	171	231	265	380
వైఎస్సార్	155	200	261	272	419
ఎన్టీఆర్	138	185	236	313	473
చిత్తూరు	102	148	200	225	376
తిరుపతి	115	128	186	308	401
పశ్చిమ గోదావరి	123	149	190	205	305
ఏలూరు	143	178	188	226	315
శ్రీకాకుళం	124	153	209	295	336
రాష్ట్ర సగటు	139	180	235	278	373

ఐదేళ్లలో మూడు రెట్లు దాటిన ఆదాయం

2019లో ఆంధ్రప్రదేశ్ పొదుపు మహిళా సంఘాల సభ్యుల రోజు వారీ సగటు ఆదాయం రూ.100 మాత్రమే కాగా 2024 నాటికి రూ.373కి చేరుకుంది. ఐదేళ్లలో ఏపీలో మహిళా సంఘాల సభ్యుల ఆదాయం అత్యధికంగా పెరిగిందని నివేదిక పేర్కొంది.

పొదుపు సంఘాల సభ్యుల 2024 సగటు వార్షిక ఆదాయం (రూ.లక్షల్లో)

ఆంధ్రప్రదేశ్	2.8	కర్నాటక	1.1
తెలంగాణ	2.7	ఒడిశా	1.1
తమిళనాడు	2.5	బిహార్	1.0
ఉత్తరప్రదేశ్	2.4	హర్యానా	1.0
కేరళ	2.0	మధ్యప్రదేశ్	0.9
పంజాబ్	1.9	పశ్చిమబెంగాల్	0.8
గుజరాత్	1.4	జార్ఖండ్	0.7



16న వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రకటన

ఒకేసారి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలను ప్రకటించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్నికల సమర భేరి మోగించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. జనబలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామక ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు. ఒకవైపు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి సెగలు పొగలు కక్కుతుండగా రెట్టించిన ఉత్సాహంతో అభ్యర్థులను ఖరారు చేసి కదనరంగంలోకి దూకేందుకు వైఎస్సార్ సీపీ సన్నద్ధమైంది. ఈమేరకు ఈనెల 16వతేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద 2019 ఎన్నికల తరహాలోనే ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించనున్నారు. ఆ వెంటనే ఈనెల 18 నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. రోజుకు రెండు లేదా మూడు సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధమైంది. రోజూ ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు చోట్ల బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు.

ఉరిమే ఉత్సాహంతో..

ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు(రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లో నిర్వహించిన సిద్ధం సభల ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఆ సభలకు జనం పోటెత్తడం, ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ కావడంతో ఉరిమే ఉత్సాహంతో కదనరంగంలోకి దూసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధంగా ఉన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతను చాటుకున్నారు. ఈ ఎన్నికల్లోనూ అమలు చేయగలిగే హామీలతో మేనిఫెస్టో రూపకల్పనపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అది తుది దశకు చేరుకుంది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే మేనిఫెస్టోను విడుదల చేసి ప్రచార భేరి మోగించాలని సీఎం జగన్ నిర్ణయించారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రకటించేలోగా ప్రచారంలో దూసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.

చేసిన మంచిని వివరిస్తూ.. మోసాలను ఎండగడుతూ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎంతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు ప్రజల్లోనే ఉన్నారు. జనంతో మమేకమవుతూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా 87 శాతం కుటుంబాల ఖాతాల్లో డీబీటీ రూపంలోనే రూ.2.65 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ నేరుగా జమ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ, సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ఇంటి గుమ్మం వద్దే అందిస్తున్నారు. వీటితోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన అంశాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రచారపర్వంలో వివరించనున్నారు. ఇదే అంశాలను ఇంటింటా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తెలియచేయనున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో 650 హామీలతో మేనిఫెస్టోను ప్రకటించి కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చాక టీడీపీ–బీజేపీ–జనసేన ప్రభుత్వం పది శాతం హామీలను కూడా అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేసింది. మళ్లీ ఇప్పుడు అదే కూటమి ఎన్నికల బరిలోకి దిగి హామీలు గుప్పిస్తూ మరోసారి మోసం చేసేందుకు వస్తోందనే అంశాన్ని సీఎం జగన్ ప్రజలకు వివరించనున్నారు. ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ఇవే అంశాలను తెలియచేస్తాయి.

2018 గ్రూప్-1 మెయిన్స్ రద్దు

తిరిగి పరీక్ష నిర్వహించాలని హైకోర్టు ఆదేశం

- అర్హుల జాబితా రద్దు
- 6 నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టీకరణ
- పరీక్షకు ముందు అభ్యర్థులకు రెండు నెలల సమయం ఇవ్వాలని ఆదేశం
- నిబంధనల ప్రకారమే మూల్యాంకనం చేయాలని ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2018లో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మాన్యువల్ మూల్యాంకనాన్ని హైకోర్టు చట్ట విరుద్ధంగా, ఏకపక్ష చర్యగా ప్రకటించింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని తేల్చింది. అందువల్ల గ్రూప్ –1 మెయిన్స్ పరీక్ష మొత్తాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. నిబంధనల ప్రకారమే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని చెప్పింది. పరీక్ష నిర్వహణకు ముందు అభ్యర్థులకు కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని ఆదేశించింది. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. 2022 మే 26న ఏపీపీఎస్సీ ప్రకటించిన అర్హుల జాబితాను కూడా రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు వెలువరించారు. 'పబ్లిక్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా ఉండాలి. పోస్టుల భర్తీ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగడంపైనే అభ్యర్థుల జీవితాలు ఆధారపడి ఉంటాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. ఒకసారికి మించి మాన్యువల్ మూల్యాంకనం చేసేందుకు నిబంధనలు అనుమతించకపోయినప్పటికీ, అధికారులు రెండుసార్లు మాన్యువల్ మూల్యాంకనం చేశారు. మరికొన్ని పత్రాలను మూడోసారి కూడా మూల్యాంకనం చేశారు. ఇది చట్ట విరుద్ధం. రెండు, మూడోసారి చేసిన మూల్యాంకనం మొత్తం మూల్యాంకనంపైనే అనుమానాలు రేకెత్తించింది. ఇలాంటప్పుడు అర్హులైన అభ్యర్థులు కూడా నష్టపోయే అవకాశం ఉంది. అనర్హులు లబ్ధి పొందే అవకాశం ఉంది. కోర్టు ముందున్న ఆధారాలను పరిశీలిస్తే, పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారన్న విషయాన్ని పిటిషనర్లు నిరూపించగలిగారు. మూల్యాంకనంలో నిష్పాక్షికతను కొనసాగించడంలో అధికారులు విఫలమయ్యారు. మూడుసార్లు జరిపిన మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడి ఎవరు లబ్ధి పొందారన్న విషయాన్ని గుర్తించడం సాధ్యమయ్యే పనికాదు. అందువల్ల మొత్తం పరీక్షనే రద్దు చేయడం ఉత్తమం' అని జస్టిస్ నిమ్మగడ్డ తన 85 పేజీల తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే పోస్టింగులు తీసుకున్న అభ్యర్థులు హైకోర్టు తుది తీర్పునకు కట్టుబడి ఉంటామని, భవిష్యత్తులో మిగిలిన అభ్యర్థులతో సమానంగా ఎలాంటి హక్కులూ కోరబోమంటూ అఫిడవిట్ దాఖలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

మూల్యాంకనంలో అక్రమాలంటూ పిటిషన్లు

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షా పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని, అందువల్ల పరీక్షను రద్దు చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ తరువాత డిజిటల్ మూల్యాంకనంపైనా పిటిషన్లు దాఖలు చేశారు. పలు సందర్భాల్లో వీటిపై హైకోర్టు విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై ధర్మాసనం విచారణ జరిపింది. ఇంటర్వ్యూలకు, ఎంపిక ప్రక్రియకు అనుమతినిచ్చింది. అయితే వారి నియామకాలన్నీ కూడా అంతిమంగా సింగిల్ జడ్జి ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. అనంతరం సింగిల్ జడ్జి అన్ని వ్యాజ్యాలపై తుది విచారణ జరిపారు. ఇరుపక్షాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్నారు. బుధవారం తీర్పు వెలువరించారు. మూల్యాంకనం విషయంలో పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలు, వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. అక్రమాలు రుజువైనందున మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

రాంపురంరెడ్డి సోదరులకు మాతృవియోగం

- నేడు కొనకండ్లలో అంత్యక్రియలు
- పాల్గొననున్న సీఎం వైఎస్ జగన్



ఆదోని టౌన్: రాంపురంరెడ్డి సోదరుల మాతృమూర్తి ఎల్లారెడ్డి లలితమ్మ (80) బుధవారం రాత్రి 9:15 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కర్నూలు జిల్లా ఆదోనిలోని మధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఎల్లారెడ్డి లలితమ్మకు ఏడుగురు (ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె) సంతానం. ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి ఆమె కుమారులు. లలితమ్మ అంత్యక్రియలు గురువారం అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. లలితమ్మ అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

12 ఎంపీ స్థానాలకు ఏఆర్‌వోల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 12 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ప్రస్తుతం ఉన్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అదనంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే 12 పార్లమెంటరీ నియోజకవర్గాలకు గత ఏడాది ఆగస్టులో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించింది. వీరికి అదనంగా 12 నియోజకవర్గాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించింది. శ్రీకాకుళం ఏఆర్‌వోగా ఆ జిల్లా జెడ్పీ సీఈవో, కాకినాడకు డీఆర్‌వో, అమలాపురం నియోజకవర్గానికి అంబేడ్కర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ పీడీ, నరసాపురం ఏఆర్‌వోగా భీమవరం డీఆర్‌వో, గుంటూరు నియోజకవర్గానికి ఆ జిల్లా డీఆర్‌వో, నర్సరావుపేటకు పల్నాడు డీఆర్‌వో, బాపట్లకు ఆ జిల్లా సివిల్ సప్లైస్ డీఎం, ఒంగోలుకు పీఎస్‌వీపీ స్పెషల్ కలెక్టర్, కర్నూలుకు ఆ జిల్లా డీఆర్‌వో, అనంతపురం నియోజకవర్గానికి ఆ జిల్లా డీఆర్‌వో, నెల్లూరు నియోజకవర్గానికి టీజీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తిరుపతి నియోజకవర్గానికి ఆ జిల్లా డీఆర్‌వో అదనంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమితులయ్యారు.

నేటి నుంచి స్టార్ లేబులింగ్‌పై బీఈఈ వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: జాతీయస్థాయిలో ఎనర్జీ ఎఫిషియంట్ స్టార్ లేబులింగ్ అప్లయన్సెస్‌పై అవగాహన కల్పిస్తూ విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణకు మరింత చేయూతనందించేందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) శ్రీకారం చుట్టినట్లు సంస్థ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే తెలిపారు. మార్చి 14, 15 తేదీల్లో కేరళలోని కొచ్చిలో దక్షిణాది రాష్ట్రాల ఎస్‌డీఏలతో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏయూఈఈటీ 2024 షెడ్యూల్ విడుదల

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో పలు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏయూ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 (ఏయూఈఈటీ) నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రవేశాల సంచాలకులు డీఏ నాయుడు తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 24వ తేదీ వరకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రూ.750 అపరాధ రుసుంతో మే 1వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. హాల్‌టికెట్లను మే 3వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మే 5న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు రుసుంగా రూ.1200, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.1,000 చెల్లించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడపలోని పరీక్ష కేంద్రాలలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం విద్యార్థులు www.audoa.andhrauniverrity.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

'హలో కిడ్నీ.ఏఐ యాప్' నేడు ప్రారంభం



గుంటూరు మెడికల్: కిడ్నీ జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గుంటూరు వేదాంత హాస్పటల్‌కు చెందిన సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చింతా రామకృష్ణ రూపొందించిన హలో కిడ్నీ.ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)యాప్‌ను అధికారులు గురువారం మంగళగిరిలో ప్రారంభించనున్నారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)లను గుర్తించి చికిత్స చేయనున్నారు. ఫ్యామిలీ హెల్త్ సర్వే-2021 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏడాది కొత్తగా 13 వేల మంది డయాలసిస్ రోగులు తయారవుతున్నారు. దీనిలో వేల కొలది బాధితులు సీకేడీ జబ్బులోని ఐదో దశకు చేరుకుంటున్నారు. ఐదో దశలో కిడ్నీ ఫెయిల్ అయ్యేవారికి డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. డయాలసిస్ చేయించుకుంటున్న వారు 2-3 ఏళ్లకు మించి బతికే అవకాశం ఉండటం లేదు. ఈ క్రమంలో కిడ్నీ రోగులను తొలి 4 దశల్లోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారి తీసే పరిస్థితిని కట్టడి చేయవచ్చనే విషయాన్ని అంతర్జాతీయ సంస్థతో రెండేళ్లుగా పరిశోధనలు జరిపి తెలుసుకున్నట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్‌ను కలిసి వివరించగా..వారు 'హలో కిడ్నీ.ఏఐ యాప్'ను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌గా 2 జిల్లాల్లో ప్రారంభించేందుకు అనుమతిచ్చినట్లు చెప్పారు. కిడ్నీ కేసులు ఎక్కువగా నమోదవుతున్న ఉద్దానం, ఏ.కొండూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 2 మండలాల్లో కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తోన్న వైద్యులకు యాప్ ద్వారా ఏవిధంగా స్క్రీనింగ్ పరీక్షలు, చికిత్స చేయాలనే విషయాలను వివరిస్తామన్నారు. ప్రతి పీహెచ్‌సీలో నెఫ్రాలజిస్ట్, కిడ్నీ చికిత్స వైద్య పద్ధతులు అందుబాటులో ఉండేలా యాప్ ద్వారా చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరికి కిడ్నీ చికిత్స అందుబాటులోకి తీసుకు రావడమే హలో కిడ్నీ.ఏఐ ముఖ్య ఉద్దేశమన్నారు.

రామోజీ బధిర రాతలు


ఐదేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు

- బెస్ట్ ప్రాక్టీస్‌లను కీర్తించిన నీతిఆయోగ్
- ప్రతి జిల్లాకు రెండు చొప్పున క్లస్టర్లు
- సత్వర వివాదాల పరిష్కారానికి నాలుగు ప్రాంతీయ ఫెసిలిటేషన్ సెంటర్లు
- కొప్పర్తిలో రూ.250 కోట్లతో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ పార్కు
- కోవిడ్ సమయంలో రీస్టార్ట్ పేరుతో చేయూత
- ఏపీఎంఎస్‌ఎం ఈ-వన్ పేరుతో ప్రత్యేక పోర్టల్
- రూ.118 కోట్లతో ర్యాంప్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- ఇందుకోసం ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్‌ఎంఈ) వేగంగా విస్తరిస్తుంటే ఐదేళ్లు గాఢ నిద్రలో ఉన్న ఈనాడు రామోజీ వాటిపై విషం కక్కుతూ ఒక కథనాన్ని వండి వార్చారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వీటి సంఖ్య మూడు రెట్లు పెరిగింది. ప్రభుత్వ చర్యలను నీతి ఆయోగ్ ప్రశంసించింది. కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖ కీర్తించింది. కళ్లకు, చెవులకు గంతలు కట్టుకొని పడుకున్న రామోజీకి ఇవేవీ కనిపించలేదు. ''ఐదేళ్లు నిద్దరపోయి ఐదురోజుల్లో ఉద్ధరిస్తారట!'' అంటూ అవాస్తవ కథనాన్ని రాసేశారు. ఏషియన్ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలను కీర్తిస్తూ తాజాగా ఒక నివేదికను విడుదల చేసింది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర లాల్ దాస్ గడిచిన ఐదేళ్లలో ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మయోజన్, నైపుణ్య శిక్షణ కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన పనితీరు కనబరుస్తోందన్నారు. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈ పురోగతికి తిరుపతి, విజయవాడల్లో మరో రెండు ఎంఎస్‌ఎంఈ డీఎఫ్‌వో కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు సుభాష్ చంద్ర ప్రకటించారు.

మౌలిక వసతులకు పెద్ద పీట

ఎంఎస్‌ఎంఈలు ఒక సంఘంగా ఏర్పడి తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేసుకునే విధంగా క్లస్టర్ రూపంలో ఉమ్మడి మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇందుకోసం ప్రతీ జిల్లాలో కనీసం రెండు చొప్పున మొత్తం 54 క్లస్టర్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించింది. అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నది ఈ క్లస్టర్ల ప్రధాన ఉద్దేశ్యం. తాజాగా విజయనగరం జిల్లా ఎస్.కోటలో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. సుమారు రూ.531 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ పార్కు అందుబాటులోకి వస్తే 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అనకాపల్లి, కొప్పర్తిల్లో కూడా ఎంఎస్‌ఎంఈ పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ప్రభుత్వ, ఇతర సంస్థల నుంచి బకాయిలు వసూలు కాక ఇబ్బందులు పడుతున్న యూనిట్లకు అండగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలుల్లో ప్రాంతీయ ఫెసిలిటేషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్ల వ్యయంతో మరో టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ఇలాంటిది విశాఖపట్నంలో ఉంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాలు 25 శాతం తప్పనిసరిగా ఎంఎస్‌ఎంఈల నుంచే కొనుగోలు చేయాలంటూ చట్టం కూడా తీసుకు వచ్చింది.


ఐదేళ్లు నిద్దురపోయి..
ఐదు రోజుల్లో ఉద్ధరిస్తారట!

ఏడు లక్షలు దాటిన ఎంఎస్‌ఎంఈలు

గత ప్రభుత్వం దిగిపోయేనాటికి రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల సంఖ్య 1,93,530. ఈ ఏడాది ఆగస్టు ముగిసే నాటికి వాటి సంఖ్య ఏకంగా 7,72,802. కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ పోర్టల్ గణాంకాలు ఇవి.

ఈ నాలుగున్నర ఏళ్లలో కొత్తగా 15 లక్షలకు పైగా ఉపాధి లభించింది.	గత ఆర్థిక సంవత్సరంలో సగటున ప్రతీ నెలా సగటున కొత్తగా 11,379 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటైతే ఈ ఒక్క ఏడాదిలోనే 19,476కు చేరింది.

కోవిడ్ సమయంలో రీస్టార్ట్ ప్యాకేజీ, వైఎస్సార్ నవోదయం వంటి పథకాలతో ఎంఎస్‌ఎంఈ రంగం పునర్జీవం పొందింది.

గత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈలకు, స్పిన్నింగ్ మిల్లులకు బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను ఈ ప్రభుత్వం విడుదల చేసింది. రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలను అందించింది.

అభివృద్ధి కోసం సర్వే చేయడం కూడా తప్పేనా రామోజీ?

వచ్చే నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్యను, వాటి వ్యాపారాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో రూ.118 కోట్లతో రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ పెర్‌ఫార్మెన్స్ (ర్యాంప్) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎంఎస్‌ఎంఈల వివరాలను ప్రత్యేక సర్వే ద్వారా సేకరిస్తోంది. ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు కాని ఎంఎస్‌ఎంఈలను గుర్తించడం ఈ సర్వేలో ఓ భాగం. అవగాహన, శిక్షణ కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, బ్యాంకు రుణాలు, డిలేడ్ పేమెంట్, పోర్టల్‌కు అనుసంధానం వంటి ప్రయోజనాలను కల్పించేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.

సీఏఏపై తీవ్ర ఆందోళనలో ముస్లింలు

- ఇందులో మార్పులు చేయాల్సిన అవసరముంది
- ప్రస్తుత విధానంలో ఈ చట్టాన్ని అంగీకరించం
- మతాల పట్ల వివక్ష తగదు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



సాక్షి, అమరావతి: పౌరసత్వ (సవరణ) చట్టం గురించి ముస్లిం వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. కులాలు, మతాల పట్ల వివక్ష చూపించడం సరికాదన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైఎస్సార్‌సీపీకి అన్ని వర్గాలు ముఖ్యమే. అందరికీ భద్రత కల్పించటమే సీఎం జగన్ లక్ష్యం. ఈ బిల్లు ప్రస్తుతం ఉన్న పద్ధతిలో మాకు అంగీకారం కాదని.. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు వైఎస్సార్‌సీపీ చెప్పింది. కులాలు, మతాల పట్ల వివక్ష చూపిస్తే దేశానికి మంచిది కాదన్నది మా పార్టీ విధానం. ముస్లిం పర్సనల్ లా బోర్డుతో మాట్లాడి సంతులిత విధానం తీసుకు వస్తే మంచిదన్నది సీఎం జగన్ ఆలోచన. ముస్లిం వర్గాలకు సీఏఏ పూర్తి వ్యతిరేకంగా ఉంది. మేము ఈ చట్టాన్ని అంగీకరించేది లేదు. ఇందులో మార్పులు చేయాల్సిన అవసరముంది. దివంగత సీఎం వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి.. ముస్లింల హృదయాల్లో నిలిచిపోయారు. సీఎం వైఎస్ జగన్ కూడా ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారు. సీఏఏ తెచ్చిన బీజేపీతో కలిసిన చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు బుద్ధి చెబుతారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న దేశంలో చిచ్చులేపి ఎన్నికల సమయంలో లబ్ధిపొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకున్నారని.. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిని రాష్ట్ర ప్రజలు భూస్థాపితం చేస్తారు' అని అన్నారు.

ఫలానా వ్యక్తిని నిందితుడిగా చేర్చాలని ఆదేశాలివ్వలేం

హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఫైబర్ నెట్ కుంభకోణంలో మేజిస్ట్రేట్ ముందు సాక్ష్యం ఇచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి, అప్పటి ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్‌ను నిందితుడిగా చేర్చాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. న్యాయస్థానం విచారణ జరుపుతున్న కేసుల్లో ఫలానా వ్యక్తిని నిందితుడిగా చేర్చాలంటూ తాము ఎలాంటి ఆదేశాలివ్వలేమని తేల్చిచెప్పింది. ఈ విషయంలో పిటిషనర్‌కు ప్రత్యామ్నాయాలున్నాయని, వాటిని వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఫైబర్ నెట్ కుంభకోణంలో అప్పటి సీఎం చంద్రబాబు చెప్పినట్టు చేశానని, సంబంధిత ఫైళ్లపై ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా పంపానంటూ అజయ్‌జైన్ ఓ సాక్షిగా మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చారని, తప్పు చేసినట్లు అంగీకరించినందున ఆయన్ను ఆ కుంభకోణంలో నిందితునిగా చేర్చేలా సీఐడీని ఆదేశించాలంటూ ఏపీ టూమారో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నల్లమోతు చక్రవర్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది.

చట్టాలు చేయాలని పార్లమెంట్‌ను ఆదేశించలేం

- హైకోర్టు ధర్మాసనం
- హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచాలన్న పిల్ కొట్టివేత

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు వీలుగా చట్ట సవరణ చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు కొట్టేసింది. చట్టాలు చేయాలని తాము పార్లమెంట్‌ను ఆదేశించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. తమకూ కొన్ని పరిమితులు, పరిధులున్నాయని గుర్తు చేసింది. ఈ వ్యవహారంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఆస్తి, అప్పుల విభజన ఇంకా పూర్తి కాలేదని, ఈ విషయంలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైందని, అందువల్ల మరో పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా ఆదేశాలివ్వాలంటూ కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రజా సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి పొదిలి అనిల్‌కుమార్ ఇటీవల పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

నో వయొలెన్స్.. నో రీపోలింగ్

తేడాలొస్తే అధికారులదే బాధ్యత

- ఓటర్ల గుర్తింపు కార్డుల జారీని వేగవంతం చేయండి
- కలెక్టర్లు, ఎస్పీలకు ముకేశ్‌కుమార్ మీనా ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న మీనా

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో జీరో వయొలెన్స్, నో రీపోల్ ప్రధాన మంత్రాలు కావాలని.. అందుకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం సూచించిన ఈ రెండు మంత్రాల అమల్లో ఎటువంటి తేడా వచ్చినా అందుకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందనే విషయాన్ని గమనించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పటిష్టంగా పనిచేసే విధంగా ముందుగానే తగు ఏర్పాట్లు చేసుకోవాలని, బూత్ క్యాప్చరింగ్‌కు ఎటువంటి అవకాశం లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు కూడా చేసుకోవాలని సూచించారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కంట్రోల్ రూముల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని ముఖ్యమైన ఆదేశాలు, రాజకీయ పార్టీల అనధికార ప్రకటనలు, 50% పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల ప్రక్రియ వెబ్ కాస్టింగ్, ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, రోజువారీ పంపాల్సిన నివేదికలు తదితర అంశాలను జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లకు ఆయన వివరించారు.

గుర్తింపు కార్డుల జారీని వేగిరపర్చండి

ఓటర్ల గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని మీనా ఆదేశించారు. ఓటర్ల గుర్తింపు కార్డులను తప్పనిసరిగా పోస్టల్ ద్వారానే బట్వాడా చేయాలని, ఒక్క పాడేరు ప్రాంతం మినహా మరే ఇతర ప్రాంతాల్లో మాన్యువల్‌గా పంపిణీ చేయడానికి వీలు లేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. పెండింగ్ ఫారాలను సకాలంలో పరిష్కరించాలని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తదుపరి ఫారాల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతంగా అమలు పర్చాలని ఆదేశించారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు, బహుమతులను విరివిగా పంపిణీ చేస్తున్నట్టు వార్తా పత్రికల్లో కథనాలతో పాటు ఫిర్యాదులు కూడా వస్తున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపిన సంబంధిత నివేదికలను తమకు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ శాఖ చేస్తున్న ఏర్పాట్లను అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) ఎస్‌బీ బాగ్చీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలుతోపాటు ఎన్నికలకు ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తదుపరి అమలుచేయనున్న బందోబస్తు కార్యాచరణ ప్రణాళికను ఆయన వివరించారు. సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతోపాటు అదనపు సీఈవో ఎంఎన్ హరేందిర ప్రసాద్, డిప్యూటీ సీఈవోలు కె.విశ్వేశ్వరరావు, ఎస్.మల్లిబాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుని వసంతోత్సవం

రేణిగుంట(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో వసంతోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత వసంత మండపంలో శ్రీజ్ఞానప్రసూనాంబదేవి సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జలాభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఈవో నాగేశ్వరరావు దంపతులు అభిషేక పూజలు జరిపారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించి స్వామి, అమ్మవార్లను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి ఆలయంలో ధ్వజావరోహణం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు సింహ, కామధేను వాహనాలపై పుర వీధుల్లో ఊరేగారు. గురువారం పల్లకీ సేవ, శుక్రవారం ఏకాంత సేవతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సదరన్ ట్రావెల్స్ అన్నా నగర్ శాఖ ప్రారంభం


చెన్నైలోని అన్నానగర్‌లో సదరన్ ట్రావెల్స్ నూతన శాఖను ప్రారంభిస్తున్న ఐఓఎస్‌ఎఫ్ స్పెషల్ సెక్రటరీ బి.కృష్ణమూర్తి. చిత్రంలో మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి కృష్ణమోహన్

నేటి నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు



క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.2,090 చెల్లించేందుకు నిర్ణయం

సాక్షి, అమరావతి: మొక్కజొన్న కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గురువారం (ఈ నెల 14న) కొనుగోళ్లు ప్రారంభించి మే 15వ తేదీ వరకు కొనసాగించాలని నిర్ణయించింది. నాణ్యమైన క్వింటాల్ మొక్కజొన్నకు కనీస మద్దతు ధర రూ.2,090 చొప్పున చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ స్పెషల్ సీఎస్ అహ్మద్‌బాబు మార్గదర్శకాలు జారీ చేశారు. దీంతో ఆర్‌బీకేల ద్వారా రైతుల రిజిస్ట్రేషన్‌కు మార్క్‌ఫెడ్ చర్యలు చేపట్టింది.

రైతును నిలబెట్టేలా మద్దతు ధర

రాష్ట్రంలో రబీ 2023-24లో 4.75 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. రెండో ముందస్తు అంచనా ప్రకారం 16.82 లక్షల టన్నుల దిగుబడులొస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఉత్తరాంధ్రలో ఇప్పటికే కోతలు ప్రారంభం కాగా.. నెలాఖరు నాటికి ముమ్మరమవుతాయి. సీఎం యాప్ ద్వారా ప్రతిరోజు మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తున్నారు. అయితే.. పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్‌ను బూచిగా చూపి వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తారేమోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధర విషయంలో రైతులకు అండగా నిలవాలన్న సంకల్పంతో క్వింటాల్‌కు రూ.2,090 చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగింది. ఇందుకోసం ముందస్తుగానే ఏర్పాట్లు చేసి కనీసం 85 వేల టన్నులను సేకరించేందుకు అనుమతిచ్చింది.

కొనుగోలుకు పక్కా ఏర్పాట్లు

మొక్కజొన్న కొనుగోలుకు ఏపీ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ (ఆర్‌బీకే అండ్ ఆర్) నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేసింది. కొనుగోలుకు అవసరమైన టార్పాలిన్లు, తేమను కొలిచే మీటర్లు, డ్రయ్యర్లు, జల్లెడ, కుట్టు యంత్రాలు, వేయింగ్ మెషిన్లు వంటి వాటిని సమకూర్చే బాధ్యతను మార్కెటింగ్ శాఖకు అప్పగించింది. మొక్కజొన్న సేకరణకు అవసరమైన నిధులను ధరల స్థిరీకరణ నిధి నుంచి సమీకరించుకునే వెసులుబాటును మార్క్‌ఫెడ్‌కు కల్పించింది. అవసరమైతే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని రైతులకు సకాలంలో నగదు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. రుణాలపై వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుంచి తిరిగి చెల్లిస్తుంది. మొక్కజొన్నను నిల్వ చేసుకునేందుకు సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీలతో పాటు వ్యవసాయ, ఇతర గిడ్డంగులను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేసింది.

ధరలు పెరిగేలా చర్యలు



మార్కెట్‌లో మొక్కజొన్న ధరల హెచ్చుతగ్గులను సీఎం యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. సమీప రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉంది. ఏ ఒక్కరూ తొందరపడి అమ్ముకోవద్దు. మద్దతు ధర కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. ఇప్పటికే మినుము, పెసలు, వేరుశనగ, శనగ, జొన్నల సేకరణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తాజాగా మొక్కజొన్న కొనుగోలుకు కూడా అనుమతి ఇచ్చింది.

– గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

గన్నవరం ఓటర్లకు టీడీపీ గాలం

భారీగా చీరలు పంపిణీ చేస్తున్న యార్లగడ్డ అనుచరులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే ఓటర్లకు గాలం వేసేందుకు టీడీపీ రకరకాల ఎత్తుగడలను అవలంభిస్తోంది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తోంది. పరాజయం తప్పదని గ్రహించిన దేశం నేతలు ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకుగా ఉన్న పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లే టార్గెట్‌గా పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా ఓటర్లను రకరకాల ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తాము అధికారంలోకి రాగానే ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెబుతూ ముందుగానే పేదల నుంచి దరఖాస్తులు తీసుకొంటున్నారు. ఇప్పటికే గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల నుంచి ఆ పార్టీ గ్రామ కమిటీల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామానికి రెండు వందలనుంచి ఐదు వందల వరకు అప్లికేషన్లు పంపిణీ చేయడంతో పాటు పూర్తి చేసిన వాటిని తిరిగి తీసుకుంటున్నారు. ఇళ్ల స్థలాల పేరుతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండే వర్గాల ఓట్లు కొల్లగొట్టేందుకు టీడీపీ ఈ తరహా మోసాలకు పాల్పడుతోంది. గతంలో ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నామమాత్రంగా కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవు. అక్కడక్కడ అరకొరగా ఇచ్చినా, అవికూడా ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకే పంపిణీ చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ప్రైవేటు లేఅవుట్లను తలదన్నేలా అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇళ్లను కూడా మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. గన్నవరం నియోజకవర్గంలో 27వేల పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. మరో 12వేల కుటుంబాలకు రెండో దఫా పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలూ సిద్ధం చేశారు.

మహిళా ఓటర్లకు ఎర...!

మహిళల్లో తెలుగుదేశం పార్టీపై సానుకూలత లేదు. గతంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. ముఖ్యంగా డ్వాక్రా రుణమాఫీ చేస్తామని నిండా ముంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోంది. ప్రతి పథకాన్ని మహిళల పేరుతోనే మంజూరు చేస్తోంది. ఇంటి స్థలాలు, డ్వాక్రా రుణమాఫీ, చేయూత, అమ్మఒడి, సున్నా వడ్డీ, ఆసరా.. ఇలా అనేక పథకాలను అందజేసి మహిళా పక్షపాత ప్రభుత్వంగా మారింది. ఇచ్చిన మాట నెరవేర్చిన వైఎస్.జగన్ ప్రభుత్వంపై మహిళలంతా సానుకూలంగా ఉన్నారు. మరోసారి ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దీవించేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో చీరలను పంపిణీ చేస్తున్నారు. ఇటీవల బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ మహాత్మాగాంధీ నగర్లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తూ తెలుగు తమ్ముళ్లు అడ్డంగా దొరికిపోయారు. యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకే చీరలు పంపిణీ చేస్తున్నామని ఆ పార్టీ నాయకులు చెప్పడం గమనార్హం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943